జూలై 01-15, 2021

సంపుటి 01, సంచిక 18

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి 75 వసంతాలు



తెలంగాణ రైతాంగ సాయుధ
పోరాటంలో నేలకొరిగిన యోధుడు
**దొడ్డి కొమురయ్య**



తొలి తరం దళిత నేత,
సమతావాది, సంఘ సంస్కర్త,
హరిత విప్లవాన్ని సాకారం చేసిన పాలనాధక్షుడు

**కీ॥శే॥ బాబూ జగ్జీవన్ రామ్**

వర్ధంతి (06 జూలై) సందర్భంగా ఆయనకు ఘన నివాళులు.

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor,
Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక




కపట స్నేహం వల్ల
కలిగే అనర్థం తెలిపే
**వనాంబ నాటికథ** 05

09 **తెలంగాణ సారస్వత
పరిషత్** చారిత్రక పరిణామం
చెబుతున్న **డా॥ జె. చెన్నయ్య**





19 **నాటి తెలంగాణ సాయుధపోరాట**
గీతాలను పరిచయం చేస్తున్న
**సంగిశెట్టి శ్రీనివాస్** వ్యాసం



27 స్కూల్ టీచర్ సౌజన్యం తెలిపిన
**ఓ రోజు ఉదయాన్నే నాంపల్లి
సుజాత** కథ.



41 **ప్రతాప రుద్రుని కోటలోని
చారిత్రకాంశాలు** వివరించిన **కపిలవాయి
లింగమూర్తి** చారిత్రక వ్యాసం.



37 విరబూసిన నూతన దంపతుల ప్రేమ
సౌరభం తెలిపే **పిన్నం శెట్టి కిషన్**
కథ **జడలో జాజులు**



13 బడుగువర్గాల నీటి కష్టాలు చెప్పిన
**ఎయం. అయోధ్యారెడ్డి** కథ
**బిందెడు నీళ్ళు...**



39 నర్స్ ఉన్నతిని తెలిపే **సుంకర
రమేశ్** కవిత **నర్స్‌కు నమస్తే**



04
నాన్న మౌన శరీరం...
దాసరి మోహన్

**సాహితీవేత్త నియోగి స్మృతి... డా॥ అమ్మిన** వ్యాసం.. 45 పేజీలో
పాత వస్తువులపై మనిషి మమకారాన్ని తెలిపే **ఎడెల్లి రాములు** కవిత **నల్లకలువ...** 18 పేజీలో

ఇంకా....

పరిమళించే ప్రేమను విరబూసే **సరోజ వింజామర** కవిత... 47 పేజీలో

**మనస్సాక్షిలోకి... డా॥ కూర్మాచలం...** 07 పేజీలో

నాన్న వాత్సల్యాన్ని ప్రకటిస్తున్న కవితలు

**కలల బాటలో నాన్న... హరిప్రియ...** 12 పేజీలో

**పెద్దదర్వాజ... ఉదారి నారాయణ...** 40 పేజీలో

ఇంకా కొత్తపుస్తకం, సాహితీశిఖరం, దృశ్య సాహిత్యం, స్వీకారం మొదలైనవి.

# ‘తంగేడు’ పాఠకులకు ముఖ్య గమనిక

తెలంగాణ జాగృతి తెలంగాణ సంస్కృతి పరిరక్షణ కోసం నవ యువతను ప్రోత్సహించడం కోసం వెలువరిస్తున్న ‘తంగేడు’ సాహిత్య పక్ష పత్రికను ఆదరిస్తున్న పాఠకులందరికీ కృతజ్ఞతలు. అనూహ్యంగా కోవిడ్ సెకండ్‌వేవ్ విజృంభణ వల్ల పత్రికను నేరుగా ప్రింట్ కాపీను అందించలేక పోతున్నందుకు చింతిస్తున్నాం. ప్రస్తుతానికి పత్రికను వెబ్‌సైట్‌లో ఉంచడం జరుగుతుంది. పాఠకులు సహకరించగలరు. కోవిడ్ వ్యాప్తి తగ్గేంతవరకు ప్రింట్ కాపీ అందించలేకపోవచ్చు. పరిస్థితి అనుకూలించాక అందించగలం.

మేము అందించినంత కాలం ఎందరో పెద్ద రచయితలు, పాఠకులు ధర నిర్ణయించాల్సిందిగా ఎన్నో విజ్ఞప్తులు చేశారు. మీ కోరికను అనుసరించి కేవలం నామమాత్రమైన వెల రూ. 2/-, వార్షిక చందా రూ. 50/-లుగా నిర్ణయించడం జరిగింది. ప్రింట్ కాపీ మాత్రం చందాదారులకు మాత్రమే పంపడం జరుగుతుంది. పాఠకులు గమనించ ప్రార్థన. చందా దారులుగా, మా పాఠక సభ్యులుగా మన ‘తంగేడు’ కుటుంబంలో చేరండి. చందావివరాలు దిగువున ఇస్తున్నాం.




## ‘తంగేడు’ సంచిక వార్షిక చందా వివరాలు

‘తంగేడు’ పక్ష పత్రికను ఆదరిస్తున్న పాఠకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. తంగేడు పత్రిక ప్రతి సంచికను పొందేందుకు గాను, వార్షిక చందాదారులుగా చేరండి. ఇందుకోసం రూ.50 చెల్లించి, 24 సంచికలను పొందండి. చందాదారులుగా చేరేందుకు **http://www.thangedu.co.in** వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకొని, ఆన్ లైన్ లో నగదు చెల్లించేందుకు వీలు కల్పించడం జరిగింది. డెబిట్/క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, UPI ద్వారా నిర్ణీత నగదు చెల్లించగలరు. చెక్కుల ద్వారా కూడా వార్షిక చందాదారులుగా చేరవచ్చు.

**వార్షిక చందా చెక్కులను పంపవలసిన చిరునామా:**

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం.1-2-234/13/46/4,
3వ అంతస్తు, ఎన్.టి.ఆర్ స్టేడియం దగ్గర, అరవింద్ నగర్,
దోమలగూడ, హైదరాబాద్ - 500 029.

సంపాదకీయం

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

01-15 జూలై, 2021

సంపుటి 01 సంచిక 18



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

# ఔచిత్యం, అవశ్యం...

జీవితం ఔచిత్యవంతంగా ఉంటే నిండుదనంతో ప్రకాశిస్తుంది. సంభాషణలు, వ్యక్తీకరణలు, కుటుంబజీవితం, సాంఘిక జీవితం మనిషికి సంబంధించిన సమస్త రాగద్వేషాల వ్యక్తీకరణలు... చూస్తూ పోతే ప్రతి అంశంలోను ఔచిత్యం ఒక అనివార్యమైన అంశం. ఔచిత్యం మనిషి హుందాతనం పెంచుతుంది. సమాజంలో అతన్ని గౌరవనీయున్ని చేస్తుంది. సాహిత్యంలో కూడా అంతే. ఔచిత్యం తప్పక పాటించదగిందే. దీన్ని గురించి లాక్షణికులు గొప్ప సిద్ధాంతాలే చేశారు, క్షేమేంద్రుడు కావ్య రచనలో ఔచిత్యాన్ని ప్రతిపాదించిన విద్వాంసుడు. అయన దాదాపుగా ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతానికి ప్రత్యమ్నాయంగా ఈ సిద్ధాంతం ప్రతిపాదించాడు. ఔచిత్యం కావ్యరసపోషణకు అనుసరణీయం అని అయన నిర్వచించాడు.

అయితే ఇది ప్రాచీన కావ్యనిర్మాణానికి చెందిన సిద్ధాంతంగా ఆధునికులు భావిస్తారు. కాని అది సమంజసం కాదు. ఔచిత్యం ఆధునిక సాహిత్యానికి చెందిన అన్ని ప్రక్రియలకు చివరకు పత్రికా నిర్వహణకు కూడా అవసరమే. కాగా దాన్ని మరికొంత విస్తృతంగా అవలోకించాల్సి ఉంటుంది. ప్రక్రియా నిర్వహణలో రచయిత సందర్భానికనుగుణమైన సన్నివేశ కల్పన చేయాలి. భాష కూడా వస్తువును అనుసరించి ఉపయోగించాలి. ఎంతవరకు పెంచాలో, ఎక్కడ తగ్గించాలో, ఎట్లా ముగించాలో, ఇవన్నీ ఒక ప్రణాళిక ననుసరించే జరగాలి. ఈ విధానం ఏ సృజనకారునికీ ఒక్క రోజులో అలవడదు. ఏళ్ల సాధన జరిగాకనే ఇది పట్టువడుతుంది. ఔచిత్యం లేకుండా ఏ ప్రక్రియా పూర్ణత సాధించ లేదు. ప్రపంచ సాహిత్యమంతా సాహిత్యంలో ఔచిత్యాన్ని గుర్తించారు. చేయి తిరిగిన ఏ రచయిత అయినా ఔచిత్యం తన సృజనలో నిర్వహిస్తాడు. ఆంగ్లంలో దీన్ని Decorum అన్నారు.

అప్పుడప్పుడు కొంత మంది సృజనకారుల సంయమన రాహిత్యం వల్ల సాహిత్యవ్యక్తీకరణ లో అసభ్య పదజాలం చోటుచేసుకొంటుంది. వేదికలమీద ప్రసంగించేటపుడు కూడా నిగ్రహాన్ని కోల్పోయి సంభాషించడం చూస్తాం. ఇట్లాంటి భాషా ప్రయోగం వల్ల ఎట్లాంటి ప్రయోజనం ఉండదు. పైగా వాళ్ళు ఏ వాదాన్ని నమ్ముకొన్నారో ఆ వాదానికే అన్యాయం జరుగుతుంది. ఏ వర్గం కోసం గొంతు చించుకుంటారో ఆ వర్గానికే ఈ వాచాలత వాళ్ళను దూరం చేస్తుంది. కాబట్టి సాహితీవేత్త ప్రతి అంశంలోను ఔచిత్యం పాటిస్తే అతని వాదమైనా రచనైనా ఆశించిన ప్రయోజనాన్ని సాధించగలుగుతుంది.

జై తెలంగాణ, జై జాగృతి.

కవిత
కల్వకుంట్ల

కవిత

# నాన్న మౌన శోకం....



దాసరి మోహన్

నన్ను లోకంలో దింపి
అమ్మ తేలిక అయ్యింది
ఇక భారమంతా నాన్న పైనే

నడక నేర్పింది అమ్మే
నడత నాన్న బాధ్యతే
ఇక నిందలు మోయాల్సిందే

అక్షరాలు మొదలు పెట్టింది అమ్మే
చదువుల మోపు కొనాల్సింది నాన్నే
రాత్రి పగలు రికామ్ లేని యంత్రం

అమ్మకు సంతాన లక్ష్మి వరాలు
పళ్లెంలో ముద్దలు పెరిగాయి
నాన్న గుమ్మి నీ పెంచలేక పోయాడు

పెళ్ళిళ్ళు ఖర్చుల తోరణాలు
పెట్టుబోతలు తాకట్టు మించి పోయాయి
అటుక నిండా అప్పు కాగితాలే

ఎదురు తిరగడం
ఏ బడి నేర్పిందో
నాన్న పెద్దరికం అవమానం పాలు

పంపకాల కోసం పేచీల పంచాయితీ
గట్లు పెరిగి పొలం చిన్న పోయింది
నాన్న ఆశలు అన్నీ ముక్కలు ముక్కలుగా

అణుబాంబు కంటె విషాదం
కుటుంబ విచ్ఛిత్తి మిగిల్చేది
బతికుండగానే బంధాలు సమాధి

అమ్మకు పోటీ పడ్డారు కొడుకులు
ఆయా పనులు ఉచితం అని
నాన్న ఇప్పుడు పాలు పితకలేని పొదుగు

అమ్మకేం
తనివితీరా ఏడ్చేసి అల్కగయితది
నాన్నదే మౌన శోకం
గుండెలోనే పేరుకుని
కబురు చేయకుండానే కుప్ప కూల్చుతుంది



నాటి కథ

# సుగుణా! ఈ పొరపాటు నాదే

అమలిన స్త్రీ హృదయం చిత్రించిన కథ...

జె. వనాంబ

సాయంకాలము నాలుగున్నర గంటలయింది. కళాశాల నుండి యింటికి బయలుదేరాను. నామనసంతయు సుగుణమీఁదనే యుంది. సుగుణ బి.ఏ. తరఁగతి చదువుచుండెను. ఆమె తండ్రి రామచంద్రరావు గారు హైకోర్టు వకీలు. అతనికి బాల్య వివాహములంటె యిష్టము లేదు. మా నాన్నగారికి యతనికి చాలా స్నేహము. నేను తరచుగా వాళ్ల యింటికి వెళ్లడము, సుగుణ మా ఇంటికి రావటము అలవాటే. మా యిద్దఱకుఁ జాల స్నేహము. స్నేహమే కాదు ప్రేమ కూడాను.

ఆనాడు యింటికి రాగానే పుస్తకాలు టేబుల్ మీఁద నుంచాను. ఈజీ ఛైర్‌లో కూర్చున్నాను. నాకేమి తోచలేదు. వెంటనే దిగ్గున లేచాను. మా యింటికెదురుగా నున్న మేడ వద్దకు వెళ్ళాను. "సుగుణా!" యని పిలిచాను. సుగుణ తలుపు తీసింది. "నీవా! వినయకుమారా!" అంది. ఆ పలుకులకుఁ దీసిపోని యాహ్వానము, అంతకు మించిన యాదరణ లోపలికి వెళ్ళి కూర్చున్నాను. నా ప్రక్కనే సుగుణ కూర్చుంది ముద్దుగాఁ దన ప్రణయాబ్ధి కల్లోలము ఉప్పొంగ "వినయా! ప్రొద్దున్నే రాలేదెందుకు? నీవు వస్తావని చాలాసేపు కాఫీ త్రాగకుండ కనిపెట్టుకున్నా"నంది సుగుణ.

నేను రావలెనని తయారవుచున్న, తంతి యొక్కటి వచ్చింది 'మా నాన్నగారు కలకత్తా నుండి వస్తున్నాఁడని, సెంట్రల్ స్టేషన్‌లోఁ గలియుమని' ఉంది. అప్పటికే పోఁదగిన మేరకుఁ దగిన కాల మతిక్రమించుట నీకుం దెల్పక పోవలసి వచ్చినది.

ఇంతలో రామచంద్రరావు గారు వచ్చి "రాఘవేంద్రరావు గారు వచ్చారేమిటి" అన్నారు.

ఔను! ఈ దిన ముదయము తొమ్మిదిన్నర గంటలకు వచ్చు బండిలో వచ్చారన్నాను నేను.

"నాన్నగారూ! కారు తెప్పించరు? నేను వినయకుమారుఁడు షికారు పోయి వస్తాము బీచి దగ్గరికి" అంది సుగుణ. కారు గుమ్మము వద్ద నా కొఱకు తయారవుతుంది మీరు దానిలోఁ బోయిరండి. నేను తరువాత వెళ్లతానులే" అన్నారు రామచంద్ర రావుగారు. మేము మద్రాసు బీచి వద్ద తిరుగుచుండగా నాతో, ఎం.ఏ. చదువుచున్న సుందర్రావు, కృష్ణారావులు కనిపించారు. మావైపు చూచి యేమో రహస్యము మాట్లాడుకున్నారు. తరువాత సుందర్రావు మా దగ్గఱకు వచ్చాఁడు. నన్ను వేళాకోళముగా "ఏమిరా! వినయకుమార! పరీక్షకు బాగా చదువుచున్నావురా?" అన్నాడు నన్నుఁజూచి. నాకు చాలా కోపం వచ్చింది. మమ్ములను జూచి గుసగుసలాడటము నన్ను హాస్య మాడటము నాకు బాగనిపించలేదు. వాని మాటలకు మేము జవాబియ్యక వెనకకుఁ దిరిగి వెళ్ళాము. ఇంతలోఁ జీకటి పడగా సుగుణను విడువలేక విడువలేక విడిచి యామె యింట నుండి మా యింటికి వెళ్ళాను.

నాకదేమో కాని అన్నము రుచించింది కాదు. నిద్రసలే రాలేదు. సుగుణ! యెదుట నిలుచున్నట్లుంది. కొంచెము సేపటికి నా వళ్ళు నేను మఱచిపోయాను. నేను లేచేసరికి ఉదయమేడు గంటలయింది. సుగుణ నా దృష్టి పథమునఁ గనఁబడి తన యింటికి ప్రేమ ప్రభావమున బిలుచుకొంది. ఇంటికి వెళ్ళాను.

సుందరరావు నాకన్న ముందే వచ్చి కాఫీ త్రాగుచుండెను. వాని వైఖరి నాకు బాగనిపించలేదు. వాని మాటలు హాస్యాస్పదముగా నుండెను. కాని మా సుగుణ ముఖము నందేమి వికారము దోపఁలేదు. అంతేకాక నేను వెళ్ళిన వెంటనే వాఁడు వెళ్ళినాఁడు. నేనెప్పుడేవగించు వానిని దానింత ప్రేమించటానికి హేతువు తెల్పింది కాదు. మేమిద్దఱమే మియుఁ బ్రసంగించుకొనను లేదు. నన్ను జూచినంతనె నేరస్థుని వలె గడబిడ పడ్డట్టు నటించి బయల్పడటం నన్నింకా అనుమానమునకుఁ బ్రేరేపించింది.



నాటి కథ

పాపము! అన్యము, పుణ్యము నెఱుఁగని యబల సుగుణ. కాకున్న ఱంకు నేర్చినమ్మ బొంక నేర్వదా!

"సుగుణా సుందరరావెందుకు వచ్చాఁడు వాని ప్రవర్తన నాకేమి బాగనిపించలేద"ని అన్నాను నేను.

"నాకేమి తెలుసు. వస్తె కాఫీ యిచ్చాను. వాని ప్రవర్తన మెందుకు బాగు లేదంటున్నావో నా కర్థము కాలేదు".

"వాఁడెలా మాట్లాడుచున్నాఁడో నీవు గ్రహించావా?"

"ఏమి? బాగానే మాట్లాడాడే! నాకేమి తప్పనిపించలేదు. అతని మాటలు నవ్వుటాలుగా నున్నాయి. సుగుణ విద్యావంతురాలయినను జాల అమాయకురాలు. ఎవరైనను దనను కొంచెము సేపు గడిపిన నాత్ములనుకొనేది. సుందరరావో దుర్మార్గుఁడు. క్షీరోదక, న్యాయంబునఁ జెలఁగు మైత్రిలిటి మరాలము. మా సుగుణ మనస్సు నాకు తెలిసి యున్నను నాదృశ్యము నన్నంత యనుమానగ్రస్తునిగాఁ జేసింది. నేనేమిటి? తన ప్రేయసి నింకొకడు మనసార ముచ్చటించుట గాంచి, సహించు నిష్కామ యోగి యెవఁడు? కొంచెము సేపటికే యింటికి వెళ్ళాను. కాని నాకేమి తోచలేదు. అన్నము రుచింపలేదు. నిద్ర పట్టలేదు. నాకండ్ల ఎదుట నేను చూచినదంతా తెరకట్టినట్లు కనిపిస్తుంది. వాఁడు గూర్చున్న స్థానము, ఆ మాటలు నన్ను యుద్రేకునిగా జేసాయి. మా సుగుణ ప్రేమలో ఏదో మార్పు కలిగిందనుకున్నాను. "విశ్వందర్శన మన్నాఁడు ఆత్మావబోధకుడు. తన కొకరిపై ప్రేమయుంటే తన్ను వారు ప్రేమించునట్లనుకొనుట మానవ స్వాభావికము. కాబట్టే గదా దేవత్వము మాని తన్ను వరించిన సతిని నట్టడవిని విడిచి వస్త్రార్థము గొని కొండచిలువల, కొండెఱుఁకల పాతద్రోసినను తన్నె నమ్మింది గదా దమయంతి ఇదంతా యెందుకు? కూరిమిగల దినములలో నేరము లెన్నడు గల్గనేరవుగదా?

**ఈ ప్రసంగం విన్నాను. నిర్ఘాంత పడిపోయాను. నా బుద్ధిహీనత కప్పుడెలా చెప్పానో చెప్తే తెలిసేది కాదు. తలదిమ్ము తిరిగింది. ప్రాణమన్ను పట్టింది. వెంటనే వెళ్ళి సుగుణ పాదాల మీఁద పడుదామనుకున్నాను. కాని యభిమాన మడ్డు తగిలింది. చచ్చిపోతున్న చింత లేదన్న జిహ్వ తిరుగు నామెను ప్రేమతో "సుగుణా" యని ఏలా పిలుస్తుందో యనుకున్నా? ఏమన్నా కాని వింటే విందు లేకుంటె చావనుకున్నా.**

కొన్నాళ్ళయింది. ఇన్నాళ్లైలా గడిచాయో చెప్పుతే యింకిత గాథయితుంది. నా మాటలింకా వింటూ కూర్చుంటే 'వాక్' కు పోయేవారికి సైకిలు మీద రౌండ్ గొట్టేవారికి, పెత్తనాలు చలాయించే వారికి, పేకాటాడేవారికి, కలియుగాష్టక్షరి జపించేవారికి, ఇంత విజ్ఞాన మొసఁగే 'దక్కన్ కేసరి' పత్రికా పఠనాని కవకాశము చిక్కదు. త్వరలో ముగిస్తా.

ఆనాడు రహస్య ప్రసంగ మొనర్చుచు సుందరరావు, కృష్ణారావులు వెల్‌కమ్ హోటల్‌లో కాఫీ త్రాగుచున్నారు. నేను వాళ్ళను చూచాను. నా గ్రహచారము సరిగా నుంది కాఁబట్టే అవి వినాలని బుద్ధి పుట్టింది. కాకపోతే మా సుగుణ నోము ఫలించిందేమొ!

సుంద : కృష్ణారావు! ఘోషాయి చిటికెలు వేసి వినయున్ని ఏలా చేసానో చూచావా! నా ప్రతాపము వాడికి బాగా తెలియదురా!!

కృష్ణ : పాపము! సుగుణ నిద్రాహారాదులు వర్జించి చిక్కి శల్యమై కాటికి కాళ్ళు సాచింది. వాళ్ళనలా శనిలాగ యేడ్పిస్తే నీ ఒళ్ళో నేమిపడిందిరా?

సుం : కాదురా రామచంద్రరావు, రాఘవేంద్రరావు గార్లకు తాము రిఫార్మర్స్ అనే గర్వము. మఱిన్ని వాళ్ళకు బాల్య వివాహాలంటె అసహ్యము. గాడిదలాగ ఇఱువై యేండ్లు వచ్చిన కూతురికింకా చదువేమిట్రా. వాండ్ల రోగమెలా కుదిర్చానో చూశావా? నా తడాకా!!

ఈ ప్రసంగం విన్నాను. నిర్ఘాంత పడిపోయాను. నా బుద్ధిహీనత కప్పుడేలా చెప్పానో చెప్తె తెలిసేది కాదు. తలదిమ్ము తిరిగింది. ప్రాణమన్ను పట్టింది.

వెంటనే వెళ్ళి సుగుణ పాదాల మీఁద పడుదామనుకున్నాను. కాని యభిమాన మడ్డు తగిలింది. చచ్చిపోతున్న చింత లేదన్న జిహ్వ తిరుగు నామెను ప్రేమతో "సుగుణా" యని ఏలా పిలుస్తుందో యనుకున్నా? ఏమన్నా కాని వింటే విందు లేకుంటె చావనుకున్నా. మెల్లమెల్లగ సుగుణ దగ్గరికి చేరాను. "సుగుణా! ఈ పొరపాటు నాదే" యని క్షమాపణ కోరాను. పాపమా వనిత మన్నించిందా కథంతా విని. శుభ ముహూర్తమున ప్రేమ రాణి సాక్షికముగా మా ఇద్దఱికి పెండ్లైంది. ఆ పెండ్లికి గొప్ప విందైంది. సుందరరావు, కృష్ణారావులు గూడ మా విందారగించారు. మాకుఁబ్రణుతులిడి మన్నింపమన్నారు. ఇంక ననుమాన పిశాచము మా దృష్టిలోఁ బడదు. మా రోజులు సుఖంగా జరుగుతున్నాయి.

# మనస్సాక్షిలోకి

డా॥ కూర్మాచలం



నా లోపలే దాగి ఉన్న మనస్సాక్షినే
గాఢంగా విశ్వసిస్తాను!

ఒకసారి ప్రేమతో తడిమితే చాలు
పావురమై ఎగిరిపోయి
తన రెక్కల మీద
ప్రపంచ జ్ఞానాన్ని మోసుకొచ్చి
బోధివృక్షమౌతుంది!

ఒకసారి పలకరిస్తే చాలు
సరికొత్త సరాగాలను పల్లవించి
పులకరింప జేస్తుంది!

ఒక్కోసారి
పసిపాపలా మారాం చేస్తూ
తిట్ల మట్టిని అన్నంలా తింటూ
దీవెనలను గంధంలా పూసుకుని గోల గోల చేస్తుంది!

ప్రతి చిన్న కదలికకు కరిగిపోతూ
ప్రతి చిన్న కుదుపుకు కలతచెందుతూ
గమన భంగిమల్లో అపురూప
కళాఖండంగా కనిపిస్తుంది!

అప్పుడప్పుడూ
లోకం తనకు పంచిపెట్టిన
సుఖ దుఃఖాల గురించి
తాను లోకానికి చేసే
ఉపకార అపకారాల గురించి
నాతోనే మాట్లాడుతూ
మందలిస్తూ
సవరణ కొరడా చేతపట్టుకొని
జాగ్రత్తగా పరిశీలిస్తుంది!

ఎదుటి వారి మనస్సు లోకి
అనుకోకుండానో
బలవంతంగా నో చొరబడి
బాధల సంద్రంలో ముంచేబదులు
ఒకసారి
మన మనస్సాక్షిలోకి
తొంగిచూసుకోవాలి
ప్రేమానురాగాలను
మనసారా
వొంపు కోవాలి!



# భరతుడు - లేడికూన

## భాగవతము - బొప్పరాజు గంగన

బొప్పరాజు గంగన భాగవతంలో పంచమ స్కంధం తెనిగించాడు. పోతనకు సమకాలికుడు. ఈ పంచమస్కంధంలో జడభరతోపాఖ్యానంతో పాటు ఖగోళశాస్త్రవిషయాదులు నరకలోక విశేషాలు ఎక్కువగా వర్ణించబడినాయి. పద్యాలు సరళశైలిలో భాగవతంలో కలిసిపోయినట్లుగా ఉంటాయి.

భరతుడనే రాజు రాజ్యపాలన తరువాత తపస్సు చేసుకోవడానికి వెళ్ళి అక్కడ తల్లి ఎడబాసిన ఒక జింక పిల్లను చూసి అయ్యో అని ఆ జింకపిల్లను పెంచినాడు. ఆయన తపస్సుకు బదులు జింకపిల్లను గురించే ఆలోచించి మనసంతా జింకపిల్లపై పెట్టుకున్నాడు. కనుక తరువాత జన్మలో జింకగా పుట్టి గతం జ్ఞాపకం ఉండి మరల సాధుజీవనం గడిపి మోక్షం పొందాడు. ఈ భరతుడు కారణంగా మనదేశానికి భారతదేశమనే పేరువచ్చిందని బొప్పరాజు గంగన అంటాడు. మూగజీవులను పెంచిన వాత్సల్యం ఇందులో చక్కగా వర్ణించబడింది. ఆ ఘట్టంలో పద్యాలు.

కం. ఘనతపము చలనమొందుట
యును భరతుండెఱుగకాత్మయోగంబు, న, చ
య్యన బాసె హరిణ పోతము
తన మదిలో నిల్పి ప్రీతి తప్పక పలికెన్.

ఉ. అక్కట! తల్లి బాసి హరిణార్భక మాప్తులు లేమి జేసి యే
దిక్కును లేకయున్న ఇట దెచ్చితి నాయెడ నీ మృగార్భకం
డెక్కుడు ప్రేమజేసి చరియింపుచు నున్నది నాదు సన్నిధిన్
మక్కువ జేసి దీని గడు మన్ననలం దగ బ్రోతు నెంతయున్.

కం. శరణమ వచ్చు జంతువు
కరుణం కనువిచ్చి చూచి కాచిన పుణ్యం
బరయగ నధికంబ ము
న్నెఱిగించిరి సన్మునీంద్రులెల్లం ప్రీతిన్.

చ. గురువుల వాఁటి బిట్టుఱికి కొమ్మల జిమ్ముచు నంతనంత ద
గ్గఱచును గాలు ద్రవ్వుచు నఖంబుల గీఱుచు గాసి సేయుచు
న్మొఱగును ధారుణీశ్వరు యూరువులన్ శయనించి యంతలో
నఱకడ మొక్కచుం బొదలి యాడుచు నా హరిణంబు లీలతోన్.

తే.గీ. గరిమ నీరీతి నెల్లెడ కెరలు వొడిచి
చెలగి యాడంగ భరతుండు చిత్తమందు
సంతసిల్లుచు నుండె నాశ్రమము బాసి
హరిణ డింభక మంతలో నుఱికి చనియె.

వ్యాసం

# తెలుగును వెలిగిస్తున్న దీపం తెలంగాణ సారస్వత పరిషత్తు

పరిషత్తు తెలుగు వెలుగుల్ని ప్రసరించిన వ్యాసం...



డా॥ జె.చెన్నయ్య

ఏడున్నర దశాబ్దాలుగా తెలంగాణలోనే కాకుండా తెలుగు ప్రాంతాలన్నింటిలో తెలుగు భాషా సాహిత్యాల వికాసానికి నిర్విరామంగా పాటు పడుతున్న తెలంగాణ సారస్వత పరిషత్తు 2018 మే 26న 75 సంవత్సరాల మహోత్సవం జరుపుకుంది. అది చారిత్రక అవసరం. హైదరాబాదు సంస్థానాన్ని అసఫ్‌జాహీల్లో 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలిస్తున్న కాలం. అక్షరాస్యత 10 శాతం లోపే. ఉర్దూ రాజభాష, పాఠశాలల్లో ఎక్కడా తెలుగుకు స్థానం లేదు. ఇద్దరు వ్యక్తులు కలిస్తే ఉర్దూలో మాట్లాడుకోవడం ఆనాడు ఫాషన్. సభల్లో కూడా ఉర్దూలోనే ప్రసంగాలు జరిగేవి. ఒకవైపు నిజాము వ్యతిరేక ఉద్యమం జరుగుతున్నది. ఆంధ్రజన సంఘం శాఖోపశాఖలుగా విస్తరించి ఉద్యమవ్యాప్తికి కృషి చేస్తున్నది. ఆంధ్ర మహాసభల్లో రాజకీయాంశాలకే గాని సాంస్కృతికాంశాలకు ప్రాధాన్యం లేదు. అటువంటి అనివార్య పరిస్థితుల్లో 1943 మే 26. హైదరాబాద్ రెడ్డి హాస్టల్‌లో కొందరు పెద్దలు ప్రత్యేకంగా లోకనంది శంకరనారాయణరావు అధ్యక్షతన సమావేశమై తెలుగు భాషా సంస్కృతుల్ని సముద్దీప్తం చేయడంకోసం ఒక సంస్థ ఉండాలని తీర్మానించారు. దాని పేరు గురించి చర్చ జరిగింది. 'నిజాం రాష్ట్రాంధ్ర సారస్వత పరిషత్తు' అని నామకరణం చేశారు. మాడపాటి హనుమంతరావు, బుక్కపట్నం రామానుజాచార్యులు, సురవరం ప్రతాపరెడ్డి, లోకనంది శంకరనారాయణరావు, బూర్గుల రామకృష్ణారావు, చిదిరెమఠం వీరభద్ర శర్మ, ఆదిరాజు వీరభద్రరావు, నందగిరి వెంకటరావు, కోదాటి నారాయణరావు, గడియారం రామకృష్ణ శర్మ, భాస్కరభట్ల కృష్ణారావులతో కూడిన పదకొండు మంది సభ్యులతో ఏర్పాటైన ఉపసంఘం పరిషత్తు నియమావళిని, కార్య ప్రణాళికను సిద్ధం చేసింది. (అ) రాష్ట్రాంధ్రులలో మాతృ భాషాభిమానమును పెంపొందించి తద్వ్యాప్తికై పాటుపడుట; (ఆ) ఆంధ్ర భాషాభివృద్ధికై సర్వవిధముల కృషి సలుపుట; ఇది ప్రధానంగా నాడు నిర్దేశించుకున్న ఉద్దేశాలు.

అట్లా ప్రారంభమైన సారస్వత పరిషత్తు తెలంగాణలో వయోజన విద్యాకేంద్రాలు నడిపి అక్షరాస్యతను పెంచింది. భాషా సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వాటిపట్ల అభిరుచిని పెంచింది. ప్రాథమిక, ప్రవేశ, విశారద పూర్వోత్తర భాగాల పరీక్షలు నిర్వహించింది. అద్భుతమైన గ్రంథాలను ప్రచురించి తెలుగు పఠనార్తిని తీర్చింది.

ప్రథమ అధ్యక్షులు లోకనంది శంకరనారాయణరావుకు కొన్ని మాసాలకే ఉద్యోగం బదిలీ కావడంతో పదవికి రాజీనామా చేయడంతో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షులయ్యారు. కార్యదర్శిగా బిదురు వెంకటశేషయ్య, ఇతర కార్యవర్గం కొనసాగింది.. పరీక్షలు, పాఠ్యాంశాల వల్ల తెలుగు నేర్చు కొనేందుకు అవకాశాలు విస్తృతమయ్యాయి.

పరిషత్తు నాడు నిర్వహించిన వార్షిక సభలు జగత్ప్రసిద్ధమయ్యాయి. 1944 డిసెంబర్ 28, 29, 30 తేదీల్లో ఓరుగల్లు కోటలో జరిగాయి. ఆహ్వాన సంఘానికి అధ్యక్షులు ఉదయరాజు రాజేశ్వరరావు, కార్యదర్శి కాళోజి నారాయణరావు, సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షులు, రాజబహద్దూరు వెంకటరామరెడ్డి ప్రారంభించారు. 29న కవి సమ్మేళనం జరపవలసి వుండగా దుండగులు రాత్రికిరాత్రే పందిళ్ళను దగ్ధం చేశారు. అయినా ధైర్యంగా అదేచోట కవి సమ్మేళనం నిర్వహించారు. దాశరథి ఆ వేదికపై కవిత చదివారు. దేవులపల్లి రామానుజరావు ముఖ్య కార్యకర్తగా పాల్గొన్నారు. పరిషత్తు కార్యక్రమాలకు నూతనోత్తేజం కలిగించిన సభలవి. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి బూర్గుల రామకృష్ణరావు విజయపత్రాలు అందించి స్నాతకోపన్యాసం చేశారు.

నిజాము పరిపాలన చివరిదశకు వచ్చింది. అధికారాన్ని ప్రశ్నించే వ్యక్తులను తీవ్రంగా అణచివేస్తున్న కాలం. నిజాము ప్రైవేటు సైన్యమైన రజాకార్లు కూడా విజృంభించి దాడులు చేశారు. మహబూబ్ నగర్, నల్లగొండ, మంచిర్యాల ఎక్కడ సభలు చేసినా కూడా మతోన్మాదుల నుంచి అనేక ఇబ్బందులెదురయ్యాయి. పరిషత్తు కార్యకర్తలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. పరిషత్తుకు ఒక రకమైన అజ్ఞాతవాస కాలమది. కల్లోల పరిస్థితుల్లో పరిషత్తును బతికించారు. 1948 నిజాము రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం కావడంతో పరిషత్తు కూడా స్వేచ్ఛా వాయువులు పీల్చింది. దాంతో నూతనోత్తేజం వెల్లివిరిసింది. అప్పటి వరకు తెలంగాణకే పరిమితమైన పరిషత్తు కార్యకలాపాలు సకలాంధ్రదేశానికే గాకుండా మైసూరు, బెంగుళూరు, సేలం, హొసూరు, బొంబాయి, మారిషస్ వంటి అనేక ప్రాంతాలకు విస్తరించాయి.

పరిషత్తు ఐదవ మహాసభలు తూపురాన్‌లో పెద్దఎత్తున జరిగాయి. ఆ వార్త విన్న 'గోలకొండ పత్రిక' తన సంపాదకీయంలో "16 నెలల అజ్ఞాతవాసము తర్వాత ఆంధ్ర సారస్వత పరిషత్తు సభలు త్వరలో జరుగనున్న వనియు, తూపురాన్‌లో ఒక ఆహ్వాన సంఘమేర్పాటు చేయబడినదనియు వచ్చిన వార్త వీనులకు విందు చేసినది.

మన రాష్ట్రములో ఉర్దూ ప్రాబల్యము వలన తెలుగు భాషకు తీరని అపకారము జరిగినది. మనవారిలో కొందరు బంధువుల తోడను, ఆప్తులతోడను ఉర్దూ భాషలోనే సంభాషణ చేయు దౌర్భాగ్యము గూడ ప్రాప్తించింది..".

ఆ విధంగా 1949 ఫిబ్రవరి 4, 5, 6 తేదీల్లో తూపురాన్‌లో ఐదవ మహాసభల్లో 'నిజాం రాష్ట్ర' పదం తొలగిపోయి 'ఆంధ్ర సారస్వత పరిషత్తు'గా అవతరించింది. మెట్రిక్ వరకు మాతృభాషలో విద్యాబోధన జరగాలని తీర్మానం చేశారు. తీర్మానాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి అంగీకరింపజేశారు. తెలుగు మాధ్యమంలో బోధించేందుకు ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. పరిషత్తు అప్పటికే పరీక్షలు నిర్వహించి ఎంతో మందిని సిద్ధం చేసివున్నందున వారికి ప్రభుత్వం అర్హత కల్పించింది. ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణులైనవారు ప్రాథమిక పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులయ్యారు. విశారద ఉత్తీర్ణులైనవారు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులైనారు. ఆ రకంగా ఊరూరా తెలుగులో బోధన జరిగింది. ఒకవైపు పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఉపాధి లభించింది. ఇంకోవైపు తెలుగు గ్రామగ్రామానికి విస్తరించింది. బూర్గుల రామకృష్ణారావు అభివర్ణించినట్లు "సూర్యుని వెలుతురు సోకని చోటు లేదన్నట్లు పరిషత్తు తెలుగు వెలుగు సోకని ప్రాంతం లేదు". అద్భుత వాతావరణం ఏర్పడింది. కొద్దికాలానికే పరిషత్తు పెద్దలతో కూడిన ఉపసంఘం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంటరు, డిగ్రీ స్థాయిలో కూడా తెలుగు ఒక అధ్యయనాంశంగా బోధన జరిగేలా కృషి చేసి విజయం సాధించింది.

**హైదరాబాద్ రెడ్డి హాస్టల్‌లో కొందరు పెద్దలు ప్రత్యేకంగా లోకనంది శంకరనారాయణరావు అధ్యక్షతన సమావేశమై తెలుగు భాషా సంస్కృతుల్ని సముద్దీప్తం చేయడంకోసం ఒక సంస్థ ఉండాలని తీర్మానించారు. దాని పేరు గురించి చర్చ జరిగింది. 'నిజాం రాష్ట్రాంధ్ర సారస్వత పరిషత్తు' అని నామకరణం చేశారు.**

అదే సమయంలో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వాధీనంలోకి తీసుకొని కేంద్రీయ విశ్వ విద్యాలయంగా చేయాలని నిర్ణయం జరిగింది. పరిషత్తు ఆధ్వర్యంలో ఆ నిర్ణయాన్ని ప్రతిఘటించి పెద్ద ఉద్యమం నిర్వహించింది. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, విద్యామంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్‌లను ఒప్పించి ఆ నిర్ణయాన్ని ఉపసంహరింపజేసింది.

పరిషత్తు నిర్వహించిన మహాసభల్లో నేటికీ చెప్పుకోదగినవి అలంపూరులో జరిగిన సప్తమ మహాసభలు 1953 జనవరి 11 నుంచి 14 వరకు అత్యంత వైభవంగా జరిగాయి. అలంపూరు వంటి గ్రామంలో



వ్యాసం

సభలు జరిగితే తెలుగు నాడంతా తరలి వచ్చింది. 30 వేల మంది పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ముఖ్యఅతిథి. ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ఉపరాష్ట్రపతి వెంట వచ్చారు. దేవులపల్లి రామానుజరావు అధ్యక్షులు. గడియారం రామకృష్ణశర్మ, గన్నమరాజు రామేశ్వరరావు ఆహ్వాన సంఘం కార్యదర్శులు. నాటి ఆస్థానకవి శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి ఆశీస్సులందించారు. కాళోజి 'నాగొడవ'ను శ్రీశ్రీ ఆవిష్కరించారు. విశ్వనాథ స్నాతకోపన్యాసం చేశారు.

ఈనాటికీ గొప్పగా చెప్పుకోదగిన గ్రంథాలను పరిషత్తు ప్రచురించింది. సురవరం ప్రతాపరెడ్డి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' పరిషత్తు ప్రచురణే. కేంద్ర సాహిత్య అకాడమీ నుంచి 1955లో తొలిసారి తెలుగు వారికి అవార్డు లభించిన గ్రంథమది. మహాభారతోపన్యాసాలు, మహాభాగవతోపన్యాసాలు ఇలా వందల సంఖ్యను చేరింది. ఇప్పటికీ పరిషత్తు విక్రయకేంద్రంలో అవి అందుబాటులో వున్నాయి.

సుమారు 20 వేల అరుదైన గ్రంథాలతో గ్రంథాలయం కొనసాగుతున్నది. 54 ఏళ్ళుగా ప్రాచ్య కళాశాలను, తెలుగు పండిత శిక్షణ కళాశాలను పరిషత్తు నిర్వహిస్తున్నది. ఈ కళాశాలల్లో చదివినవారు అధ్యాపకులుగా, పాత్రికేయులుగా, కవి రచయితలు, విమర్శకులుగా ప్రసిద్ధులయ్యారు.

1994లో స్వర్ణోత్సవాన్ని, 2003లో వజ్రోత్సవాన్ని జరుపుకున్నది. తెలుగు భాషా సాహిత్యరంగాల్లోని వారంతా పరిషత్తు వేదికపై తమ కవితా గానం చేశారు. ప్రసంగాలు చేశారు. పుస్తకాలను ఆవిష్కరించుకున్నారు. 20 సంవత్సరాల పాటు నిరంతరాయంగా ప్రతినెలా జరిగిన సాహిత్యవేదిక అరుదైన కార్యక్రమాల్లో ఒకటి.

మాడపాటి, సురవరం, లోకనంది నారాయణరావు, బుర్రా వేంకట సుబ్బారాయుడు, ఇల్లిందల రామచంద్రరావు, పర్సా వెంకటేశ్వరరావు, దేవులపల్లి రామానుజరావు, నూకల నరోత్తమరెడ్డి, డా.సి.నారాయణరెడ్డి వంటి ప్రముఖులు అధ్యక్షులుగా, బిదురు వెంకట శేషయ్య, చలమచర్ల రంగాచార్యులు, పులిజాల హనుమంతరావు, గడియారం రామకృష్ణశర్మ, కె.కె.రంగనాథాచార్యులు, ఇరివెంటి కృష్ణమూర్తి, రవ్వా శ్రీహరి, ఎల్లూరి శివారెడ్డి వంటి ప్రముఖులు ప్రధాన కార్యదర్శులుగా, మరెందరో మహానుభావులు సభ్యులుగా పరిషత్తు రథాన్ని విజయతీరాలవైపు నడిపారు.



**ఈనాటికీ గొప్పగా చెప్పుకోదగిన గ్రంథాలను పరిషత్తు ప్రచురించింది. సురవరం ప్రతాపరెడ్డి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' పరిషత్తు ప్రచురణే. కేంద్ర సాహిత్య అకాడమీ నుంచి 1955 లో తొలిసారి తెలుగు వారికి అవార్డు లభించిన గ్రంథమది. మహాభారతోపన్యాసాలు, మహాభాగవతోపన్యాసాలు ఇలా వందల సంఖ్యను చేరింది. ఇప్పటికీ పరిషత్తు విక్రయకేంద్రంలో అవి అందుబాటులో వున్నాయి.**

దేవులపల్లి రామానుజరావు కృషి ప్రత్యేకంగా పేర్కొనదగింది. కార్యవర్గ సభ్యునిగా, సహాయ కార్యదర్శిగా, పరీక్షా కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా, అధ్యక్షునిగా పరిషత్తులో 50 సంవత్సరాల సుదీర్ఘకాలపు అనుబంధం కొనసాగించి అవిరళ సేవలందించారు.

డా॥ దేవులపల్లి రామానుజరావు అనంతరం జ్ఞానపీఠ పురస్కారగ్రహీత డా.సి.నారాయణరెడ్డి 1993లో పరిషత్తు అధ్యక్షులయ్యారు. సాంస్కృతిక మండలి ఛైర్మన్‌గా, రాజ్యసభ సభ్యులుగా తీరికలేని విధంగా ఉన్నప్పటికీ పరిషత్తును తమకు అత్యంత ఆప్తసంస్థగా పరిగణించారు. 2017 జూన్ 12న కన్నుమూసే వరకు కంటికి రెప్పలా కాపాడారు. విలువైన స్థలాన్ని ప్రభుత్వం నుంచి పరిషత్తుకు సాధించిపెట్టారు. ఎం.పి.లాడ్స్ నిధులు కేటాయించి భవనాలు నిర్మింపచేశారు. సి.నా.రె హయాంలోనే 'ఆంధ్ర సారస్వత పరిషత్తు' 'తెలంగాణ సారస్వత పరిషత్తు'గా మారింది. వారి అనంతరం డా.ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షులయ్యారు.

రాష్ట్రావిర్భావానంతరం పరిషత్తును తెలంగాణ ప్రభుత్వం అక్కున జేర్చుకుంది. భాషా సాంస్కృతిక శాఖ పక్షాన ఏటా 10 లక్షల రూపాయల గ్రాంటు ఇస్తున్నది. ఈ నిధులతో పరిషత్తు భాషా సాంస్కృతిక వికాసానికి శక్తివంచన లేకుండా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. తెలంగాణ పాత పది



వ్యాసం

జిల్లాల్లో డా.దేవులపల్లి రామానుజరావు, గడియారం రామకృష్ణశర్మ శత జయంత్యుత్సవాలు, పరిషత్తు 75 సంవత్సరాల స్థాపన ఉత్సవాలు, కవి సమ్మేళనాలు నిర్వహించింది. వచన కవిత్వం, గేయకవిత్వం, కథ, విమర్శ, నాటకరచన, పత్రికారచన మొదలైన ప్రక్రియల్లో సృజనాత్మక రచనాభిరుచిని పెంపొందించేందుకు అనేక అధ్యయన శిబిరాలు నిర్వహించింది. తెలంగాణ చిత్రలేఖన, శిల్పకళలు, ప్రాచీన నర్తనరీతులు, ఒగ్గుకథ, జానపద గిరిజన భాష, కళారూపాలపై వివరణాత్మక ప్రసంగాలతో పాటు ప్రదర్శనలు నిర్వహించింది. 'పరిణతవాణి' పేరుతో ఇప్పటివరకు 80 మంది తెలుగు కవి పండితులు, పత్రికా రచయితల జీవిత, సాహిత్య విశేషాలతో కూడిన ప్రసంగాలు ఏర్పాటు చేసి వాటిని పుస్తకరూపంలో (8 సంపుటాలు) తీసుకొచ్చింది. 'తెలంగాణ సాహిత్య చరిత్ర', 'తెలంగాణ చరిత్ర', డా.సి.నా.రె 'మా వూరు మాట్లాడింది', డా.దేవులపల్లి రామానుజరావు 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు', రవ్వా శ్రీహరి 'తెలంగాణ మాండలికాలు - కావ్య ప్రయోగాలు', డా.సి.వసుంధర 'జానపద సాహిత్యము, స్త్రీల గేయములలో సంప్రదాయం', శేషాద్రి రమణకవుల 'పరిశోధనావ్యాస మంజరి - తెలంగాణ కవితా కల్హారాలు', 'వచన కవిత్వం వస్తుశిల్పాలు', 'తెలంగాణ దళిత సాహిత్యం, సంస్కృతి, కళారూపాలు', 'పత్రికలు, ప్రసార మాధ్యమాల భాషా స్వరూపం', డా.ఎల్లూరి శివారెడ్డి 'మహాభారతంలో రసపోషణము', డా.ముదిగంటి సుజాతారెడ్డి కథలు, నవలలు, వ్యాసాలు మొదలైన అనేక గ్రంథాలను పరిషత్తు ముద్రించింది.

ఇటీవలికాలంలో డా.దేవులపల్లి రామానుజరావు కళామందిరాన్ని సర్వాంగసుందరంగా ఆధునీకరించింది.

కవిత

# కలల బాటలో నాన్న

**ఎ. హరిప్రియ**



కనులు మూస్తే కలల
బాటలో నాన్న
కనులు తెరిస్తే
కంటిపాపలో నాన్న
అనుభవ పాఠాలు రంగరించి
అడుగడుగునా నిలిచి
ఆహార్యాన్ని అందించి
అందమైన ఆకారంగా మలిచిన
అద్భుతశిల్పి నాన్న
మా కలల సౌధంలో
నిరంతర శ్రామికుడై
తన ప్రతీ శ్వేదపు బొట్టు
పన్నీరు జల్లుగా
మాపై కురిపించిన నాన్న
మా జీవితంలో
ఆనందపు అక్షయ పాత్రగా
నిలిచిన అమృతమూర్తి
ఏమిచ్చి తీర్చుకోను
నీ ఋణం

(అమృతమూర్తులైన
నాన్నలందరికీ)

అనువాద కథ

# బిందెడు నీళ్లు

**మూలరచన : ఫెహ్మిదా జకీర్**

సామాజిక అంతరాల ప్రతిఫలనం...



**అనుసృజన:**
**డా॥ ఎయం.అయోధ్యారెడ్డి**

నళిని రోడ్డుమీది కొచ్చేసరికి ఎదురుగా పొడవైన లైను కనిపించింది. దారిపక్కన రంగురంగుల బిందెలు ఇంద్రధనుస్సు ముక్కలుగా విడివడ్డట్టు వరుసగా క్యూలో పెట్టివున్నయి. వాటికి పక్కనే ఆడవాళ్ళు నిలబడి వున్నారు.

నళిని తను తెచ్చిన పసుపు, ఆకుపచ్చ ప్లాస్టిక్ బిందెలను క్యూ చివర్లో ఉంచింది. ఈరోజు ఆమె నీళ్లకు రావడం కొంత ఆలస్యమైంది. సాధారణంగా ముందే వొచ్చి తన బిందెల్ని లైను మొదట్లోనో, లేదా కనీసం మధ్యలోనో ఉంచేది. ఈ దినం అవి దాదాపు చివర్లో పెట్టాల్సి వచ్చింది. పక్కింట్లో వుండే తన స్నేహితురాలు అమ్మిని క్యూ మధ్యలో నిలబడి ఉంది. నళిని కొంచెం ముందుగా లేచిఉంటే ఆమె కూడా స్నేహితురాలితో పాటుగా నిలుచుని ఉండేది.

నిన్నరాత్రి నళిని ఇంటికి ఆలస్యంగా వొచ్చింది. తను పనిచేసే సారిక మేడం ఇంట్లో రాత్రి ఒక పార్టీ జరిగింది. పార్టీ పూర్తయి పనంతా ముగించుకొని ఇల్లు చేరేసరికి పదకొండయ్యింది. పదేళ్ల ఆమె కొడుకు రమేశ్, క్లాసు పుస్తకం చదువుతూ చాప మీద పడుకుని వున్నాడు. అప్పటికే అందరూ తినేసినట్టున్నారు. గచ్చులో పడేసిన గిన్నెల్లో అన్నం మెతుకులు నీటి అడుగున కనిపిస్తున్నాయి.

తల్లిని చూడగానే రమేశ్ సర్రున లేచి దగ్గరకొచ్చాడు. ఆమె ఆలస్యంగా ఇంటికొస్తే తినడానికి ఏవైనా వంటకాలు వెంటతెస్తుందని వాడికి తెలుసు. ఆమె చాప పరుచుకొని కొడుకు ప్రక్కన నిద్రపోయేటప్పుటికి పన్నెండు దాటింది.

తెల్లారి లేస్తూనే హడావిడిగా నీళ్ళ ట్యాంకరున్న చోటుకి వొచ్చింది. ఆ దినం ఎండ తొందరగా వేడెక్కుతున్నట్టు వుంది. నళిని కాళ్లు చురుకుమంటున్నయి. రోడ్డుపక్క చెట్టు కింద నిలిచి వుంది ట్యాంకర్. డ్రైవర్ ఒక పక్కన నిలబడి ఆడవాళ్ళతో కబుర్లలో మునిగిపోయాడు. అతనికి సహాయకుడిగా వచ్చిన మనిషి, కొండచిలువ లాంటి పొలుసుల పైపును బయటికి తీసి లారీ వెనుకున్న గొట్టానికి బిగించాడు. నెమ్మదిగా ప్రవాహాన్ని నియంత్రిస్తూ నీరు బిందెల్లోకి వొదులుతున్నాడు.

క్యూలో ఉన్నవాళ్ళు ఒక్కొక్కరుగా బిందెలు నింపుకుంటున్నారు. నలిగిన చీరలు, రేగిన జుట్టుతో దాదాపు అక్కడున్న మహిళలందరూ నిద్ర నుంచి లేచి నేరుగా అక్కడికొచ్చినట్టు వాళ్ళ ఆకారాలు తెలుపుతున్నయి.

ఆలస్యమైనా ఆ రోజుకు తన కోటా నీరు అందుతుందని నళిని భావించింది. ఇచ్చేవి రెండు బిందెలు. వాటినే రోజంతా వాడుకోవాలి. నీళ్ళు దొరక్కపోతే ఆమె అత్తగారు చిరాకు పడతరు. పని నుంచి తిరిగివొచ్చే కొడుకు కోసం అత్తగారు ఏదైనా ప్రత్యేకంగా వండిపెడుతుందని ఆమెకు తెలుసు. రవి రాత్రి ఎనిమిదికి ఇంటికి చేరుకునే అవకాశముంది. అతడు గిడ్డంగికి వెళ్లి సరుకు దింపేసిన తర్వాత ఆ రోజు కూలి తీసుకునేందుకు మెయిన్ ఆఫీసుకు పోతాడు. ట్యాంకర్ వద్ద వరుసగా నీరు పట్టుకుంటున్నారు. అప్పటికి పదిమంది కూడా పట్టుకోలేదు. ముందు నుంచి ఎవరో బిగ్గరగా అరవడం వినిపించింది. దానికి మరికొన్ని గొంతులు జత కలిశాయి. విషయం ఏమిటో తెలుసుకునే ప్రయత్నంలో నళిని తలెత్తి ముందుకు చూసింది.

"ఒక్కరు ఒక్క బిందెనే పట్టుకోవాల్నా? ఎందయ్యా నువు జెప్పేది? ఒక ఇంటికి ఒక్క బింద నీళ్ళు ఎట్ల సరిపోతయి? అదెట్ల కుదుర్తది? మాకోటా నీళ్ళు మాకియ్యాలె. లేకుంటే ఊరుకోం. అయినా నీళ్ళు లేనప్పుడు ట్యాంకరుతో ఎందుకొచ్చిన్రు? ఇప్పటిదాక మాలో పది మంది కూడ పట్టుకోలే" అమ్మిని ముఖమంతా ఎర్రగ చేసుకొని బిగ్గరగా కేకలేస్తున్నది.

"మీరు నీళ్ళు మిగిలిచ్చుకొని బయట అమ్ముకోవాలని చూస్తున్నట్టున్నది" మరెవరో అరిచారు.

నళిని కంగారుగా చూసింది. ట్యాంకర్ డ్రైవర్ ఎవరి మాటలూ వినకుండా వెనక్కి

అనువాద కథ

వచ్చి పైపు లీవర్ బిగించి నీటిని ఆపు చేశాడు. తర్వాత మహిళలను ఉద్దేశించి గట్టిగా అన్నాడు:

" ఏందీ.. ఎక్కువ మాట్లాడుతున్నారు? ఆపేసిన. ఎంజేస్తరు? నేనీ నిముషం ఇట్లనే యెళ్లిపోతే నన్ను పీకెటోళ్లు లేరు. అందుకే చెప్తున్న.. ఒక్కొక్కరు ఒక్క బిందెనే పట్టుకొని పొండి"

అతని బెదిరింపులకు ఆడాళ్ళు కోపంతో రగిలిపోయారు. కానీ అతన్నేమీ చెయ్యలేక వాళ్ళలోవాళ్ళు చిన్నగా గొణుక్కున్నారు. అధికారి పార్టీలోని నాయకులతో డ్రైవరుకు సంబంధాలున్నయి. డ్రైవరు గానీ ఆ ప్రాంతానికి అసలు నీళ్ళట్యాంకరే తేవొద్దనుకుంటే ఎవరూ ఏమీ చేయలేరు. నళిని గట్టిగా నిట్టూర్చింది. తప్పదు, మరెక్కడినుంచైనా ఇంకో బిందెడు నీళ్లు సంపాదించాలి. కానీ ఎక్కడ..?

ఆమె భర్త రవి అంతకుముందు స్కూల్ వ్యాన్ నడిపేవాడు. డ్యూటీ ముగించి ఇంటికొస్తూ స్కూలు నుంచి బిందెడు నీళ్లు తీసుకునేవాడు. ఎప్పుడన్నా అయితే ఫరవాలేదు గానీ, రోజూ నీళ్లు పట్టుకుపోతానంటే కుదరదని ప్రిన్సిపాల్ కోపగించాడు. దానికితోడు స్కూలు నగరానికి అటుపక్క కొత్తగా కట్టిన బిల్డింగులోకి షిఫ్ట్ చేసిన క్రమంలో రవి ఉద్యోగం పోవడమే కాక, ప్రత్యామ్నాయ నీటి వనరు కూడా పోయింది.

రవికి ఉద్యోగం పోవడంతో, నళిని కూడా డబ్బు సంపాదించేందుకు మార్గాలు వెతికింది. అమ్మినితో కలిసి చెత్త డంపింగ్ యార్డుకు వెళ్ళింది. నగరంలోని చెత్తంతా లారీలు నిర్విరామంగా మోసుకొచ్చి అక్కడ అన్లోడ్ చేస్తాయి. దాంతో అక్కడ పర్వతాల మాదిరి చెత్తకుప్పలు పోగుపడ్డాయి.

ముక్కుకు, నోటికి బట్టను ఎట్లా కట్టుకోవాలో.. పనికిరాని ఇనుప వస్తువులు, గాజు ప్లాస్టిక్ సీసాలు, క్యారీ బ్యాగుల వంటివి ఎట్లా వెతికి పోగుజేయాలో కూడా అమ్మిని నేర్పించింది. కాళ్ళకు ఏ ఆచ్ఛాదన లేకుండా డంప్ యార్డుల్లో తిరుగుతుంటే పదునైన వస్తువులు గుచ్చుకొని కొన్నిసార్లు నళిని పాదాలు కోసుకుపోయేవి. అయినా వాళ్ళు పని ఆపలేదు. అప్పుడప్పుడు చెత్తలో పాత చెప్పులేవయినా దొరికితే తొడుక్కొని తిరిగేవారు.

చెత్త ఏరుకునే పనివల్ల ఆమెకు పెద్దగా రాబడి రాలేదు. కానీ, కొన్నిసార్లు ఆమెకు కాస్త విలువైనవి, పెద్ద పెద్ద ఇనుప వస్తువులు దొరికినయి. ఆమెకు ఏది దొరికినా కొంచెం మంచి ధరకు అమ్మి, స్క్రాప్ డీలర్ నుండి ఎక్కువ డబ్బులు పొందాలంటే పెద్ద నోరు, బేరమాడే మాటకారితనం అవసరమని నళిని కాలక్రమంలో తెలుసుకుంది. ఈ పనివల్ల రోజంతా తిరిగితే ఆమెకు యాభై రూపాయల వరకూ వచ్చేవి. అది ఎక్కువ కాదు. కానీ తక్కువ మొత్తం కూడా కాదనీ, ప్రతి పైసా తనకు విలువైనదని ఆమెకు తెలుసు.

★ ★ ★

నళిని ఇంట్లో అడుగు పెట్టగానే ఆమె ఒక చేతిలో పట్టుకొస్తున్న బిందె ఖాళీ అని గ్రహించిన అత్తగారు కోడలి వైపు తీక్షణంగా చూసింది. "ఏందీ.. ఒక్క బిందె నీళ్లేనా దొరికింది ..?" అన్నది.

"అవునత్తా..! దొరుకలేదు. నీళ్ళు లేవట. అయినా నువు ఫికరు పడకు. నేను ఇంకెక్కడన్న బిందెడు సంపాయించి తీసుకొస్త" అనిచెప్పి ఆమె తొందరగా గుడిసె లోపలికి వెళ్ళింది.

కేవలం ఒకటే గది ఉన్న కొంప అది. పైన టార్పాలిన్ కప్పబడిన గుడిసె. నళినికి ఎప్పుడో ఒక చెరకు డివైడర్ దొరికితే దాన్ని అడ్డుపెట్టి లోపల మరో చిన్న పార్టిషన్ ఏర్పాటు చేసుకున్నారు. రవి కొన్నిచోట్ల ఏర్పడిన ఖాళీలను మరమ్మతు చేసి తాళ్లతో బిగించి కట్టాడు. చిన్న తలుపుకు అడ్డంగా నారింజ రంగు కర్టెన్ కట్టుకున్నారు. డంప్ యార్డ్ నళినికి డివైడర్ స్క్రీన్తో పాటు ఇంకొన్ని వస్తువులు దొరికేలా చేసింది. ఆమె పెళ్ళయి మొదటిసారి అత్తవారింటికి వొచ్చినప్పుడు గుడిసె స్థితి చాలా దారుణంగా ఉండేది. లోపలా బయటా నేల బురదగా, చిత్తడిగా వుండేది. వానాకాలంలో అడుగుపెట్టేందుకే కష్టంగా ఉండేది. వాకిలి ఎత్తులోనే గుడిసె లోపలి నేలకూడా ఉండటంతో బయటి నీరంతా ఇంట్లోకొచ్చేది. ఒకసారి డంప్ యార్డులో పెద్ద మొత్తంలో విరిగిన సిరామిక్ పలకలను నళిని చూసింది. వాటిని ఏరుకొచ్చి ఆమె గుడిసెలో మట్టినేల మీద వరసలుగా పరిచింది. నిజానికి విరిగినముక్కలు వేర్వేరు సైజుల్లో, రంగుల్లో ఉన్నప్పటికీ నళిని, రవి కలిసి వాటిని చక్కటి డిజైన్లలో గుడిసె అంతటా పరుచుకున్నారు. సిరామిక్ ముక్కలతో ఏర్పాటుచేసుకున్న వాళ్ళ కొత్త ఫ్లోరింగ్ చూసి వాడలోని వాళ్ళంతా దానివల్ల ఇంటికే అందమొచ్చిందని మెచ్చుకున్నారు. అంతేకాదు, నళిని నుంచి స్ఫూర్తి పొంది వాళ్ళూ అదే పనిచేశారు. కొద్దిరోజులకే ఇప్పుడా ప్రాంతంలోని దాదాపు అన్ని గుడిసెలు టైల్స్ ముక్కలు పర్చుకొని ఆనందపడ్డాయి.

నిజానికి ప్రధాన రహదారిపై పెద్దఎత్తున జరుగుతున్న నిర్మాణ కార్యకలాపాల వల్ల వారికి రంగు రంగుల ఫ్యాన్సీ పలకలు లభ్యమైనయి. అంతేకాదు, వివిధ విభాగాల్లో వారికి

> **అ**తని బెదిరింపులకు ఆడాళ్ళు కోపంతో రగిలిపోయారు. కానీ అతన్నేమీ చెయ్యలేక వాళ్ళలోవాళ్ళు చిన్నగా గొణుక్కున్నారు. అధికారి పార్టీలోని నాయకులతో డ్రైవరుకు సంబంధాలున్నయి. డ్రైవరు గానీ ఆ ప్రాంతానికి అసలు నీళ్ళట్యాంకరే తేవొద్దనుకుంటే ఎవరూ ఏమీ చేయలేరు. నళిని గట్టిగా నిట్టూర్చింది. తప్పదు, మరెక్కడినుంచైనా ఇంకో బిందెడు నీళ్లు సంపాదించాలి. కానీ ఎక్కడ..?

**కేవలం ఒకటే గది ఉన్న కొంప అది. పైన టార్పాలిన్ కప్పబడిన గుడిసె. నళినికి ఎప్పుడో ఒక చెరకు డివైడర్ దొరికితే దాన్ని అడ్డుపెట్టి లోపల మరో చిన్న పార్టిషన్ ఏర్పాటు చేసుకున్నారు. రవి కొన్నిచోట్ల ఏర్పడిన ఖాళీలను మరమ్మతు చేసి తాళ్లతో బిగించి కట్టాడు. చిన్న తలుపుకు అడ్డంగా నారింజ రంగు కర్టెన్ కట్టుకున్నారు. డంప్ యార్డ్ నళినికి డివైడర్ స్క్రీన్తో పాటు ఇంకొన్ని వస్తువులు దొరికేలా చేసింది. ఆమె పెళ్ళయి మొదటిసారి అత్తవారింటికి వొచ్చినప్పుడు గుడిసె స్థితి చాలా దారుణంగా ఉండేది.**





ఉపాధి అవకాశాలు కూడా లభించినయి.

ఆ వాడలోనే నివాసముండే రామన్నకు ఒక అపార్టుమెంట్ కాంప్లెక్స్‌లో వాచ్ మెన్‌గా ఉద్యోగం దొరికింది. రామన్న రవి తండ్రికి సన్నిహిత మిత్రుడు. రవి తండ్రి మరణించినప్పటికీ, అతడు వీళ్ల ఇంటికి తరచూ వచ్చిపోతూ మంచి చెడ్డలు తెలుసుకుంటాడు.

ఒకరోజు రామన్న వీళ్ళ ఇంటికి వొచ్చినప్పుడు ఒక వార్త చెప్పాడు. తాను పనిచేస్తున్న అపార్టుమెంటులో కొందరు గృహిణులు పనిమనుషుల కోసం వెతుకుతున్నారని తెలిపాడు.

ఇదివిన్న రవి ఒకసారి అక్కడికి వెళ్ళిరమ్మని నళినితో చెప్పాడు.

“ మనలో కనీసం ఒకరికన్నా స్థిరమైన ఉద్యోగం ఉంటుంది” అన్నాడు.

రవి చెప్పినట్టుగానే నళిని అపార్టుమెంటుకు వెళ్ళింది. అట్లా ఆమె మొదట కలుసుకున్న వ్యక్తి సారిక మేడం. వాళ్ళది చాలా పెద్ద ఫ్లాట్. ముందు హాలు నుంచి మూడువైపులా తలుపులున్నాయి. అవి బెడ్ రూంలు కావొచ్చు. ఎడమ వైపు లోపలికి ఒక చిన్న దారి. బహుశా ఓపెన్ టెర్రస్ లేదా బాల్కనీకి పోతుంది. కుడిదిక్కున ఒక గది ఉంది. నళిని తరువాత గ్రహించింది, అది కిచెన్.

సారిక మేడం హాల్లో విశాలమైన సోఫాపై కూర్చుని ఉన్నది. నళిని విషయం చెప్పగానే ఆమె తీక్షణంగా చూస్తూ, ఇంట్లో పనిమనిషి చేయాల్సిన పనుల గురించి వరుసగా ఏకరువు పెట్టింది.

“ప్రతిరోజూ ఇల్లంతా శుభ్రంగా ఊడ్చాలి. ఫ్లోర్ క్లీనర్స్‌తో తుడవాలి. గిన్నెలు తోమి బట్టలన్నీ ఉతకాలి. తర్వాత ఆ రోజుకి అవసరమైన కూరగాయలు కోసిపెట్టాలి. అట్లాగే పొద్దున, సాయంత్రం పనిలోకి రావలిసి ఉంటుంది.”

ఇన్ని పనులు చెప్పిన సారిక మేడం జీతం దగ్గరికొచ్చేసరికి నళిని ఊహించుకున్న దానికంటే చాలా తక్కువ మొత్తం చెప్పింది. నళిని గట్టిగా అడగలేక నసుగుతూనే ఇంకొంచెం ఎక్కువ కావాలంది. కాని మేడం సీరియస్‌గా

ముఖంపెట్టి

"లేదు.. నేను అంతే ఇస్తాను. ఇష్టం లేకుంటే వెళ్లిపో" అన్నది. రెండు క్షణాల తర్వాత ఏవో వరాలిస్తున్నట్లు "కావాలంటే రాత్రి మాయింట్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలు నువు మీ ఇంటికి తీసుకెళ్లచ్చు" అంది.

నళిని మాట్లాడకుండా కొద్దిసేపు ఆలోచనలో పడింది. తర్వాత అంగీకారంగా తల ఊపింది. నిజానికి ఆమెకు వేరే మార్గం లేదు. అట్లాగని పెద్దగా ఉత్సాహంగానూ లేదు. కూరగాయలు కోసిపెట్టడం అనేది కాలక్రమంలో వంటచేయడంలోకి దారితీస్తుందనీ, పొద్దున అనుకున్న పనిసమయం మధ్యాహ్నం వరకూ వెళు తుందని, సాయంత్రం అనుకున్న పని రాత్రిదాకా పొడగింప బడుతుందనీ నళిని ఆ క్షణంలో ఊహించలేకపోయింది. ముఖ్యంగా యజమాని ఇంట్లో పార్టీలూ.. ఫంక్షన్లు జరిపినప్పుడు ఆ రాత్రి కూడా దాదాపు అర్థరాత్రి వరకు (నిన్నటి మాదిరి) కొనసాగుతుందని కొంచెమైనా అనుమానించలేదు.

★ ★ ★

నళిని వేగంగా నడుస్తూ మెయిన్ రోడ్డు చేరుకుంది. కొద్దిదూరంలో చౌరస్తా దాటి ఒక ప్రైవేట్ రోడ్డులోకి తిరిగితే అక్కడినుంచి అయిదు నిమిషాల్లో తను పనిచేసే బహుళ అంతస్తుల అపార్టుమెంటుకు చేరుకోవచ్చు. ఆమె నడక వేగం పెంచింది.

స్కూలు బస్సు ఎనిమిది గంటలకు వస్తుంది. మేడం కొడుకు స్కూలుకు వెళతాడు. అతనికోసం బ్రేక్ ఫాస్ట్, భోజనం తయారుచేయాలి.

అపార్టుమెంటు కాంపౌండులో ప్రవేశించగానే నళిని చూపుల్ని ఆవరణ మధ్యలో ఉన్న విశాలమైన స్విమ్మింగ్ పూల్ ఆకర్షించింది. నీలి రంగులో మెరుస్తున్న నీళ్ళతో అది నిండు గంగాళంలా ఉన్నది. ప్రస్తుతం ఈతకొలను ఎవరూలేక నిశ్చలంగా వుంది. కానీ, మరి కొద్దిసేపటి తర్వాత ఒక్కొక్కరుగా చాలామంది

**నళిని కొద్ది క్షణాలు సంశయిస్తూ నిలబడింది. బిందెడు నీటి కోసం అతన్ని అడగాలా వద్దా అని ఆలోచించింది. మెల్లగా అతని దిక్కు నడిచింది. ఎప్పట్లాగే తోటమాలి ముడతలు పడిన ముఖం తీక్షణంగా ఉన్నది. ఏమీ పట్టించుకోకుండా తన పనిలో మునిగివున్నాడు. అతని మీద సందేహాలు పక్కనపెట్టి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని నిర్ణయించుకుంది. ఆమె లాన్ చివరికి చేరుకునేసరికి అతడు ట్యాప్ కట్టేసి తాపీగా బీడీ వెలిగిస్తున్నాడు. నళిని దగ్గరికి రావడాన్ని చూడలేదు.**

అక్కడికి చేరుకుంటారు. పైనుంచి దూకుతూ, ఈదుతూ, నీళ్లంటే లెక్కలేకుండా ఆడుకుంటారు. వాళ్ళలో మహిళలు కూడా ఉంటారు. తను కిచెన్‌లో పనిచేసుకుంటూ కిటికీ లోంచి కొలనులో విహరించే ఆడవాళ్లను చూస్తుంది.

నీళ్ళను చూడగానే హఠాత్తుగా నళినికి గుర్తొచ్చింది. తనకో బిందెడు నీళ్ళు కావాలి. తమ కుటుంబం ఈదినం అవసరాలు తీరేందుకు ఒక్క బిందెడు కావాలి. దినం పొడవునా నీళ్ళ ధారలు కురిపించే నల్లాలు, నదుల్లాంటి ఈత కొలనులూ తమకు అక్కర్లేదు. కేవలం బిందెడు నీళ్ళు కావాలి. కానీ ఎలా..? ఎక్కడ దొరుకుతయి..?

నళిని కిచెనులో వంట చేయడంలో మునిగింది. ఆ ఇంట్లో రోజూ చేస్తున్న బండెడు చాకిరితో పోల్చుకుంటే వంట ఆమెకు పెద్ద భారంగా తోచదు. చకచకా అరగంటలో పూర్తిచేసేస్తుంది.

ఆమె చూపులు కిచెను గట్టుమీద పడివున్న రంగురంగుల ఖాళీ ప్యాకెట్ల మీదికి పోయి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనయి. రకరకాల ఆహార పదార్థాలు తీసుకొచ్చి ఖాళీచేసిన ప్యాకెట్లు. ఆమె చెత్త ఏరుకునే రోజుల్లో అటువంటి రకరకాల రంగు ప్యాకెట్లను, బ్యాగులను చూసింది. ప్రస్తుతం ఆ ఇంట్లో పడివున్న రాప్ ప్యాకెట్లన్నీ కలిపితే తను గతంలో రోజంతా తిరిగి ఏరుకుంటే దొరికే వాటికంటే ఎక్కువే ఉన్నాయని అనిపించింది. సారిక మేడం వాటి నుంచి కూడా ప్రతిఫలం పొందాలనుకుంటుంది. మేడం అంతక్రితమే ఆ ఖాళీ ప్యాకెట్లన్నీ ఏరి వాటికోసం స్టోరు రూములో ఉంచిన పొడవైన పెద్ద బకెట్లో నింపమని ఆదేశించింది. ఇప్పుడా కంటైనర్ ఖాళీ కవర్లతో పొంగి పొర్లింది. పైన మూత పెట్టే వీలులేక ఆమె బలమంతా ఉపయోగించి నొక్కవలసి వచ్చింది. ఆ ప్యాకెట్లు స్క్రాప్ డీలరుకు అమ్మేసి డబ్బులు తీసుకోవడం మేడంకు అలవాటు.

★ ★ ★

నళిని ఇంటికొచ్చి అన్నం తినేటప్పటికి మధ్యాహ్నం రెండు దాటింది.

ఆమె త్వరత్వరగా భోంచేస్తున్నది. అంతక్రితం సారిక మేడంతో జరిగిన సంభాషణ చుట్టూనే ఆమె ఆలోచనలు తిరుగుతున్నయి. "నాకో బిందెడు నీళ్ళు కావాలె అమ్మగారూ..! మన కుళాయి నుంచి తీసుక పొమ్మంటరా?" సంకోచి స్తూనే అడిగింది. మేడం ముఖం చిట్లించి, పెదాలు బిగపట్టి పనిమనిషి వైపు చూసింది.

"కుదరదు నళినీ..! నీకు తెలుసుగా.. ఇక్కడ నీళ్లకు మీటరు వుంటుంది. ఏమాత్రం ఎక్కువ వాడినా వాటర్ బిల్లు పేలిపోతుంది. అనవసరంగా ఖర్చు పెరుగుతుంది" నిష్కర్షగా చెప్పింది.

బిందెడు నీళ్లకు యజమాని అంత నిక్కచ్చిగా లెక్కలు చెప్పటంతో నళిని మనసు చివుక్కుమంది. ఆమె పిసినారి ధోరణికి ఆశ్చర్యం కూడా కలిగింది.

"ఇంట్లో పనిచేసినంత మాత్రాన మీకు అడిగేవన్నీ ఇవ్వాలంటే కుదరదు, అది నాకు నచ్చదు" మళ్లా అన్నది.

నళిని తలొంచుకుంది. మాట్లాడలేదు. ఒక్క బిందె నీళ్ళు... తనేమీ ప్రతిరోజూ కావాలని అడగలేదు. చిన్నగా తలూపి

అనువాద కథ

అక్కణ్ణుంచి కదిలింది. కిచెనులోకెళ్ళి చకచకా గిన్నెలు తోమి కడిగేసింది.

కొద్ది నిమిషాలకి కాలింగ్ బెల్ మోగింది. లోపలి నుంచి మేడం కేక, "నళినీ.. స్టోర్ రూముకు వెళ్లి ఆ పెద్ద బకెట్ ఎత్తుకురా."

నళిని బకెట్ సిట్టింగ్ రూములోకి తెచ్చింది. స్క్రాప్ కొనుక్కునే వ్యక్తి మెయిన్ డోర్ దగ్గర నేలపై కూర్చొని ఉండటం చూసి ఆశ్చర్యపోయింది. పాతపేపర్ల కుప్ప ఒకటి అతని ముందు పడేసి వుంది. అతడా వార్తాపేపర్లు జోకడంలో బిజీగా ఉన్నాడు. సారిక మేడం తన భారీ శరీరాన్ని అంతకన్నా భారీ సోఫాలో స్థిరపరిచి కూర్చుని చూస్తున్నది. ఆమె ముందున్న టీపాయ్ మీద పెద్ద మగ్గులో కాఫీ పొగలు గక్కుతున్నది. బకెట్లోని ప్లాస్టిక్ ప్యాకెట్లు బ్యాగులు తీసి అతని ముందు పెట్టమని ఆమె నళినికి సైగ చేసింది.

"ఇదిగో .. ఈసారి రెండు నెలల వార్తాపత్రికలతో పాటు ఖాళీ ప్యాకులు చాలా ఉన్నయి. నువు నీ తూకంలో మాయలు చేసి తక్కువ చెపితే కుదరదు. మంచి ధర కూడా ఇవ్వాలి" సారిక నిక్కచ్చిగా చెప్పింది.

నళిని మొత్తం ఖాళీ ప్యాకెట్లను తీసి నేలపై పడేసింది. అతడు వాటిని వేరుచేయడం ప్రారంభించాడు. కొద్దిసేపటి తరువాత, మేడం దిక్కు తిరిగి "వీటన్నిటికీ కలిపి వంద రూపాయలు ఇస్తానమ్మా" అన్నాడు.

నళిని ఆశ్చర్యంతో చూసింది. అన్ని పాత పేపర్లు, బ్యాగులకు,వ్యర్థాలకు వంద మాత్రమే.

"ఏమయ్యా.. రెండునెలల పేపర్లు, ఇన్ని రాపర్లకు వంద రూపాయలా? ఇస్తే రెండొందలు ఇవ్వు. లేదంటే వెళ్లిపో. మరొకరిని పిలిచి ఇస్తాను" గొంతు పెంచి గద్దించినట్టు అన్నది. మధ్య మధ్య కాఫీ సిప్ చేస్తూ, మేడం ఆ వ్యక్తితో బేరమాడటాన్ని నళిని విచిత్రంగా చూసింది. చివరికతను 150 రూపాయలకు ఆమెను ఒప్పించాడు.

జేబులోంచి మూడు యాభై రూపాయల నోట్లు తీసి అందజేశాడు. సారిక నోట్లు మడతలు పెట్టి పట్టుకున్నది. వచ్చేనెల మళ్ళీ రమ్మని అతనితో చెప్పింది. స్క్రాప్ డీలర్ వెళ్ళిపోయిన తర్వాత "నళినీ.. నేను కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి. నువు వెళ్లేటప్పుడు తలుపేసి వెళ్ళు. అన్నట్టు చెత్త బయట పారేయడం మర్చిపోకు" ఆదేశించి లోపలికి పోయింది.

నళిని వంటగదికి వెళుతూ తిరిగినప్పుడు చూసింది. మేడం లోపలికిపోతూ డబ్బులు సోఫా మీదనే మరిచిపోయింది. నళిని చూస్తుండగానే గాలికి నోట్లు ఎగిరి కిందపడ్డాయి. వొంగి డబ్బులు తీస్తూ "మేడం" అని పిలిచింది.

కానీ అప్పటికే ఆమె గదిలోకెళ్లి తలుపు మూసింది. నళిని ఆ నోట్లు మడతలు విప్పి గ్లాస్ టాప్ టీపాయ్ మీద ఉంచింది. పక్క నుంచి ఒక క్రిస్టల్ బొమ్మ తీసి నోట్ల మీద బరువుగా ఉంచింది. ఆతర్వాత చెత్తబ్యాగ్ తీసికొని కిందకు వెళ్ళింది. గోడ చివరున్న గార్బేజ్ డబ్బాలో పడేసింది. తిరిగి వచ్చేస్తుంటే కాంపౌండ్ చివర్లో పనిచేసుకుంటున్న తోటమాలి కనిపించాడు. అతను లాన్లో చిన్నగా కదులుతూ కుళాయి నుండి పైపుతో చెట్లకు నీళ్ళు పడుతున్నాడు. నిమిషం

**ఆమె భర్త రవి అంతకుముందు స్కూల్ వ్యాన్ నడిపేవాడు. డ్యూటీ ముగించి ఇంటికొస్తూ స్కూలు నుంచి బిందెడు నీళ్లు తీసుకునేవాడు. ఎప్పుడన్నా అయితే ఫరవాలేదు గానీ, రోజూ నీళ్లు పట్టుకుపోతానంటే కుదరదని ప్రిన్సిపాల్ కోపగించాడు. దానికితోడు స్కూలు నగరానికి అటుపక్క కొత్తగా కట్టిన బిల్డింగులోకి షిఫ్ట్ చేసిన క్రమంలో రవి ఉద్యోగం పోవడమే కాక, ప్రత్యామ్నాయ నీటి వనరు కూడా పోయింది.**

తరువాత, అతను ఒక బాటిల్లో మంచి నీరు పట్టుకోవడం ఆమె చూసింది.

తోటమాలి తమ వాడకు చెందినవాడు కాదని నళినికి తెలుసు. కానీ అందరికీ తెలిసినవాడే. సాయంత్రాలు పెద్దగా వినిపించే అతని గొంతు, నీళ్ళు పట్టినప్పుడు చెట్ల నుంచి చుట్టుపక్కల వ్యాపించే విలక్షణమైన వాసన ఆ సమయంలో అందరికీ చిరపరిచితమే.

నళిని కొద్ది క్షణాలు సంశయిస్తూ నిలబడింది. బిందెడు నీటి కోసం అతన్ని ఆడగాలా వద్దా అని ఆలోచించింది. మెల్లగా అతని దిక్కు నడిచింది. ఎప్పట్లాగే తోటమాలి ముడతలు పడిన ముఖం తీక్షణంగా ఉన్నది. ఏమీ పట్టించుకోకుండా తన పనిలో మునిగివున్నాడు. అతని మీద సందేహాలు పక్కనపెట్టి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని నిర్ణయించుకుంది. ఆమె లాన్ చివరికి చేరుకునేసరికి అతడు ట్యాప్ కట్టేసి తాపీగా బీడీ వెలిగిస్తున్నాడు. నళిని దగ్గరికి రావడాన్ని చూడలేదు.

"నాకో బిందెడు నీళ్ళు కావాలన్నా.. ఇంట్లో సుక్కలేదు. ఈ నల్ల నుంచి తీస్కోమంటవా? కావాలంటే కొన్ని పైసలిస్తా"

తోటమాలి ఒకసారి పైనుంచి కిందికి ఆమెను ఏగాదిగా చూశాడు. బీడీ దమ్ము మరోసారి గట్టిగా లాగి విలాసంగా పొగ గాలిలోకి వొదిలాడు. "బిందెడు నీళ్లకు ఎంతిస్తవు?" ప్రశ్నించాడు.

నళిని గొంతు సవరించుకుని చిన్నగా దగ్గింది. బీడీ పొగ పీల్చలేక చేయి అడ్డుపెట్టుకున్నది.

"నువ్వే చెప్పు" అంది.

"అయితే సరే, ఒక బిందె నీళ్లు 50 రూపాయలు"

నళిని కంగారుపడింది. అతడు ఏ పదో.. ఇరవయ్యో అడుగుతాడని ఆమె భావించింది. బిందె నీరు యాభై రూపాయలు. నమ్మలేనట్టు తల విదిలించింది. " చాలా ఎక్కువన్నా. నాకు ఒక్క బిందె కావాలె. పది రూపాయలిస్తా"

"లేదు.. ఇస్తే యాభై ఇవ్వు. లేదంటే

పో" అతను తలగోక్కుంటూ విసురుగా పక్కకు వెళ్ళాడు. నళిని చేసేదిలేక తిరిగి అపార్టుమెంట్ వైపు నడిచింది. తడిసిన ఆమె కాటన్ చీర కాళ్ళకి ఆడ్డం పడుతూ వేగంగా నడవ కుండా చేస్తుంది. ఆమె వంటగదిలోకి వెళ్లి గట్లన్నీ శుభ్రంగా తుడిచింది. ఇంట్లో వాళ్ల తినగా మిగిలిన ఆహార పదార్థాలను తను తెచ్చుకున్న ప్లాస్టిక్ బాక్సులో సర్దుకొని ఇంటికి బయలుదేరింది. తలుపు దాటబోతూ ఓసారి ఆగి టీపాయ్ మీదున్న డబ్బును చూసింది. పెళపెళలాడే కొత్త నోట్లు. తలతిప్పి మూసిఉన్న బెడ్రూము ద్వారం వంక చూసింది. తర్వాత చకచకా ఫ్లాటు నుంచి బయటకొచ్చి వేగంగా గేటు వైపు నడిచింది. అక్కడే వున్న వాచ్ మెన్ రామన్న ఆమెను చూశాడు. తానుండే చెక్క క్యూబికల్ నుండి బయటకొచ్చి పలుకరించాడు. తోటమాలి వైపు చూపుతూ "నువ్వా తోటమాలితో ఏం మాట్లాడినవు?" అని అడిగాడు.

"పొద్దుగాల మన వాడకు ట్యాంకరొచ్చినప్పుడు మనోళ్ళకి ఒక బిందెడు నీళ్ళు మాత్రమే దొరికినయి. మా ఇంట్ల బిందెడు నీళ్ళు సరిపోవు. అందుకే ఇక్కడ నుంచి ఒక బిందె నీళ్ళు తీసుకపోతనని అడిగిన ..."

"అతనేం చెప్పిండు?"

"యాభై రూపాయలు ఇయ్యిమన్నడు"

రామన్న నళిని వంక సానుభూతితో చూశాడు. "వాడు సాయం చేసే రకం కాదు" అని తలూపాడు.

" నీకు నీళ్ళ కట్టం తీరెతందుకు ఒక జాగ ఉన్నది" అన్నాడు కళ్ళు చిట్లించి దూరంగా వున్న గోపురం వైపు చూపిస్తూ.

"బస్టాండుకు అవల ఉన్న భవంతుల కాడ ఎప్పటిదో పాత చేతి పంపు ఉన్నది. అయితే ఇది శానదినాల కిందటి ముచ్చెట. ఇప్పుడా పంపుల నీళ్ళు వొస్తున్నయో లేదో తెల్వది. నువ్వోపారి అక్కడికి పోయి సూడు" చెప్పాడు.

అక్కడి నుంచి బస్టాండు ఆవలకు పోవడానికి అరగంటకు పైగా నడవాలని నళినికి తెలుసు. కాని రామన్న మాటతో ఆమెలో ఆశ కలిగింది. బిందెడు నీళ్ళు లేకుంటే ఈ దినం గడవడం కష్టం.

లోపలినుంచి పిలుపు రావడంతో రామన్న గబగబా వెళ్ళిపోయాడు. నళిని నిశ్చలంగా కొద్దిసేపు దూరంగా వున్న గోపురం వైపు చూస్తుండి పోయింది. తర్వాత నెమ్మదిగా కదిలి అక్కణ్ణుంచి బయటకు వెళ్ళింది.

ముందుగా గుడిసెకు పోయి ఖాళీ ప్లాస్టిక్ బిందె ఒకటి తెచ్చుకోవాలని భావించింది. ఆ తర్వాత ఆమె బస్టాం డుకు ఆవలున్న భవనాల ప్రాంతానికి వెళుతుంది.

---

# నల్ల కలువ

**ఏడెల్లి రాములు**

చిన్నప్పుడు మా అటుకుమీద
చెక్కపెట్టే చక్కని బీరువా
ఎన్నో మతలాబుల మిషల్ల్ మోసేది
నల్ల కలువై కొలువై ఉండేది

కొత్త బట్టలను అట్టి పెట్టుకుని
ఓహెూ చాలా మురిపాలు ఒలకవోసి
మా నాన్న చేయేస్తే ముసిముసి
నవ్వుల పువ్వులు రువ్వేది
తెలుసా నా మనసులో
నేను ఆ పరిమళాలు దాచుకున్నాను

అవి కొడిగట్టిందెక్కడనీ
కొండెక్కని తూరుపు ఉషస్సులు
చీకట్లు ముసరని స్వాతి కిరణాలు

అమ్మ ప్రసాదించిన వరం
ముచ్చట్లన్నీ పెరుగు మీద మీగడోలె
మనసు కవ్వంతో చిలికితే
వెన్నెల్లాంటి మాటలు వెన్నలా
ఉండాలనేది

కష్టాలను అనుభవిస్తుంటే
మనసు గుడిలో ఘనీభవించిన
దుఃఖ మేఘాలు
నెయ్యిలా కరుగుతుంటే
కరుణ లేఖలు రాయమనేది

నిజమే కదా వాళ్ళంతా తమ మదిలోనే
పదిలంగా అల్లుకున్న పూలపందిరి
సొదలను ఎంత పదిలంగా ఇచ్చారో
ఏ వ్యక్తిత్వ పాఠాలు చెప్పని
చిక్కుముడులను ప్రేమ జ్యోతులు
వెలిగించి తొలగించాలనే భావనలు

ఆకృతి దాల్చిన శాంతి దిమ్మెలు
ఓ భరోసా ఇస్తూ భద్రమే
లాకర్ అక్కర్లేని లావణ్య సౌజన్యం
పూల తావులుగా సహజ సౌందర్యం

వ్యాసం

# సాయుధ రైతాంగ పోరాటం: నేర్చుకోవాల్సిన గుణపాఠాలు

**నాటి తెలంగాణను, సాయుధ పోరాట గీతాలను మన ముందు నిలబెట్టిన వ్యాసం...**



సంగిశెట్టి శ్రీనివాస్

తెలంగాణలో సాంస్కృతిక పునర్వికాసం హైదరాబాద్‌లో శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం స్థాపనతో ప్రారంభమయింది. ఈ భాషానిలయం 1901 సెప్టెంబర్ ఒకటిన రావిచెట్టు రంగారావు, నాయని వెంకట రంగారావు, కొమర్రాజు లక్ష్మణరావుల పూనిక మేరకు ప్రారంభమయింది. ఇది గ్రంథాలయోద్యమానికి దారులు వేసింది. గ్రంథాలయోద్యమ ప్రభావంతో అటు పాఠశాలలు, ఇటు పత్రికలు ప్రారంభమయ్యాయి. 1917లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏర్పాటయింది. పత్రికలు తెలంగాణలోని సాహితీ ప్రతిభను వెలుగులోకి తెచ్చాయి. అట్లాగే స్వీయ అస్తిత్వ కేతనాన్ని ఎగరేశాయి. తొలి తెలంగాణ స్వతంత్ర తెలుగు పత్రిక 'హితబోధిని' 1913లో మహబూబ్‌నగర్ నుంచి ప్రచురితమయింది. పత్రికలతోపాటుగా నిజాం రాష్ట్రాంధ్ర జన సంఘం 1921లో ప్రారంభమయింది. ఇదే సంవత్సరం నీలగిరి, తెనుగు పత్రికలు ప్రారంభమయ్యాయి. ఇవి రెండు కూడా వరుసగా నల్లగొండ, వరంగల్లు జిల్లా ఇనుగుర్తిల నుంచి వెలువడ్డాయి. తెలంగాణ ప్రాంత ప్రజల చైతన్యానికి ఇవి పట్టుగొమ్మలుగా నిలిచాయి. 1921లో ప్రారంభమయిన నిజాం రాష్ట్ర ఆంధ్ర జనసంఘం, నిజాం రాష్ట్రాంధ్ర కేంద్ర జనసంఘంగా ఆ తర్వాత 1930లో ఆంధ్రమహాసభగా రూపాంతరం చెందింది. ఈ మధ్యకాలంలో అంటే 1925లో ప్రారంభమయిన గోలకొండ పత్రిక తెలంగాణ గుండె చప్పుడుని వినిపించింది. గోలకొండ పత్రిక సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి 1930లో జరిగిన తొలి ఆంధ్రమహాసభకు అధ్యక్షత వహించాడు. ఈ సభలో మాట్లాడేందుకు దళితులకు కూడా సముచితమైన స్థానమిచ్చారు. ఇది ఆనాటికి విప్లవాత్మకమైన చర్యే! ఆంధ్రమహాసభ సమావేశాలు జోగిపేట, దేవరకొండ, ఖమ్మం, సిరిసిల్ల, షాద్‌నగర్, నిజామాబాద్‌లలో జరిగాయి.

1938 నాటికి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వందేమాతర ఉద్యమం మొదలయింది. ఈ సమయంలోనే 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్' ఏర్పాటు కావడం, నిషేధానికి గురికావడమూ జరిగింది. ఈ వందేమాతర ఉద్యమాన్ని ఆంధ్రమహాసభ నాయకత్వం పట్టించుకోలేదు. ఇక్కడ చదువుతున్న విద్యార్థులు తమ చదువుకు ఆటకం కలగకుండా ఉండేందుకు నాగపూర్‌తో పాటు రాష్ట్రేతర ప్రాంతాలకు తరలి వెళ్ళారు. ఇట్లా వెళ్ళిన వారిలో పి.వి.నరసింహారావు, దేవులపల్లి వెంకటేశ్వరరావులు కూడా ఉన్నారు. వీరిలో ఒకరు భారతదేశానికి ప్రధాని కాగా మరొకరు సాయుధ పోరాటానికి అంకితమయిండ్రు.

1939లో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడం హైదరాబాద్ రాజ్యంలో కమ్యూనిస్టు కార్యకలాపాలకు జీవం పోశాయని చెప్పొచ్చు. రెండో ప్రపంచ యుద్ధం జరుగుతున్న సందర్భంలో ప్రజల ఆర్థిక స్థితిగతులు గణనీయంగా క్షీణించాయి. శ్రమకు తగ్గ ఫలితం దక్కలేదు. బలవంతపు యుద్ధ నిధుల వసూళ్ళు, లెవీ ధాన్యాలు కొలవడం పెరిగింది. అదే సమయంలో విలాసాలకు అలవాటు పడ్డ దేశ్‌ముఖ్‌లు, దొరలు, నవాబులు తమ ఖర్చుల్లో ఏమాత్రం కోత విధించుకోకుండా వెట్టి, బలవంతపు పన్నుల వసూళ్ళకు మరింతగా తెగబడ్డారు. చట్టరీత్యా వెట్టి చాకిరి నిషేధింపబడ్డప్పటికీ దాన్ని దొరలు, దేశ్‌ముఖ్‌లు ఎన్నడూ గౌరవించలేదు. వెట్టి చేయించుకోవడం తమ హోదాకు చిహ్నంగా, గౌరవంగా భావించారు. ఇట్లాంటి వారికి ప్రతినిధిగా విసునూరు దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి, ఆయన తల్లి జానకమ్మ, కొడుకు జగన్మోహన్‌రెడ్డి (బాబుదొర)లను చెప్పవచ్చు. దాదాపు ఇదే కాలంలో దొరల దౌర్జన్యాల నుంచి తప్పించుకునేందుకు కొంతమంది, తాయిలాల ప్రచారానికి

లోబడి మరికొంత మంది ఇస్లామ్ మతాన్ని స్వీకరించారు. దీంతో శుద్ధి, తబ్లీగ్ ఉద్యమాలు కూడా పురుడు పోసుకున్నాయి.

1940లో హైదరాబాద్‌లో సయ్యద్ హుసేన్, జవాద్ రజ్వీ, జహందర్ అఫ్సర్, ప్రొఫెసర్ ఫారుఖీ, మగ్రత్ మొహినుద్దీన్ తదితరులు 'కామ్రేడ్స్ అసోసియేషన్'ని ఏర్పాటు చేసిండ్రు. ఇదే హైదరాబాద్ రాజ్యంలో కమ్యూనిస్టు పార్టీకి పునాది. ఇదే సంవత్సరం నల్లగొండ జిల్లా చిలుకూరులో జరిగిన ఎనిమిదవ ఆంధ్రమహాసభకు రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించాడు. దీని తర్వాత తెలంగాణలో కమ్యూనిస్టుల ప్రాభవం మొదలయ్యింది.

రెండో ప్రపంచ యుద్ధం కారణంగా ప్రజల కొనుగోలు శక్తి క్షీణించడమే గాకుండా, ప్రతి వస్తువుకు రేషనింగ్ విధించిండ్రు. బియ్యం మొదలు న్యూస్‌ప్రింట్ వరకూ అన్నింటిపై రేషనింగ్ అమలయింది. కౌలుదారీ, బేదఖళ్ళు విరివిగా ఉండేవి. దున్నేవాడికి భూమి మీద అధికారం ఉండేది కాదు. ఎవరినైనా ఈజీగా భూమి నుంచి బేదఖల్ (తొలగించబడం) చేసేవారు. దొరలు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలు, దోపిడీ, హింస పెరుగుతున్న కాలంలో ఆంధ్రమహాసభ నుంచి బలమైన ప్రతిఘటన రాలేదు. నిజానికి కాంగ్రెస్ పార్టీలో (ఆంధ్రమహాసభలో) నాయకత్వంలో ఉన్నవాళ్ళలో అనేకమంది భూస్వాములే! తాము ఏమాత్రం ఈ విషయాల్లో తలదూర్చినా ప్రభుత్వానికి తమపై అధిపత్యానికి అవకాశం కల్పించిన వారమవుతామనే ఉద్దేశ్యంతో వినతులు, సమావేశాల తీర్మానాలకే తమ కార్యక్రమాలను పరిమితం చేసినారు. ఈ ఉద్యమాల్లో నాయకత్వ స్థానంలో ఉన్నవాళ్ళందరూ అడ్వకేట్లుగా ప్రాక్టీస్ చేస్తున్నవారే కావడం గమనార్హం. అడ్వకేట్లుగా ఉన్నవారు రోడ్లమీద ధర్నాలు చేయడం, అరెస్టు కావడం, జైలులో శిక్ష అనుభవించడానికి అంతగా సిద్ధపడలేదు. ఒకరిద్దరు సిద్ధపడ్డా వారి ప్రభావం చాలా

**చాకలి ఐలమ్మ పోరాటం ఉద్యమానికి దిక్సూచి. అయితే ఆమె 1985లో అత్యంత పేదరికంలో భూమిలేని పేదగా మరణించింది. దొడ్డి కొమురయ్య అమరుడైన జూలై నాలుగుని కనీసం కమ్యూనిస్టు పార్టీలు కూడా గుర్తుంచుకునే పరిస్థితి లేదు. ఆయన విగ్రహానికి దిక్కులేదు. సుద్దాల హనుమంతు, బండి యాదగిరిలు తమ పాటల ద్వారా ఉద్యమానికి ప్రాణవాయువు నందించారు. సుద్దాల 1982లో క్యాన్సర్‌తో ఎలాంటి గుర్తింపుకు నోచుకోకుండా చనిపోయిండు.**

తక్కువ. అంతకుముందు హైదరాబాద్‌లో జరిగిన సత్యాగ్రహోద్యమంలో కూడా ఈ విషయం స్పష్టంగా కనబడింది.

హైదరాబాద్ కామ్రేడ్స్ అసోసియేషన్ కార్యకలాపాల మూలంగానూ, వందేమాతర ఉద్యమంలో ఇతర రాష్ట్రాలకు చదువుకొనడానికి వెళ్ళిన వారూ కమ్యూనిజం ప్రభావానికి లోనయ్యారు. ఈ కమ్యూనిజం చేత ప్రభావితులైన వారు మెల్లమెల్లగా ఆంధ్రమహాసభలో భాగమయిండ్రు. ఆంధ్రమహాసభలో అభివృద్ధి పక్షంగా వ్యవహరిస్తూ తమ ప్రాబల్యం ఉన్న ప్రదేశాల్లో అధిక సంఖ్యలో 'సంగం'లో సభ్యులుగా చేర్పించినారు. తర్వాతి కాలంలో కమ్యూనిస్టులు 'సంగం' బాధ్యతల్ని చేజిక్కించుకోవడానికి ఇది తోడ్పడింది. అభివృద్ధి పక్షంలోని అతివాదులు ప్రభుత్వ వ్యతిరేక వైఖరిని అవలంభిస్తూ మితవాదుల నిశ్శబ్దాన్ని నిలదీసిండ్రు. పీడితులకు మేలు జరగాలంటే కచ్చితంగా ఆంధ్రమహాసభ అనివార్యంగా రైతులు, కూలీల పక్షాన నిలబడాలని డిమాండ్ చేసిండ్రు.ఆంధ్రమహాసభ అధ్యక్షుడిగా ఎన్నికయిన నాటి నుంచి రావి నారాయణరెడ్డి దూకుడుగా పనిచేయడం, రైతులు, కూలీల పక్షాన బలంగా నిలబడడం ఆంధ్రమహాసభలోని ఇతర నాయకులకు అంతగా నచ్చలేదు. అందుకే 1944లో భువనగిరిలో నిర్వహించతలబెట్టిన 'ఆంధ్రమహాసభల్ని నిర్వీర్యం' చేయడానికి మితవాదులు పనిచేసిండ్రు. చివరికి ఈ సమావేశాన్ని కాంగ్రెస్ అనుకూల మందుముల నరసింగరావు, కొండా వెంకటరంగారెడ్డి వర్గాలు బహిష్కరించాయి. దాంతో 1944 నాటికి ఆంధ్రమహాసభ పగ్గాలు కమ్యూనిస్టుల చేతికి చిక్కాయి. నాయకత్వ స్థానంలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి తదితరులున్నారు. అందుకే ఆంధ్రమహాసభ అతివాద కార్యక్రమాలు మొదట భువనగిరి, జనగామ, సూర్యాపేట తాలూకాల్లోనే విస్తృతమయ్యాయి. 1945లో ఖమ్మంలో జరిగిన సభలకు కూడా రావినారాయణ రెడ్డే అధ్యక్షుడిగా ఉన్నాడు. అందుకే దేవులపల్లి వెంకటేశ్వరరావు మొదట 'జన్గాం ప్రజల వీరోచిత పోరాటం' తర్వాత 'నల్లగొండ ప్రజల వీరోచిత పోరాటం' పుస్తకాలను 1946నాటికే ప్రచురించారు.

1944 భువనగిరి ఆంధ్రమహాసభ పెద్ద ఎత్తున రైతులు, కూలీలను ఆకర్షించింది. రైతులు, కూలీల స్థితిగతులపై తీర్మానాలు చేసింది. కార్యాచరణ ప్రకటించింది. ఈ కార్యాచరణ మేరకే బి.ఎన్.రెడ్డి, నల్లా నరసింహులు తదితరులు గ్రామాల్లో ప్రజల్ని సమీకరించగలిగారు. పోరాటానికి సన్నద్ధం చేయగలిగిండ్రు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి, పీడన, దొరల దోపిడీ, దౌర్జన్యాల నుంచి విముక్తి కోసం పేదలు, చేతి వృత్తిదారులు, రైతులు, వ్యవసాయ కూలీలు సంఘటితమయిండ్రు. దొరలు, భూస్వాములు, దోపిడీ స్వభావమున్న అధికారులపై తిరగబడిండ్రు. వెట్టి విధానం రద్దు కావాలి. పన్నులు తగ్గించాలి. జాగీర్దారి విధానం పోవాలి. సర్వే సెటిల్‌మెంట్ జరపాలి. అధిక కౌలు ధరలు తగ్గించాలి. దున్నేవాడికే భూమిపై పట్టా హక్కు కల్పించాలి. మగ్గంపై మొహతర్ఫా పన్ను, కల్లుగీతపై ఉన్న

హక్-ఎ-మాలిఖానా పన్నుని రద్దు చేయాలి అనేవి ప్రజల డిమాండ్లు. ఈ డిమాండ్ల సాధనకు ఆంధ్రమహాసభ పేరిట కమ్యూనిస్టులు ప్రజా చైతన్యం కోసం పనిచేసింద్రు. ఎందుకంటే అప్పటికే బ్రిటీషాంధ్రలో కమ్యూనిస్టులపై నిషేధం ఉన్నది. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత కమ్యూనిస్టు పార్టీ తరపున ఉద్యమాన్ని ఉధృతం చేసింద్రు. పోరాటంలో రైతులు, కూలీలు సంఘటితమయింద్రు. క్షేత్రస్థాయిలో భూమిలేని బహుజన రైతులు, దళితులు ఉద్యమంలో ముందున్నరు. గుత్పల సంఘం ఏర్పాటైంది. మొదట గుత్పలందుకొని గ్రామాల్లోని పటేల్, పట్వారీలపై తిరుగుబాటు చేసింద్రు. గ్రామాల్లో ప్రభుత్వ రెవిన్యూ, పోలీసు ప్రతినిధులుగా వీళ్ళుండేవారు. అలాగే హైదరాబాద్‌లో రెవిన్యూ, పోలీసు శాఖాధికారులుగా బ్రిటీష్ సంతతి వాళ్ళే ఉండేవారు. దాంతో శాంతి భద్రతలు, లావాదేవీలు అన్నీ వారి కనుసన్నల్లోనే ఉండేవి.

గుత్పల సహాయంతో ఆంధ్రమహాసభ కార్యకర్తలు బాధితులకు అండగా నిలబడ్డరు. విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి దౌర్జన్యాలు, హింసకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమై నిరసన వ్యక్తం జేస్తూ ప్రదర్శనలు చేసింద్రు. జనగామ దగ్గరలోని పాలకుర్తిలో చాకలి ఐలమ్మ పంటను విసునూరు దేశ్‌ముఖ్ తల్లి జానకమ్మ కోసుకోవాలని ప్రయత్నిస్తే ఆమె సంఘం అండతో అడ్డుకోగలిగింది. ధాన్యాన్ని నూర్చి తన ఇంటికి తెచ్చుకున్నది. కోర్టుల చుట్టూ తిరిగి పోరాటం చేసింది. బహుశా ఇది గుత్పల సహాయంతో బాధితులకు ఆంధ్రమహాసభ అందించిన తొలి అభయం. ఆసరా! ఆ కాలంలో భూమి ఖాల్సా, దివాని, సర్ఫేఖాస్, జాగీర్దారిల పేరిట విభజింపబడి వివిధ వర్గాల అధీనంలో ఉండింది. సర్ఫేఖాస్ భూములన్నీ నిజాం సొంత ఆస్తులు. జాగీర్దార్లు, జమీందార్లతోపాటు లక్షయాభైవేల ఎకరాల నుంచి వెయ్యి ఎకరాల వరకు భూస్వాములు వివిధ స్థాయిలో తమ అధీనంలో ఉంచుకొని రైతు కూలీల చేత వెట్టి చేయించుకునేవారు. ఈ దేశ్‌ముఖ్‌లో ఒకరైన విసునూరుకు చెందిన రాపాక రామచంద్రారెడ్డి తన గడీని ప్రజలని పీడించి, పట్టీలు (పన్నులు) వసూలు చేసి కట్టుకున్నడు. 40వేల ఎకరాల భూస్వామి అయిన రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించింద్రు. ఈయన తల్లి జానకమ్మ నివాసం కడవెండి. ఈ కడవెండిలో ప్రజలు ఆమెను దొరా అని పిలిచేవారు. ఎందుకంటే అమ్మా అంటే నీ అయ్యకు పెండ్లాన్నారా? అని తిట్టేది. అలాగే దొరసాని అంటే నేను సాని దాన్నారా? అని నిందించేది. అందుకే ప్రజలు ఆమెను కూడా దొరా అనే పిలిచేవారు. ఈ కడవెండిలో దొరకు వ్యతిరేకంగా ప్రజలు ఆంధ్రమహాసభ నేతృత్వంలో జూలై నాలుగు, 1946 నాడు ఒక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనపై మిష్కిన్ అలీ లాంటి విసునూరు దేశ్‌ముఖ్ గుండాలు కాల్పులు జరిపింద్రు. ఈ కాల్పుల్లో ప్రదర్శనలో పాల్గొంటున్న ఆంధ్రమహాసభ కార్యకర్త దొడ్డి కొమురయ్య అమరుడయ్యిండు. ఇది తెలంగాణ రైతాంగ పోరాటాన్ని సాయుధం చేసింది. దీంతో సాయుధ పోరాటం షురువయింది. ఆనాటి నుంచి ఆంధ్రమహాసభ కార్యకర్తలు 'ప్రజా కంఠకుల'పై ఆయుధాన్ని ప్రయోగించింద్రు.

కడవెండి సంఘటన తర్వాత దొరలు, భూస్వాములు, వారి అనుచరుల దగ్గర ఉన్న తుపాకులను గుంజుకోవడాన్ని ఒక ఉద్యమంగా చేపట్టింద్రు. దొడ్డి కొమురయ్య మరణంతో ఉద్యమం సాయుధమయింది. ఇదే సమయంలో 1947లో హైదరాబాద్ రాజ్యం 'స్వతంత్రాన్ని' ప్రకటించుకుంది. భారత దేశంతో 1947 నవంబర్‌లో యథాతథ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 1946 జూలై నాలుగు నుంచి హైదరాబాద్‌పై పోలీసుచర్య వరకు అంటే సెప్టెంబర్ 17, 1948 నాటి వరకు అటు కమ్యూనిస్టుల చేతిలోనూ, రజాకార్ల చేతిలోనూ, హైదరాబాద్ పోలీసుల చేతిలోనూ దాదాపు నాలుగు వందలమంది హతమయింద్రు. ఎవరికి వారు చచ్చిన వారు ప్రజా కంఠకులు అని ప్రకటించారు. అయితే విషాధమేంటంటే 1948 సెప్టెంబర్ 17 నుంచి 1951 అక్టోబర్ 21న కమ్యూనిస్టు పార్టీ పోరాట విరమణ ప్రకటించే నాటికి తెలంగాణలో దాదాపు 4000ల మంది నెహ్రూ, పటేల్ పంపిన మిలిటరీ చేతిలో హతమయింద్రు.

సాయుధ పోరాటంలో తెలంగాణలో దొడ్డికొమురయ్యతో పాటు, 'బండెనుక



బండికట్టి ఏ బండ్లె వస్తవ్ కొడుకా నైజాం సర్కరోడా' అనే గేయాన్ని రాసిన బండి యాదగిరి, కోయథాను, పాపక్క, భైరాన్‌పల్లి వీరులు, రేణికుంట, కుర్రారం రామిరెడ్డిలు ఇట్లా అనేక మంది ఉన్నరు. ఇందులో మెజారిటీగా ప్రాణాలర్పించింది దళిత, ఆదివాసీ, గిరిజన, బహుజన బిడ్డలు. ఈ పోరాటంలో అసువులు బాసిన 4500ల మంది లెక్క ఇప్పటికీ తేలలేదు. వారిలో మెజారిటీ పేర్లూ రికార్డుల్లో చేరలేదు. అజ్ఞాత వీరులుగానే ఉన్నారు. గ్రామస్థాయి నుంచి అడవులకెళ్ళి ప్రజల పక్షాన నిలబడి కొట్లాడింది సబ్బండ వర్ణాల వారు. చేతివృత్తుల వాండ్లు. వీళ్ళు ఉద్యమం పుణ్యామా అని అటు ఉపాధి కోల్పోయింండ్రు. వృత్తులూ కోల్పోయింండ్రు.

ఆయుధాలు ధరించిన సంగం సభ్యులు గడీల నుంచి, దొరల నుంచి స్వాధీనం చేసుకున్న ధనాన్ని, వెండి బంగారాన్ని అగ్రశ్రేణి నాయకత్వానికి అప్పజెప్పింండ్రు. ఆ నాయకత్వం డబ్బుని దళాల దగ్గరే ఉంచి, ఆయుధాల కొనుగోలు కోసం వెండి, బంగారాన్ని తమ దగ్గర ఉంచుకున్నది. ఉద్యమం ఊపుమీద ఉన్న కాలంలోనే నాయకత్వం కాంగ్రెస్‌పార్టీకి లొంగిపోయింది. ప్రభుత్వం నుంచి కనీస హామీలు లేకుండానే బేషరతుగా 1951 అక్టోబర్ 21న 'సాయుధ పోరాట విరమణ' ప్రకటించింది. దీంతో అప్పటి వరకు ఆయుధం చేతబట్టిన చాలా మంది జైలు పాలయింండ్రు. కొంతమంది లొంగిపోయిన వారు తమ దగ్గరున్న రూపాయలను ఖర్చు పెట్టడానికి సాహసించలేదు. ఆ తర్వాత ఎన్నికల తర్వాత ఖర్చు పెడదామంటే అవి చెల్లకుండా పోయాయి. ఎందుకంటే నిజాం కరెన్సీ హాలీ సిక్కా రద్దయింది. భారత ప్రభుత్వ రూపాయి చలామణిలోకి వచ్చింది. అంతేగాదు నాయకత్వం వద్ద ఉన్న బంగారు, వెండి నగలు ఈజీ మారకమై లక్షాధికారులయింండ్రు.

ఈ పోరాట విరమణతో అప్పటి వరకు పది లక్షల ఎకరాలను పంచుకున్న ప్రజలు మళ్ళీ ఆ భూమినుంచి బేదఖ్ చేయబడ్డరు. పోరాడి స్వాధీనం చేసుకున్న భూమిని మళ్ళీ దొరలు కబ్జాలోకి తెచ్చుకున్నరు. కంటి తుడుపు చర్యగా బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం కొన్ని భూసంస్కరణ చట్టాలు అమల్లోకి తెచ్చింది గానీ మెజారిటీగా మళ్ళీ దొరల ఆధిపత్యం కాంగ్రెస్ టోపీల ద్వారా నెలకొన్నది. మరోవైపు వినోభా బావే 'భూదానోద్యమం'ని ప్రారంభించి దళితులకు, భూమిలేని పేద రైతులకు భూమిని పంచే ఒక 'షో' నిర్వహించిండు. దీంతో గ్రామాల్లో తమ సేరిదార్లు, ఏజెంట్ల ద్వారా లక్షల ఎకరాలను సాగు చేసుకుంటున్న భూస్వాములు, 100,200ల ఎకరాలు వినోభా బావేకు ఇచ్చి 'భూదానోద్యమకారులు'గా పేరు తెచ్చుకున్నరు. దీంతో పాటు పట్టణాలకు పారిపోయిన దొరలు మళ్ళీ గ్రామాల్లో అడుగు పెట్టడానికి ఈ భూదానోద్యమం తోడ్పడింది. ఇట్లా మళ్ళీ ఉద్యమ కాలంలో ఊళ్ళనుంచి వెళ్ళగొట్టబడ్డ దొరలు/ భూస్వాములు గ్రామాల్లోకి అడుగు పెట్టింండ్రు. కాంగ్రెస్ నాయకులుగా చలామణి అయింండ్రు. అంటే అంతవరకు ఆయుధం పట్టిన కార్యకర్తలు జైలుకు పోయింండ్రు. లేదంటే పోలీసు/మిలిటరీ బలగాల చేతిలో హతమయింండ్రు.

ఇంతకీ విషయం ఏంటంటే తెలంగాణ సాయుధ పోరాటం వల్ల అన్ని విధాలుగా నష్టపోయిందీ దళిత బహుజనులే! విలువైన ప్రాణాలు పోయినాయి. వికలాంగులయింండ్రు. అన్నీ సవ్యంగా ఉన్నవాళ్ళు విద్యకు దూరమయింండ్రు. అదే విధంగా సాయుధ సమరంలో పంచుకున్న పది లక్షల ఎకరాలూ మళ్ళీ దొరల పాలయినాయి. అదే విధంగా రాజకీయ ప్రాతినిధ్యమూ తగినంతగా లేదనేది ఇప్పుడు స్పష్టమౌతుంది. కమ్యూనిస్టు (పిడిఎఫ్ - ప్రొగ్రెసివ్ డెమోక్రాటిక్ ఫ్రంట్) పార్టీ తరపున బీసీలకు సీట్లిస్తే గెలిచే సత్తా ఉన్నదనే విషయాన్ని పెండెం వాసుదేవ్ గజ్వేల్‌లో నిరూపించిండు. 1952 ఎన్నికల్లో మొత్తం పిడిఎఫ్ తరపున గెలిచిన 37లో 30 సీట్లు అగ్రకులాల వాళ్ళవే. అంటే దళిత, బహుజనుల స్థితి అర్థమైతది. నిజానికి అన్ని పార్టీలు ఈ వర్గాల వారికి ప్రాతినిధ్యం కల్పించలేదు. ఆ ఎన్నికల్లో గంగుల భూమయ్య లాంటి వాళ్ళు ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలు పొందారు. కొంతమంది బీసీలు సోషలిస్టు పార్టీ తరపున ఎన్నికయింండ్రు. ఏతా వాతా తేలేదేంటంటే బహుజనులు ముఖ్యంగా బీసీ కులాల వాళ్ళకు సాయుధ పోరాటం వల్ల ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగింది. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సాయుధపోరాటం అడ్డుకట్ట వేసిందని చెప్పొచ్చు. ఈ నష్టాన్ని ఇప్పుడు రాజకీయ ప్రాతినిధ్యంతో పూరించాల్సిన అవసరముంది.

చాకలి ఐలమ్మ పోరాటం ఉద్యమానికి దిక్సూచి. అయితే ఆమె 1985లో అత్యంత పేదరికంలో భూమిలేని పేదగా మరణించింది. దొడ్డి కొమురయ్య అమరుడైన జూలై నాలుగుని కనీసం కమ్యూనిస్టు పార్టీలు కూడా గుర్తుంచుకునే పరిస్థితి లేదు. ఆయన విగ్రహానికి దిక్కులేదు. సుద్దాల హనుమంతు, బండి యాదగిరిలు తమ పాటల ద్వారా ఉద్యమానికి ప్రాణవాయువు నందించారు. సుద్దాల 1982లో క్యాన్సర్‌తో ఎలాంటి గుర్తింపుకు నోచుకోకుండా చనిపోయిండు. అలాగే బండి యాదగిరి ఎన్‌కౌంటర్‌లో చనిపోయిండు. ఇప్పటికీ ఆయన రూపురేఖల్ని చిత్రించుకోలేదు. ఓ స్మారకాన్ని నిర్మించుకోలేదు. సాయుధ పోరాటానికి ముందే దొరలతో కొట్లాడి హతమయిన బందగీ గురించి ఇవ్వాళ తెలిసింది చాలా తక్కువ.

ఈ చరిత్రంతా సాహిత్యంలో ముఖ్యంగా పాటల రూపంలో రికార్డయింది. బందగీ, దొడ్డి కొమురయ్య, అనభేరి ప్రభాకర్, రేణికుంట రామిరెడ్డి, కుర్రారం రామిరెడ్డి ఇట్లా వందల సంఖ్యలో హతులయిన

వ్యాసం

కమ్యూనిస్టు యోధుల స్మృతి గీతాలు వెలువడ్డాయి. కేవలం స్మృతి గీతాలే గాకుండా పోరాట తీరు తెన్నులపై కూడా పాటలు వచ్చాయి. రైతులు, కూలీలను పోరాటానికి సమయాత్తం చేసేలా, పోరుబాటను చరిత్రకెక్కించే విధంగా పాటలు రాసిండ్రు. ఒకవైపు కొంతమంది సాయుధ వీరులు ఒక చేత్తో గన్నూ, మరో చేత్తో పెన్నూ చేపట్టి పాటలను రాసిండ్రు. సుద్దాల హనుమంతు, బండి యాదగిరి, వయ్యా రాజారామ్ లాంటి వాండ్లు ఈ కోవలోకి వస్తారు. వీళ్ళంతా తెలంగాణ వాళ్ళు కాగా ఆంధ్రా ప్రాంతం నుంచి ఉద్యమానికన్నా ముందే తెలంగాణ అల్లుడిగా అడుగు పెట్టిన తిరునగరి రామాంజనేయులు కూడా సాయుధ పోరాటం చేస్తూనే బుర్రకథలు, పాటలు రాసిండు, పాడిండు. అయితే తెలంగాణ వాండ్లు యుద్ధ క్షేత్రంలో ఉండి పాటలు రాయగా, ఆంధ్రాప్రాంతానికి చెందిన వారు పోరాట యోధులకు స్ఫూర్తినిచ్చే విధంగా తాము మైదాన ప్రాంతంలో ఉంటూ పాటలల్లిండ్రు. కె.వి.రమణారెడ్డి, ఆరుద్ర, ఆవంత్స సోమసుందర్, నార్ల చిరంజీవి, కోగంటి గోపాలకృష్ణయ్య, పలుపుల శివయ్య, సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, ముక్కామల నాగభూషణం,నాజర్, అయ్యపు వెంకటకృష్ణయ్య, , తెన్నేటి సూరి, తదితరులు ఉద్యమానికి తమ సాహిత్యం ద్వారా ఊతమిచ్చిండ్రు. అయితే వీళ్ళంతా కమ్యూనిస్టు వారే కావడం విశేషం. నిజానికి తెలంగాణ సాయుధ పోరాట కవిత్వం/పాటలు మొత్తం తెలంగాణేతరులే రాసిండ్రనే విధంగా ఇన్నేండ్లు సీమాంధ్ర విమర్శకులు ఒక అభిప్రాయాన్ని కలిగించారు. ఆరుద్ర (త్వమేవాహం), సోమసుందర్ (వజ్రాయుధం), గంగినేని (ఉదయిని), అనిసెట్టి (అగ్నివీణ), రెంటాల (సర్పయాగం, సంఘర్షణ), కె.వి. రమణారెడ్డి (భువనఘోష, అడవి), ఎర్రోజు మాధవాచార్యులు (మఘవలయం), కుందుర్తి (తెలంగాణ) ఇంకా అనేకమంది పోలీసు చర్య ద్వారా తెలంగాణకు విముక్తి కలిగిందనే భావన కలిగించారు. ఈ రచనలన్నీ నిజాంని, దేశ్‌ముఖ్‌లని, దేశ్‌పాండ్యాలను, దొరలను లక్ష్యంగా చేసుకొని వారి పీడనను నిలదీస్తూ రాసినవే! ఒక్క మఘవలయం, (సర్పయాగం?) తప్ప అన్నీ 1956కు ముందు వెలువడ్డవే! వీళ్ళు నెహ్రూ, పటేల్ సైన్యాల దాష్టీకాలను నిరసించలేదు. కనీసం రికార్డు చేయలేదు. శ్రీరంగం శ్రీనివాసరావు హైదరాబాద్‌లో నిజాం సంస్థానంలో సాయుధ పోరాట కాలంలో కొలువు చేసిండు. పోరాటం గురించి ఒక్క కవిత కూడ రాయలేదు. ఇందులో ఒక్క 'మఘవలయం' రాసిన ఎర్రోజు మాధవాచార్యులు విశ్వబ్రాహ్మణులు. మిగతా వారందరూ అగ్రకులాల వాండ్లే! గంగినేని కమ్మ సామాజిక వర్గం వాడు కాగా మిగతా అందరూ బ్రాహ్మణులే!

ఉద్యమంలో కేవలం కమ్యూనిస్టులే గాకుండా కాంగ్రెస్ భావజాలం ఉన్న వారు కూడా పాల్గొన్నారు. వాళ్ల తమ పాటల ద్వారా గ్రామాల్లో కమ్యూనిస్టుల దురంతాలకు వ్యతిరేకంగా పాటలు రాసిండ్రు. అయితే ఇప్పటి వరకు సాహిత్య చరిత్రలో కేవలం కమ్యూనిస్టులు రాసిన పాటలే రికార్డయ్యాయి. వాటికి మాత్రమే ప్రాచుర్యం కల్పించారు. కాంగ్రెస్ సానుభూతి పరులైన సురవరం ప్రతాపరెడ్డి, గంగుల శాయిరెడ్డి, అలువాల వెంకయ్య, గార్లపాటి రాఘవరెడ్డి, కె.ఎల్.నరసింహారావు, సర్వదేవభట్ల నరసింహమూర్తి, దాశరథి కృష్ణమాచార్య, అప్పన్న (వరంగల్), అడ్లూరి అయోధ్య రామ కవి తదితరులు పాటలు రాసిండ్రు. అట్లాగే కమ్యునిస్టులయిన మల్లు స్వరాజ్యం, కాంచనపల్లి చిన వెంకట రామారావులూ రచనలు చేసిండ్రు. వాటిలో కొన్నింటిని ఈ వ్యాసంలో ప్రత్యేకంగా ప్రస్తావించడమయింది. ఇందులోని మెజారిటీ పాటలు ఇప్పటి వరకు సాహితీ ప్రపంచానికి తెలియదు. అంటే కేవలం పాత పత్రికల్లోనే ఉండి పోయిన ఈ పాటలను ఈ వ్యాసం ద్వారా మీముందుకు తీసుకు వస్తున్నాను.

వరంగల్ జిల్లా జనగామ ప్రాంతానికి చెందిన దళిత కవి వయ్యా రాజారాం బాల కొరియర్‌గా పనిజేసిండు. 16వ యేట అరెస్టయి చంచల్‌గూడా జైలులో శిక్షను అనుభవించాడు. ఈయన రాసిన ఆనాడు ప్రజల నాలుకపై ఉండేటివి. ఈయన నెహ్రూపై రాసిన కవిత ఆనాటి ఉద్యమానికి అద్దం పట్టింది.

'రంగు రంగుల మారి నెవురయ్యా
నీ రంగు బైరంగమాయె నెవురయ్యా
కుడిన టాటాగాళ్ళు ఎడమ బిర్లాగాళ్ళు
నడినెత్తిన ట్రామసయ్య నెక్కించుక
సోషలిజమంటావు నెవురయ్యా నీ
వేషమంత దెలిసింది నెవురయ్యా' అని

హైదరాబాద్‌పై పోలీసు చర్య ఆంతర్యాన్ని వెల్లడించాడు.

మరో అజ్ఞాతకవి

'పటేల్ నెవురులొచ్చినా - గుర్ఖా సిక్కులదోలినా
ఎత్తిన జెండా దించకోయ్ - అరుణ పతాకకు జై' అని నినదించిండు.

ఆంధ్రప్రాంత నుంచి రాసిన కవులందరూ వినికిడి జ్ఞానంతో కమ్యూనిస్టు ఉద్యమానికి సంఘీభావంగా కవిత్వమల్లిండ్రు. ఆరుద్ర 'త్వమేవాహం' రాయడానికి కృష్ణాపత్రికలో వచ్చిన స్ఫూర్తి అని రాసుకున్నడు. అదే తెలంగాణ కవులు యుద్ధం మధ్యలో ఉండి

**తెలంగాణ సాయుధ పోరాటం వల్ల అన్ని విధాలుగా నష్టపోయింది దళిత బహుజనులే! విలువైన ప్రాణాలు పోయినాయి. వికలాంగులయిండ్రు. అన్నీ సవ్యంగా ఉన్నవాళ్ళు విద్యకు దూరమయిండ్రు. అదే విధంగా సాయుధ సమరంలో పంచుకున్న పది లక్షల ఎకరాలూ మళ్ళీ దొరల పాలయినాయి. అదే విధంగా రాజకీయ ప్రాతినిధ్యమూ తగినంతగా లేదనేది ఇప్పుడు స్పష్టమౌతుంది.**

కవిత్వమల్లిండ్రు. అట్లా అల్లిన వారిలో సుద్దాల హనుమంతు, బండి యాదగిరి, వయ్యా రాజారాం ప్రభృతులు ప్రముఖులు. సుద్దాల హనుమంతు లాంటి వాళ్ళు ఉద్యమ సమయంలో గ్రామ గ్రామాన తిరిగి పాటలను కైగట్టిండు. అయితే అవేవి ఆయన కాపాడుకోక పోవడంతో 1983 వరకూ పుస్తక రూపంలో రాలేదు.

'పల్లెటూరి పిల్లగాడా పసుల గాసే మొనగాడా' లాంటి పాటలు 'మాభూమి' సినిమాతో ఇప్పటి తరానికి కూడా తెలియ వచ్చింది. బండి యాదగిరి పాట 'బండెన్క బండి కట్టి' ఇప్పటికీ అనేక వివాదాలకు మూలం. బండి యాదగిరికి నివాళి అర్పిస్తూ

"కోటపాటి దాడి యాదన్నా
బల్ భేషుగా చేసావ్ యాదన్నా
అందుకో జోహారు యాదన్నా
నీపేరు నిలబెడతాం యాదన్నా" అని

పాడుకున్నరు.

సాయుధ పోరాటంలో అమరులైన వారి స్మృతి గీతాలు ఎక్కువగా తెలంగాణ వాళ్ళే రాసిండ్రు. దొడ్డికొమురయ్యను యాద్జేసుకుంటూ

"తెలుగు తల్లి బంధాలు
త్రెంచివేయుటలోన
బలమట్లు చూపించి తొలి బలిగ నీవేగ
శూరత్వమన నీవెరా
కామ్రేడ్ జోహరు లివిగోరా" అంటూ

ఒకరు పాట రాయగా

ఇంకొకరు
"కష్టజీవుల పల్లి
కడవెండి గ్రామములో
కొమురయ్య, మల్లయ్య
అన్నదమ్ముల వారు" అంటూ వారి

చరిత్ర నంత కైగట్టిండ్రు.

పోలీస్ యాక్షన్ తర్వాత ఊళ్ళకు దొరలు తరలి వచ్చి పంచుకున్న భూమిని గుంజుకున్నరు. నిజాం నవాబు 'రాజ్ ప్రముఖ్'గా మారిండు. దీన్ని నిరసిస్తూ

"పారిపోయిన దొరలు- ఊర్లు చేరారు
చేరి తమ వేషాలు చిత్రముగ మార్చె
చత్తారి టోపీలు షేర్వాన్లు విప్పి
ఖద్దరు గుడ్డల్ని కట్టిరన్నా
బుర్రకు టోపీని బురఖా తగిలించి
స్టేటు కాంగ్రేసు తమ
సంఘమనియంచు
గాంధి భక్తులమంచు- జైహిందటంచు
పిల్లి రొయ్యల దండ ధరియించినట్టు
దేశభక్తుల ముసుగులేశారు రన్నా
అన్యాయాన్ని విమర్శిస్తూ
"ఒరీ మూట ముల్లె నెత్తిన బెట్టుక
ఏ ఊరెళుతావు- ఏడ నువ్వుంటావు
ఎక్కడబోయిన ఇదే విప్లవం...
మూట ముల్లె కాలిపోతది
నైజామోడు నలిగిపోతాడు
మధ్యన నువ్వు మాడిపోతావురో
ఓ జౌహర్లాలుగా

(తెలంగాణ రైతాంగ పోరాట పాటలు: జయధీర్ తిరుమలరావు సేకరణ)

ఇదే సమయంలో ఖమ్మం జిల్లాకు చెందిన వట్టికొండ రామకోటయ్య అనేక పాటలు రాసిండు. వాటిని ఉద్యమ సమయంలోనే పుస్తకంగా తీసుకొచ్చిండు. ఆయన మనకొద్దీ పోలీసు రాజ్యం అంటూ ఇలా పాట రాసిండు.

మనకొద్దీ పోలీసు రాజ్యం
బాబు మనకొద్దీ పోలీసురాజ్య
మానవుల బంధించి
బానిసలుగజేసి
మానాలు హరియించుచుండ్రి
లేని పోనీనిందలు మోపుచుండ్రి
మనదు ప్రాణంబులను దీయుచుండ్రి
అయ్యో దానవుల తలదన్ను
మానవులు వీరండి ॥మనకొద్దీ॥

ఎండవానల కోర్చి
కండలు కరిగించి
బండచాకిరి జేస్తమండి
పంట పండించి తినబోతెనండి
మనకు ఉండదు ఒక పూట తిండి
అయ్యో మండుటాకలి చేత
ఎండి చావాలండి ॥మన॥

తరుగు బండినగాని
సరకారి ధాన్యంబు
భరణ జేయలంటరండి
ఎంతో సరుకు దాచినవారినండి
మాట వరుసకైన అడుగరండి
అయ్యో దొరకదు గింజంటె
కొరడాల గొడతారు ॥మన॥

కండ్లకు పొరవేసి
యిళ్ళలోపలదూరి
కొల్లగొట్టిరి ధాన్యమండి
ఆడ వాళ్ళను జెరబట్టిరండి
చంటి పిల్లలను జంపేసిరండి
అయ్యో పల్లెటూళ్ళన్నియు
వల్లకాళ్ళయినండి ॥మన॥

యూరపు ఖండాన
క్రూర నాజీమూక
నారీమణుల జెరచిరండి
ప్రజలు గోరిగట్టిరి వారినండి
ఇట్టి వారె నైజాం నాజీలండి
వహ్వ వీరులందరు గలసి
పోరాడెదము రండి ॥మన॥

తెలంగాణ కవులు ఉద్యమంలో భాగంగా 'తెలంగాణ తల్లి' భావనను కవిత్వంలో ప్రవేశ పెట్టిండ్రు. అదే ఆంధ్రా ప్రాంత కవులు ఆ పని చేయలేదు. ఎందుకంటే వారికి తెలంగాణ మాతృభూమి కాదు. దాశరథి తెలంగాణ తల్లి గీతం అందుకు ప్రసిద్ధి.

"తెలుగు తల్లి బిడ్డలం - తెలంగాణ వీరులం
మాతృదేశ ముక్తి కొరకు - పోరుసలుప కదిలినాం
తరతరాల నుండి మేము - సాగనంపదలచినాం
వెట్టిపనులు కట్టిపెట్టి - జబర్దస్తి నెగరగొట్టి
స్వేచ్ఛగాను బ్రతుకు కొరకు - ఐక్యమయ్యి నిలిచినాం" దళాలు

మార్చింగ్ సాంగ్‌ని ఆలపించాయి. అలాగే వయ్యా రాజారాం బానిస బతుకులను చిత్రికగట్టిండు.

దున్నపోతులకు క్షౌరం దుడ్డె బర్రెలకు క్షౌరం
మొలక క్షౌరం దొరలకు మొలక్షౌరం తలక్షౌరం

వ్యాసం

తలల కంటి పోయాలి తడయక
మునిమాపులో
దీపాలు వెలిగించి దిండ్లు పడకలు పరిచి
కాళ్ళు పిసికి మధ్య రాత్రి కదలాలి
తన యింటికి (రాజారాం)

వందల కొలదిగా కుండలు వరుసగా
చేసివ్వాలి
నిత్యం కావలసినన్ని నీళ్ళు చేది పెట్టాలి.-
వేడినీళ్ళు చేసి దొరల వాడుకలో
నుంచాలి
వచ్చిపోయే అధికార్లకు వంటలొండి
పెట్టాలి
(సుద్దాల హనుమంతు)
ఓరోరి నైజామోడా! ఓరోరి మిలిటిరోడా!
పొంగేల పోతివోరి! కుంగేది సత్యమోరి!
మాదు అక్క చెల్లెళ్ళను! నీచాతి
నీచముగాను
నిలబెట్టి చెరిచిరోరి నిక్కంబు చూడరోరి
సీత సూట వద్ద పన్నెండు మంది నీదు
ఫాసిస్టు మిలిటిరోళ్ళ పంపాము
నరకపురికి
పాపంబు పండెనోరి నైజాం మిలిటిరోడా!
(తెలకపల్లి యాదగిరి)

ఉద్యమ సమయంలో రహస్య జీవితం గడిపిన సుద్దాల హనుమంతు సూక్ష్మమైన విషయాలను కూడా పరిశీలించి సాహిత్యం లోకి పాటల ద్వారా తీసుకొచ్చిండు. తాను స్వయంగా సాయుధ పోరాటంలో తుపాకి చేతపట్టి మిలిటరీని ఎదుర్కొన్నడు కాబట్టే బలమైన పాటలు రాయగలిగిండు.

లేరా లేరా! రారా! వేగమే
రైతు కూలీ! రావూ రెడ్డి
కుర్మా గొల్లా కుమ్మర కమ్మర
చాకల మంగల హరిజన గిరిజన
నడవర ముందుకు నడుం బిగించి
కొడవలి కఠారి గొడ్డలి చిల్ల
బాకూ వడిశల బర్శి తుపాకి
చేకొని రణములో దూకర జైయని
నరకర ఎగబడి పొడవర తెగబడి
ఏటుకు ఇద్దరు, పోటుకు ముగ్గురు
(సుద్దాల హనుమంతు)
రగతమోడ్చి కష్టపడె రైతుకూలి
అన్నలార

**'పల్లెటూరి పిల్లగాడా పసుల గాసే మొనగాడా' లాంటి పాటలు 'మాభూమి' సినిమాతో ఇప్పటి తరానికి కూడా తెలియ వచ్చింది. బండి యాదగిరి పాట 'బండెన్క బండి కట్టి' ఇప్పటికీ అనేక వివాదాలకు మూలం.**

సందు దొరికే ముందు కురికి రండిరా
-అదిగో
ముండమోసె నిజాము పాలనమ్ము రా
పటేళ్ళు పట్టిగొట్టే పట్వార్లు పరుగుతీసె
దేశముఖులు దొరలు
మాయమాయెరా ఓహో
మాసకమ్మలై ప్రజలు వీడెరా
శిస్తుగట్టె చింతలేదు 'లెవీగల్ల' లేనేలేదు
శాయిరి చెరలన్ని మంటగలిసెరా
అదిగో
న్యాయమైన ప్రజల పాలనొచ్చెరా
రత్నగర్భమైన భూమి రైతుకూలి
చేతికొచ్చె
దున్ను వానిదేను భూమి సోదరా
(తిరునగరి రామాంజనేయులు)
దళాల యొక్క గుట్టు బయలు
దళాలయ్య దళాలు - మాయదారి
దళాలు
మాటు మాయదారి దళాలు -
మాయా దళాలు ॥ద॥
సేవసేవ యంటారు- ప్రజాసేవ
యంటారు
కూలి సేవ యంటారు -
కూడదీసుకుంటారు ॥ద॥
ఐక్యతైక్యతంటారు-ఆదరిస్తమంటారు
అందరొకటి యంటారు - అదో ఇదో
చెప్తారు ॥ద॥
మీదు కోసమంటారు - మాదుకష్ట
మంటారు
మాయలెన్నొ చెప్తారు - ప్రజల
మోసగిస్తారు ॥ద॥
అన్నమన్నమంటారు -గట్లల్లోకంటారు
తీసుకరమ్మంటారు తిప్పలెన్నో
పెడ్తారు
గ్రామాల్లో కొస్తారు - అన్నం
పెట్టమంటారు
పెట్టకుంటె ప్రజలాను - పెక్కు
బాధల్ పెడ్తారు
దెబ్బలెన్నో కొడ్తారు - తిట్లెన్నో
తిడ్తారు
బాధలెన్నొ పెడ్తారు -
చందలివ్వమంటారు
యివ్వకుంటె ప్రజలాను- ఆస్తి
దోపిడంటారు
గొడ్లతోలు కెళ్తారు - ఖూనీలు జేస్తారు
చంపగా మిగిలి నోర్ని - చందా
లివ్వమంటారు
ఇవ్వకుంటె మిమ్ములాను - అదే
చేస్తామంటారు
ఇట్లా లొంగకుంటేను - ఇండ్లు
కూలదోస్తారు
పెళ్ళమనిపిస్తారు- అడవి పాలౌతారు
వారి రక్షణాకు వారు - ప్రజలకేమో
చెప్తారు
ప్రజల మోసగిస్తారు-రక్షణిస్తమంటారు
మోసగాండ్ర నమ్మవద్దు - అశాంతి
లేపవద్దు
శాంతిని కాపాడవలయు - శత్రుల
దునుమాడవలయు
పట్టి బంధించవలయు- అల్లరుల
నణచవలయు
హాయిని చేకూర్చ వలయు -
స్వతంత్రత మనుభవించవలయు
– కోదాటి లక్ష్మీనరసింహారావు

ఇప్పటికీ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కవిత్వం/పాటలు సమగ్రం సంపుటిగా వెలువడలేదు. అక్కడక్కడా శకలాలుగా పరిశోధనలో వెలుగులోకి వచ్చిన పాటలు కొన్ని పుస్తకాల్లో చోటు చేసుకున్నప్పటికీ అవి సమగ్రం కాదు. అందువల్ల తెలంగాణ సాహిత్య అకాడెమీ లాంటి సంస్థలు పూనుకొని వీటిని ఒక్కదగ్గరికి తీసుకు రావాల్సిన అవసర మున్నది. అకాడెమీ ఈ పనిచేసిన ట్లయితేనే భావజాలాలతో సంబంధం లేకుండా అటు కమ్యూనిస్టులు, ఇటు కాంగ్రెస్ వారి రచనలూ ఒక్క దగ్గరికి వచ్చే అవకాశమున్నది.

**(జూలై 4 తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి 75 వసంతాలు నిండిన సందర్భంగా ...)**

## 2004 నోబెల్ బహుమతి గ్రహీత

# జెలినెక్

సాహిత్యంలో 2004 నోబెల్ బహుమతి ఆస్ట్రియన్‌కు చెందిన ఎల్ఫ్రీడ్ జెలినెక్ (Elfriede Jelinek) సృజన శక్తికి లభించింది. అక్టోబర్ 20, 1946లో జన్మించిన జెలినెక్ నవల, నాటక నిర్మాణంలో సిద్ధహస్తులు. సంగీత స్వరాల పోహాలింపు ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. సంగీతం, నవల, నాటకం సృజనలో ఆమె కనబరిచిన ప్రతిభకు ఆమెని ఈ అవార్డ్ వరించింది. సమాజంలోని అసంబద్ధతపైన, అణచి వేత పైన దాడి చేయడమే ఆమె సృజనలోని మౌలిక లక్షణం. జెలినిక్ రేడియో నాటకాలు, కవితా సంకలనాలు, నవలలు, అనువాదాలు, స్క్రీన్ ప్లే, బ్యాలె లాంటి ఎన్నో ప్రక్రియలు సృజించారు. ఆమె జెండర్ సంబంధమైన రచనలు కొన్నిసార్లు వివాదస్పదం అయ్యాయి. ఆమె సృజన పథాన్ని ఖండించిన వారు, అభినందించిన వారూ సాహితీ లోకంలో ఉన్నారు. ఎన్ని వివాదాలు ఉన్నా ఆమెను అనేక సాహితీ పురస్కారాలు వరించాయి. వాటిలో 1998లో జార్జ్ బుచ్నర్ అవార్డ్, 2002లో మరియు 2004లో మల్హీం డ్రామాటిస్ట్ అవార్డ్, 2004లో ఫ్రాంజ్ కాఫ్కా అవార్డు మరియు సాహిత్యంలో నోబెల్ బహుమతి అందుకొన్నారు. ఆమె నవల ది పియానో టీచర్ (The Piyano Teacher) చలనచిత్రంగా రూపొందింది. ఆస్ట్రియన్ దర్శకుడు మైఖేల్ హనెక్ (Michael Haneke) దర్శకత్వం వహించాడు. 2012లో ఆమె ఐన్ స్పోర్ట్ స్టాక్ అనే ఆంగ్ల భాషా ప్రిమియర్ ఆమెని ఆంగ్ల భాషీయులకు పరిచయం చేసింది. దీనితో ఆమె ప్రపంచ సాహిత్య పుటలలో స్థానం పొందింది. Die Kinder, Toten Greed, Lust మొదలైనవి ఆమె ప్రసిద్ధ రచనలు.










## 2003 జ్ఞానపీఠ అవార్డ్ గ్రహీత

# విందా కరండికర్

విందా కరండికర్ (vinda karandikar) మరాఠీ భాషలో సుప్రసిద్ధుడైన కవి.అయన రచన ద సెక్రేడ్ హెర్సే (The Sacred Heresy 1998) ఆంగ్లంలో లభిస్తుంది. ఆయన ముంబైలోని S.I.E.S. కాలేజీలో ఆంగ్లంలో ప్రొఫెసర్‌గా పని చేశారు. ఆయన షేక్స్పియర్ కింగ్ లియర్, అరిస్టాటిల్ పొయిటిక్స్, గోథే ఫావుస్ట్ మొదటి భాగాన్ని, మరాఠీలోకి అనువదించారు. గోవింద్ వినాయక కరండికర్ అని పూర్తి పేరు కలిగిన ఈ కవి విందాగా పిలువబడ్డారు. అయన పూర్తి స్థాయి కవితా సంకలనం సమగ్ర కవితగా మరాఠీ లో వెలువడింది. సామాన్య మానవుని జీవన రీతుల్ని అయన రచనలు ప్రతిఫలిస్తాయి. కరండికర్ రచనా విధానం ప్రజల గుండెలకు హత్తుకు పోయేలా ఉంటుందని సాహితీ వేత్తలు ప్రశంసించారు. అయన ప్రారంభంలో వీరసావర్కర్ ప్రభావంతో రచనలు చేశారు. తరువాత మార్క్సిస్ట్ భావజాల ప్రేరితంగా తన రచనలు కొనసాగించారు.

క
థ

# ఓ రోజు ఉదయాన్నే..!

**అమాయకపు ముసలి స్త్రీకి సహకరించిన స్కూల్ టీచర్...**



**నాంపల్లి సుజాత**

ఎదిరిచూస్తున్న బస్సు జీవితకాలమ్ లేటన్నట్టు. ఎందుకో ఎప్పుడూ నాకింతే..!

అర్ధగంట నుంచీ బస్సుకోసం కళ్ళల్లో వత్తులేసుకొని ఎదిరి చూస్తూనే ఉన్నా.. ఎంతకూ బస్సు జాడే లేదు... విశాలమైన కరీంనగర్ బస్ స్టాండ్ పొద్దుపొద్దున్నే రద్దీగా ఉంది..!

అన్నట్టు ఈ బస్సు కావాలనే రాదో.. నన్నుడుకించ డానికే రాదో కానీ ఎప్పుడూ ఎదిరిచూపులే. నాకక్కరలేని పక్క ప్లాట్ ఫామ్ బస్సులన్నీ ఠవ్వున్ గావచ్చి తీరిగ్గా నన్నే చూస్తున్నాయి. చూశావా మేమెంత మంచివాల్లమో అయినా మమ్మల్ని అస్సలు పట్టించుకుంటనే లెవ్వంటూ నాకేసి బుంగమూతి పెట్టాయి.

వాటికేం తెలుసు నా హడావుడి... నా ఆరాటం.. అరవై మైళ్ళుదాటి.. రెండు బస్సులు మారి తొమ్మిదిన్నర కల్లా బళ్లో ఉండాలన్న ముచ్చట. ఇప్పుడు నా కళ్ళముందు క్రమశిక్షణతో ప్రేయర్ చేస్తున్న మా పిల్లలే.. అమ్మో నేను సమయానికి వెళ్లాలి..

లేకుంటేనా.. నాకు మాత్రం బస్టాండ్ అంటే ఓ కదిలేప్రపంచం. ఓ మంచి పుస్తకాన్ని చదివినంత ఉల్లాసం అక్కడ

ఒక్కోవ్యక్తీ కదిలిపోయే ఓ అల, అదో కనబడని కడలి ఆ విభిన్న అలలని గమనించడం  ఆ వేగాన్నీ చదవడం ఎందుకో నాకైతే ఓ తీరని దాహం.

ఇప్పుడుమాత్రం నిప్పులమీద నిలబడ్డట్లే..

విసుగ్గా వాచీ చూసుకున్నా.. సరిగ్గా ఉదయం ఏడు గంటలా పది నిముషాలు..

అయ్ బాబోయ్..! ఈ ఐదు నిముషాల్లో గనక బస్సురాకుంటే.. అక్కడ నాకు టోపీ పడిపోయినట్లే హాఫ్ డే సెలవు వేసేస్తాడు మా యమ ధర్మరాజు.. నిర్దాక్షిణ్యంగా..!

పైగా బడిలో పరీక్షలు జరుగు తున్నాయి కూడా.. నేనే ఎగ్జామినేషన్ ఇంచార్జి. నిన్న రాఖీ పండగనీ ఇక్కడ అన్న వాళ్ళింటి కొచ్చాను గానీ లేకుంటే..

నా వెహికల్ నాదే నా సమయం నాదే.. నా ఊరు నాదే.. నా నిబ్బరం నాదే..! సర్వీస్ లో

ఒక్కరోజన్నా లేట్ గా వెళ్ళని నా రికార్డ్ నాదే..

హమ్మయ్య! దూరం నుంచి డిపో

పొడి పొడి అక్షరాలని పైన ఓ మూలన మోస్తూ మెరిపిస్తూ.. మురిపిస్తూ ఓ రాజహంస నాకేసే ఊరిస్తూ వస్తోంది..!

ఎన్నాళ్ల నుంచో వేచిచూసే ఓ ఆత్మీయ మిత్రున్ని కలుస్తున్నంత ఆనందం. నన్ను తన రెక్కలగుర్రం మీద ఎక్కించుకు పోయేందుకు వచ్చే రాకుమారుడిలాగే..ఈ బస్సిప్పుడు

అప్పటిదాకా నిశ్చలంగా ఉన్న జనం

ఒక్కసారే ప్రవాహం లా బస్సులోకి దూసుకుపోవడం.. వెంటవెంటనే..!

దాంట్లో నేనూ కూడా నలిగి మలిగి దూరాలి కదా.. దూరాను కూడా, అది మా ఉపాధ్యాయ ఉద్యోగులకు అలవాటే.!

ఎలాగైతే ఏం మొదటి సీటులోని కిటికీ మిత్రున్ని గెలుచుకున్నాను. ఇంకేం నాలోకి నేను ప్రవహిస్తూ వచ్చిపోయే దృశ్యాలని ఆస్వాదించొచ్చనే ఎక్కడలేని ఆశ.!

ప్రయాణమంటే నాకందుకే మహా ఇష్టం. కావాలనే దూరం బడిని ఎంచుకొన్నా.. నంటే మీరు నమ్మరేమో..!

**ఆమె ఎక్కడ పడిపోతుందో నన్నట్లున్న ఆ బక్కదేహం, చింపిరిజుట్టు మురికితో, ముడుతలు పడ్డ ఆమె అద్దాలు ఊడిన దుస్తులు. అందరూ ఆమెని అదోరకం మోసగత్తెలా చవకబారుగా చూస్తున్నారు.. అరే..! నడుమ దించితే.. గుట్టలు.. చెట్లు ఎక్కడ ఆగమవుతుందో పాపం..! ఎవ్వరూ ఆమె అవస్థని కించిత్తన్నా.. పట్టించుకోడం లేదు.. అందరికీ లేట్ అయిపోతుందని ఒకటే  ఆలోచన అంతే..వేరే ఇవ్వమ్మా.. తొందరగా అంటూ.. గొణుగుతున్నారు.. అప్పటికే పుణ్యకాలం గట్టెక్కినట్లున్నది..**

కథ

సుదూరాలకు వెళ్లే ఉపాధ్యాయులూ విద్యార్థుల సంఖ్యే ఎక్కువుంది. సమయానికి కార్యాలయాలకి చేరుకోవాలనే ఆతురత, ఆందోళనా అందరి ముఖాన కొట్టొచ్చినట్టు..! నా పక్కనున్న ఈవిడ కూడా టీచరేనేమో.. హ్యాండ్ బాగ్ ని కాళ్ళమీద పాదుముకొని ఫోన్లోకి దూరింది.. ఇంత రద్దీలో ఎవరినీ పట్టించుకోకుండా.. తనపనిలో తానే.. నిమగ్నమయ్యింది. ఇంట్లో ఒక్క నిముషమన్నా తనకోసం వెచ్చించు కో తీరనట్టుంది ఇక్కడ రిలాక్స్ అవుతోంది.

రోజూ కాసేపన్నా

నాలోకి నేను ప్రయాణిస్తూ నేచర్ ని ఆస్వాదించొచ్చనే..!

అన్నట్టు.. బస్సునిండా పొద్దున్నే

సుదూరాలకు వెళ్లే ఉపాధ్యాయులూ విద్యార్థుల సంఖ్యే ఎక్కువుంది. సమయానికి కార్యాలయాలకి చేరుకోవాలనే ఆతురత, ఆందోళనా అందరి ముఖాన కొట్టొచ్చినట్టు..!

నా పక్కనున్న ఈవిడ కూడా టీచరేనేమో.. హ్యాండ్ బాగ్ ని కాళ్ళమీద పాదుముకొని ఫోన్లోకి దూరింది.. ఇంత రద్దీలో ఎవరినీ పట్టించుకోకుండా.. తనపనిలో తానే.. నిమగ్నమయ్యింది. ఇంట్లో ఒక్క నిముషమన్నా తనకోసం వెచ్చించు కోవడానికి తీరనట్టుంది ఇక్కడ రిలాక్స్ అవుతోంది. పాపం..!

ఇంటిపనీ,వంటపనీ, మొగుడూ,పిల్లలూ బాక్సులు..ఓహ్..! ఎన్నిపనులో ఆడవాళ్లకు పొద్దున్నే..! జాతరలో తప్పిపోయిన పిల్లోడు తిరిగి దొరికినంత ఆనందం ఆమె మోమున ఈ సెళ్ళును చదువుతూ.!

అంతలో.. టిక్కెట్.. టిక్కెట్.. అంటూ లేడీకండక్టర్ అందరినీ అదిరిస్తూ బెదిరిస్తూ జనాలని వెనక్కి జరుపుతూ జింకపిల్లలా.. టకటకా దూసుకొచ్చేస్తుంది.. ఆమె ధాటికి అందరూ టిక్కెట్టుకు సరిపడా డబ్బులు పట్టుకొని.. బడిలో హెూంవర్క్ చూపించే పిల్లల్లా బుద్ధిగా ఎదిరి చూస్తున్నారు. తనని ఇబ్బంది పెట్టడం ఎందుకా  అని నేను కూడా హుస్నాబాద్ టిక్కెట్కు సరిపడా చిల్లర వెతికి వెతికి ఆమె కిచ్చాను.టికెట్ నా చేతిలో పెట్టి కాస్త నవ్వుమొహం పెట్టింది.చిల్లరపైసలని కూడా వెతికిచ్చినందుకేనేమో..!

పెద్దనోట్లు ఆమెకి పొద్దున్నే.. పడగవిప్పిన నాగుపాముల్లా కనిపిస్తున్నట్లున్నయి.. చిల్లర ఇవ్వ లేక, వాళ్ళని.. విసుక్కుంటూ.. టిక్కెట్ వెనకాల.. డ్యూ రాస్తోంది.. అంతా గమనిస్తున్న నాకే..అమ్మో! కండక్టర్ పని తిప్పలే సుమా..! ఆర్డినరీ, పల్లె వెలుగు ల్లోనైతే మరీనూ..!

“అవ్వా.! టిక్కెట్.. టిక్కెట్..! తొందరగా తీయ్..! “పైసలు తీసిపట్టుకోరు..ఏంత సేపటికీ ఏం చేస్తర్రో.. ఏమో మళ్ళా బస్సు లేటయ్యిందని మా మీదికే.. ఎగురుతరు..!? తీరికగా ఇళ్లనుకుంట రేమో.. అంటూ

పక్క సీటుకు ఒరిగి నిలుచున్న ఓ ముసలవ్వ మీద అరుస్తుంది..!

నిజమే ఇంత కిక్కిరిసిన బస్సులో టిక్కెట్లివ్వడం సాహసమే..! ఇప్పుడీమే పద్మవ్యూహాన్ని విజయవంతంగా ఛేదింస్తోంది.

ఆ అవ్వ గాబరా పడుతూ చేసంచి లోంచి రెండువేల నోటు తీసి కండక్టర్ చేతికిచ్చింది.. నోటుని అటూ ఇటూ తిప్పి తేరిపారా చూసి విసుగ్గా..” ఇది నకిలీ నోటు.. చెల్లదు.. వేరేదివ్వు “అంటూ హుంకరిస్తోంది..”



అయ్యో.. ఎందుకు. నడువది అమ్మా.. ఏమయింది దానికీ అంటూ లంగాలో చెక్కిన సంచీ మళ్ళాతీసి, ఇంకోటి అలాంటిదే రెండువేల నోటే తనకి ఇచ్చింది...దాన్నీ..ఆమె మళ్ళా పరిశీలించి గట్టిగా గొంతుపెంచి కొట్టినంత పనిచేస్తూ." అరే..!ఏందవ్వా..!

ఎక్కంచి తెచ్చినవ్..! ఎవలిచ్చిన్రు..!? అవ్వి నకిలీ నోట్లు..! మంచిగనే ఉన్నది పొద్దుపొద్దుగాల్నే యవారమ్..!" వేరే తే..! వేరేటివి ఇయ్యి తల్లీ..!

లేకుంటే బస్ దిగు.."అన్నా..! బస్సాపు.."

అంటూ టక్కున బస్సును..ఒక్కటి చరిచింది విజిల్ తో పాటూ..

బస్సు.. వెంటనే ఆగిపోయింది.. "దిగవ్వ.. దిగు..దిగు ఇగ సూడుండ్రుల్లో.. ముసలవ్వ.. నన్నే మోసం చెత్తన్ది.." చెకింగ్ వత్తె మమ్ముల పట్టుకుంటరు.

అరే..! ముసలవ్వ పైసలసంచీలో అవ్వి తప్పా. ఇంకేమీ లెవ్వు.. సారూ గీ పైసలు చెళ్ళయట జెర సూడుండ్రి..అంటూ దీనంగా ఏడుపు మొఖంతో బతిలాడుతోంది అందరినీ నిజమే.. అవ్వి నకిలీ నోట్లేనని తేల్చేశారు.. చూసినోళ్లంతా..

ఆమె ఎక్కడ పడిపోతుందో నన్నట్లున్న ఆ బక్కదేహం, చింపిరిజుట్టు మురికితో,

**ఒక్కోవ్యక్తీ కదిలిపోయే ఓ అల, అదో కనబడని కడలి ఆ విభిన్న అలలని గమనించడం ఆ వేగాన్నీ చదవడం ఎందుకో నాకైతే ఓ తీరని దాహం. ఇప్పుడుమాత్రం నిప్పులమీద నిలబడ్డట్లే.. విసుగ్గా వాచీ చూసుకున్నా.. సరిగ్గా ఉదయం ఏడు గంటలా పది నిముషాలు.. అయ్ బాబోయ్..! ఈ ఐదు నిముషాల్లో గనక బస్సురాకుంటే.. అక్కడ నాకు టోపీ పడిపోయినట్లే హాఫ్ డే సెలవు వేసేస్తాడు మా యమ ధర్మరాజు.. నిర్దాక్షిణ్యంగా..!**

ముడుతలు పడ్డ ఆమె అద్దాలు ఊడిన దుస్తులు. అందరూ ఆమెని అదోరకం మోసగత్తెలా చవకబారుగా చూస్తున్నారు.. అరే..! నడుమ దించితే.. గుట్టలు.. చెట్లు ఎక్కడ ఆగమవుతుందో పాపం..! ఎవ్వరూ ఆమె అవస్థని కించిత్తన్నా..

పట్టించుకోడం లేదు.. అందరికీ లేట్ అయిపోతుందని ఒకటే ఆలోచన అంతే..వేరే ఇవ్వమ్మా.. తొందరగా అంటూ.. గొణుగుతున్నారు.. అప్పటికే పుణ్యకాలం గట్టెక్కినట్లున్నది.. అర్ధగంట లేటు.

"మేడం,ఆమెకు టిక్కెట్ ఇవ్వండి. ఆ డబ్బులు నేనిస్తా గానీ" అంటూ ఇంతకీ

"అవ్వా..! ఆనోట్లు నీకెవరిచ్చిన్రు?"

"నువ్వెటువెళ్తావ్..!"ఒక్కదానివే వస్తున్నవా..! మెల్ల మెల్లగా ఆరాతీశాను ఊరడిస్తూ

హా..! బిడ్డా..! బంగ్ల పని కాడికి ఇటుక మొయ్య పోత.. నిన్నరాత్రి.. మేస్త్రీ వచ్చి ఇచ్చిపోయిండు. వాల్లు నన్ను మోసం జేశిండ్రు.. నాకేమెరుక.. ఇప్పుడు మావూరు గుబ్బడి కి పోతన్న.. మా ఆడిబిడ్డ సచ్చిపోయిందట. ఆగమాగం పోతన్న.

"నాకు సదువు రాక పాయే.. అన్ని ఒక్కతీరుగనే కనిపిచ్చినయ్.." ఇగేమ్ జేత్తుల్లో.. నాలుగువేలు.. ఏన్నుంచి తేను..వాని దినాలు గానూ" తిడుతూ ఏడుస్తానే ఉంది.

అవ్వా..!వాళ్ళ

"ఫోన్ నంబర్ ఉందా..! నేనడుగుతా..!"

లేదు బిడ్డా..! మల్ల పోయినంక పెద్దమనిషిని తోలుకపోయి అడుగుతా.. దొంగ గాడిది కొడుకుని..! అంటూ కన్నీళ్ల పర్యంతం ఆ అవ్వ.

అయినా అన్నీ ఈ నడుమ రంగు రంగుల నోట్లే కదా! నెలకో కొత్తనోటు పుట్టి బయటికి రావట్టే.. ఎప్పుడు ఏది రద్దు చేస్తరో ఎప్పుడు ఏది కొనసాగిస్తరో తెల్వకపాయే... నకిలీనోట్లే వో.. అసిలీ నోట్లేవో ఒక్కోక్కసారి చదువుకున్న మనమే.. గుర్తించలేకపోతన్నం. ఇరవై

**అంతలో.. టిక్కెట్.. టిక్కెట్.. అంటూ లేడీ కండక్టర్ అందరినీ అదిరిస్తూ బెదిరిస్తూ జనాలని వెనక్కి జరుపుతూ జింకపిల్లలా.. టకటకా దూసుకొచ్చేస్తుంది.. ఆమె ధాటికి అందరూ టిక్కెట్టుకు సరిపడా డబ్బులు పట్టుకొని.. బడిలో హెూంవర్క్ చూపించే పిల్లల్లా బుద్ధిగా ఎదిరి చూస్తున్నారు. తనని ఇబ్బంది పెట్టడం ఎందుకా అని నేను కూడా హుస్నాబాద్ టిక్కెట్ కు సరిపడా చిల్లర వెతికి వెతికి ఆమె కిచ్చాను. టికెట్ నా చేతిలో పెట్టి కాస్తా నవ్వు మొహం పెట్టింది.**

నోటూ రెండు వందల నోటూ ఒక్కతీరుగనే.. తీరొక్క రంగులూ, తీరొక్క రూపులూనాయే.. ఉండే. చిన్నది పెద్దగా, పెద్దది చిన్నగా ఉండవట్టే.. పది రూపాయల నోటే పది తీర్లుండే..! ఒక్కరూపాయి, రెండురూపాయల బిల్లా ఒక్కతీరేనాయే.. దానిమీద అంకెలు చదివితే తప్పా గుర్తించలేం..! పావు మంది ఇంకా చదువు లెనోళ్లేనాయే.. మనదగ్గర వాళ్లననేదేముందిలే..! కండ్లు సరిగ్గా కనబడని

చాతగాని, చదువు లేని ముసలవ్వ ఈమె..!

ఇక బస్సు ఊరూరికీ ఆక్కుంటూ.. ఆక్కుంటూ హుస్నాబాద్ బస్ స్టాండ్ దాకా అయితే వచ్చింది గానీ, నాకెందుకో ఆమెను అలా వదిలి రావాలని పించలేదు. ఆ చెల్లని నోట్లు తప్పా ఒక్కపైసా ఆమెదగ్గర లేనట్లున్నాయ్.!

తనకు కాస్తా ఆసరా ఇచ్చి వాళ్ల ఊరి ఆటోలో కూర్చోబెట్టి ఓ వందా చేతిలో పెట్టి.. జాగ్రత్తవ్వా అంటూ వెనక్కుతిరిగా.. నేనెక్కాల్సిన సిద్దిపేట బస్సు మాత్రం వెళ్లిపోయ్యింది.. నా సగం పూట సెలవు పోయినా.. ఆ దీనంగా దుక్కిస్తున్న కళ్ళల్లో కాసేపు ఓదార్పు రేఖలు నింపినందుకు ఎప్పటికీ తరగిపోని సంతృప్తి నా వెంట తీసుకెళుతున్నా.!

# 3 ఇడియట్స్

**చిత్రం : 3 ఇడియట్స్**
**దర్శకుడు : రాజ్‌కుమార్ హిరాణి**
**భాష : హిందీ**

'తూ కర్మ్ కర్తే జా ఫల్‌కి చింతామత్ కర్' అని మనం మన గీతలో చదివాం. '3 ఇడియట్స్' చిత్రంతో రాజ్‌కుమార్ ఈ వ్యాక్యాన్ని రుజువు చేసారు. సంతోషకరంగా అలరిస్తూ మనకి ఎన్నో ముఖ్యమైన జీవిత సందేశాలను ఇస్తుంది ఈ చిత్రం. ఒక ఐఐటి కాలేజ్ స్టూడెంట్ జీవితం చుట్టు తిరిగే ఈ చిత్రం విమర్శనాత్మకంగా ఆమోదించబడినది. ఈ చిత్రం అమీర్‌ఖాన్ యొక్క అతి ఉత్తమ ప్రదర్శనల్లో ఒకటిగా నిలిచింది.

ఇద్దరు మిత్రులు ఫర్హాన్ మరియు రాజు తమ తప్పిపోయిన ప్రాణమిత్రుడు రాంచోను కనిపెట్టడానికి గతంలో కాలేజ్‌లో చదివిన చతుర్ రామలింగంతో కలిసి వెళ్తారు. చతుర్ వారికి 10 ఏళ్ళ క్రితం కాలేజీలో ఉన్నప్పుడు వారు పెట్టుకున్న పందెం గురించి గుర్తు చేస్తాడు. దారిలో వారందరూ వారి కాలేజి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారు. జీవితాన్ని మనస్ఫూర్తిగా ప్రేమించే రాంచో, రాజు మరియు ఫర్హాన్‌లను స్వీయ వాస్తవికతను సాధించడంలో ఎంతో సహాయం చేస్తాడు. ఫర్హాన్ ఎన్నో ఏళ్ళ నుండి ఫోటోగ్రాఫర్ అవ్వాలనుకుంటాడు కాని అతను మధ్యతరగతి వ్యక్తి అవ్వడంతో అతని తల్లిదండ్రులు అతను ఇంజనీర్ కావాలని కోరుకుంటారు. రాంచో ఫర్హాన్‌కి తన ఇష్టాలను అంగీకరించి వాటిని సాధించడానికి సహాయం చేస్తాడు. రాజు దిగువ తరగతి వాడు. ఎంత ప్రయత్నించినా మంచి మార్కులు సాధించలేకపోతాడు. రాంచో అతనికి నువ్వు విజయవంతం కాకపోవడానికి కారణం విజయవంతం కాలేననే భయమేనని చెప్తాడు. తనలోని భయాన్ని తొలగిస్తాడు. విజయం వెనక పరిగెత్తే వారికే విజయం లభిస్తుందని నమ్మేవారి ఆలోచనలను కాలేజీ ప్రిన్సిపాల్ మారుస్తాడు. దారిలో రాజు, ఫర్హాన్, రాంచో గురించి ఎన్నో నిజాలను తెలుసుకుంటారు. రాంచోకు కాలేజీలో ప్రేమికురాలైన ప్రియాను తీసుకొని రాంచో దగ్గరకు వెళ్తారు. రాంచో ఒక పెద్ద విద్యాసంస్థకి అధ్యక్షుడు. పిల్లలకి ఏగ్జామ్స్ కోసం కాకుండా శిక్షణ ఇచ్చే వినూత్న విద్యాసంస్థ అది. చివరికి చతుర్ పందెం ఓడిపోతాడు.

చిత్రానికి పాటలు విజయంలో తోడుగా నిలిచాయి. చిత్రంలో చూపించే సన్నివేశాలను మనం నిజజీవితాల్లో ఎక్కడో అక్కడ మనకు జరిగినవే. ఇవన్నీ చిత్రాన్ని ప్రేక్షకుల మనసులకు దగ్గర చేసి సినిమా స్థాయిని ఎంతో పెంచింది.



# కమనీయ కవితా సంకలనం వాసంత సమీరాలు



గీతారాణి అవధానుల

అద్భుత భావ పరిమళ సుమహారం.. అనుపమాన పదబంధ మణిహారం.. అసామాన్య శిల్ప చతురతా సమాహారం.. తరచి చూసిన కొలదీ కానవచ్చే గాంభీర్యం.. మదిదోచు తెలంగాణా మట్టి సుగంధం.. వెరసి.. శ్రీమతి వకుళవాసు గారి కలం నుంచి జాలువారిన వాసంత సమీరాలు.

పుస్తకం ముందుమాటలో అంపశయ్య నవీన్ ఉటంకించినట్లు.. భావ కవిత్వానికి ఊపిరులూదిన కవితా సంకలనం... "వాసంత సమీరాలు". చక్కని, చిక్కని దాదాపు 90 కవితలతో, అందమైన ముఖ చిత్రంతో కొలువు తీరిన పుస్తకం.

ఆసాంతం ఆసక్తికరంగా సాగిన వకుళ కలం ఏ కవితకు ఆ కవిత ప్రత్యేకతను సంతరించుకుని పాఠకుల మది దోచుట ఖాయం. 'నా మానస సమీరం..' అంటూ తన కవితా ప్రస్థానాన్ని విన్నవించిన తీరు శ్లాఘనీయం.

ఇక తన కవితా లోకంలోకి వెళ్తే..

"నా భావాలను చూపులతో ఆవిరి చేశాను.. కమ్ముకున్న మేఘాలు అక్షర జల్లులుగా కురిశాయి నా దోసిలిలో.."

అంటూ తన ప్రారంభ కవితలోనే తన మానసాన్ని ఆవిష్కరింప జేశారు. 'నా మావ' కవితలో..

'ఎన్నట్ల పూసిన సుక్కలన్నీ ఏరుకొచ్చి పున్నమి సీరకు అతుక వెట్టినట్టుంటది నా మావ అందం..' అంటూ తన మావ పైన ప్రేమను గుమ్మరించారు.

'ఎన్కట దగ్గరోళ్ళ పెండ్లంటే పదిరోజుల ముందే పయనమ య్యేటోళ్ళం.. నాన్న నౌకరి కాబట్టి ఇడిషిపెట్టి పొయ్యేటోడు మమ్మల్ని...'




అంటూ 'దీవెనార్తెలు' కవితలో దగ్గర వారి పెండ్లి ముచ్చట్లలో అచ్చమైన తెలంగాణా యాస స్వచ్ఛతను గుబాళింపజేసారు.

నాన్న కవితలో 'ఎర్రటెండను తను ఇవిడిచ్చుకుంట... ప్రేమ ఉయ్యాలలో ఊపే సల్లని గాలై... సచ్చేదాక ఇచ్చే గుణమున్న ఏపచెట్టోలె బతుకుతడు నాన్న..'

అంటూ తన తండ్రిపై ప్రేమను చాటారు. మరో కవిత 'యాదికొస్తవ్ నాన్న'లో

"కడసారి చూపు చూషి పోవా బిడ్డా" అని

నువ్వు నాతో అన్న చివరి మాటలు..

నన్ను మెలిపెడుతూనే ఉన్నయ్..

నాన్న యాదికొస్తూనే..' వంటి

పదాలతో హృదయాన్ని చెమరింప జేశారు.

'అరె ఏమైంది ఎందుకు ఈ సతాయింపు..' అని

'అలిగిన కలం'లో అక్షరాలను

బుజ్జగించినా..' శిలలుగా ఉన్న మమ్మల్ని
అపురూప శిల్పాలుగా మలిచారు..'
అంటూ 'గురువు' గొప్పదనాన్ని కీర్తించింది. 'బంగారం'లో నేటి ఆడపిల్లల అభద్రతా భావాన్ని తెలియజేసింది.

**ఆ**సాంతం ఆసక్తికరంగా సాగిన వకుళ కలం ఏ కవితకు ఆ కవిత ప్రత్యేకతను సంతరించుకుని పాఠకుల మది దోచుట ఖాయం. 'నా మానస సమీరం..' అంటూ తన కవితా ప్రస్థానాన్ని విన్నవించిన తీరు శ్లాఘనీయం.
ఇక తన కవితా లోకంలో కి వెళ్తే..
"నా భావాలను చూపులతో ఆవిరి చేశాను.. కమ్ముకున్న మేఘాలు అక్షర జల్లులుగా కురిశాయి నా దోసిలిలో.."

'బరువెక్కిన గుండెకు ఓదార్పు నిచ్చే..'
చీకటిని నేస్తం'గా చేసుకుంది.

'సూర్య కిరణశోభిత తేజోవిలాసినివై..
నా మానసకవనమందు విరాజిల్లు
కావ్యకన్యకవై..'అంటూ ఋతురాగాలను తన 'కావ్య కన్య'లో హృద్యంగా పెనవేసుకుంది.

'కొలిచిన వారికి కొంగు బంగారమై
వేడినవారికి జయాలనిచ్చే
మాయమ్మ భద్రకాళి వీరభద్రుని
కళ్యాణమాడి..
మురిసిపోవును ముద్దుల గుమ్మై'
అంటూ..

ఓరుగల్లు పట్టపురాణిగా 'మాయమ్మ భద్రకాళి'ని వర్ణించింది.

'ఇంటికి పెద్దదిక్కోలె ఇంటి పెద్దర్వాజ
ఎంత గాంభీర్యం పెద్దపులోలె..'
అంటూ.. 'పెద్దర్వాజ' రాజసాన్ని పొగిడింది.

'ఎంత హుందాగుండేదో
మా బండి చుట్టూ పరదాలు కట్టి
మెత్తని పరుపు పరిచిపైన కందితడక
కప్పుతో పటాటోపం ఉట్టిపడేది..'
అంటూ..

'సవారి కచ్చడం'లో ఎడ్లబండి హొయలను ఒలకబోసింది.

'వడివడిగా పరుగులిడుతూ ధర్మపురి
మంత్రకూట అగ్రహార భూములను
సస్యశ్యామల మొనరించి..' అంటూ..
గోదారమ్మ తల్లి ప్రస్థానాన్ని 'జలామృతం'గా చిందింపజేసినా...

'ఎలాంటి కుట్టుడూ లేకుండా
ఆరుగజాల అందాల చీరకట్టులో
అందానికే అందంగా నిన్ను నిలబెట్టేదే నీ
చీర..' అంటూ.. ఆరుగజాల చీరను తన 'ఆత్మీయ నేస్తం'గా మలచుకున్నా...

వకుళవాసు గారి కలానికే చెల్లింది.

చివరగా.. ఆద్యంతం పాఠకులను మైమరపింపజేసే కమనీయ కవితా సంకలనం వాసంత సమీరాలు. ఇలాంటి మరెన్నో హృద్యమైన కవితలతో వకుళ వాసు గారు సాహితీ ప్రస్థానాన్ని కొన సాగిస్తారని మనసారా ఆకాంక్షిస్తున్నాను.


## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునిక్ కోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

ముఖాముఖి

# ప్రజల నాలుకల మీదికెక్కిన కవిత్వం మాది

**నాటి తెలంగాణ ఉద్యమ ఆర్తిని వివరించిన జి. యాదగిరితో ముఖాముఖి...**



డాక్టర్ వెల్దండి శ్రీధర్

1969 ప్రత్యేక తెలంగాణ తొలిదశ ఉద్యమ కాలంలో వెలువడిన తొలి కవితా సంపుటి 'జై తెలంగాణా విప్లవఢంకా' దీనిని రచించిన కవులు ఆనాటికి పూప దశలో ఉన్న జి. యాదగిరి, కె. రుక్నుద్దీన్. ఇది రూపంలో చిన్నదే అయినా చూపిన ప్రభావం చాలా గొప్పది. జి. యాదగిరితో జరిపిన వీడియో ఇంటర్వ్యూకు అక్షర రూపం.

**ప్రత్యేక తెలంగాణ ఉద్యమం జోరుగా జరుగుతోన్న రోజుల్లోనే మీరు కవిత్వం రాశారు కదా! అలా ఎందుకు రాయాలనిపించింది?**

కళ్లముందర ఎన్నో వాస్తవాలున్నాయి. సాగునీరు విషయంలోగాని, తాగునీరు విషయంలో గాని, ఉద్యోగాల విషయంలో గాని, ఎంతో మంది పెద్ద పెద్ద చదువులు చదువుకున్న వారు కూడా నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రతి చిన్న ఊళ్లో కూడా ఆంధ్ర వాళ్లున్నారు. స్కూళ్ల నుండి మొదలుపెట్టి సెక్రటేరియట్ వరకు కూడా తమ ఉద్యోగులను నియమించుకున్నారు. 1969 ఉద్యమమైతే కేవలం నిరుద్యోగ సమస్యతోని ప్రజ్వలించిన ఉద్యమం. ఏ రాజకీయ నాయకుడుగాని చెన్నారెడ్డిగాని, మదన్ మోహన్ గాని, శ్రీధర్ రెడ్డి గాని, మల్లికార్జున్ గాని ఏవరైనా నిమిత్త మాత్రులే. ఆ జ్వాల, అసంతృప్తి ప్రజల్లో ఉంది. అయితే దీనిలో సింహభాగంలో లేదా ముఖ భాగంలో విద్యార్థులు రెండవ భాగంలో ఉద్యోగులు. రాజకీయ నాయకుల ప్రమేయం పెద్దగా లేదు. వీళ్లవెంట పరుగెత్తుకొని వచ్చినవాళ్లే. రేపేమన్నా పదవులు గిదవులు వస్తయని తప్ప. వాళ్ల ప్రమేయం పెద్దగా లేదు. ఉద్యోగాలివ్వడం (రాజకీయ) వెన్ను పోటు పొడవడం జరిగిన తరువాత ఉద్యమం చల్లబడిపోయింది.

**ఉద్యమం మాట అలా ఉంచితే ప్రధానంగా మీరు కవులుగా ఆ రోజు ఎందుకు రాయాలని అనుకున్నారు. ప్రధాన స్రవంతి కవులంతా ఉద్యమానికి వ్యతిరేకంగా లేదంటే సమైక్య వాదాన్ని ప్రచారం చేస్తూ రాసినటువంటి వాళ్లే కదా! అలాంటప్పుడు మీరు తెలంగాణ వాయిస్‌ను ఎందుకు వినిపించాలాని అనుకున్నారు? కవిత్వంలో?**

మీ ప్రశ్నలోనే ఉంది జవాబు. పెద్ద పెద్ద కవులు కూడా సమైక్య వాదులుగా ఉన్నారు. ఎందుకుండాలె. కవిత్వం మేమెందుకు రాయగూడదు? 'నా తెలంగాణ కోటి రతనాల వీణ. నా తెలంగాణ తల్లి కంజాత వల్లి. ప్రాణములొడ్డి ఘోర గహనాటములను పడగొట్టి, మంచి మాగాణములను సృజించి..' లాంటి అద్భుతమైన పద్యాలు రాసినటువంటి దాశరథి లాంటి వారు ఆఖరికి పదవులకు సన్మానాలకు ఆశపడి, సి. నారాయణరెడ్డి లాంటి కవి కూడా ఎవ్వరూ అసలు పేరు ప్రఖ్యాతులున్న వారెవ్వరూ ముందుకు రాకపోవడం, అందులో మా మాస్టారు, మాకు ఆత్మీయ గురువు ముకురాల రామారెడ్డిగారు రాసిన కవిత్వంతో మేము స్ఫూర్తి పొంది, ప్రతి దగ్గర కవిత్వం ఎవ్వరూ రాయక పోవడం వల్ల ఎక్కడా సభ రక్తి కట్టడం లేదు. కవిత్వంతో సభ రక్తి కడుతుంది అని చెప్పి నేను నా మిత్రుడు రుక్నుద్దీన్ వరుసగా వేదికల మీద చదవడానికి రాశాం. ఆఖరిని మా గురువుగారు శ్రీరంగాచారి గారు ఇవన్నీ కలిపి ఒక పుస్తకం వేస్తే బాగుంటుంది గదా అన్నాడు. పుస్తకం వేయడానికి అప్పుడు చాలా కష్టంగా ఉండేది. మేమే అనేకమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం. ఒక మిత్రుడ్ని పైసలు అడిగి కిసాన్ ప్రెస్ (హైదరాబాద్) లో పుస్తకం ప్రింట్ వేసి మా ఉద్యోగాలు దొరికిన తరువాత అతని బాకీ తీర్చుకున్నాం.

**ఉద్యమంలో మీ పాత్ర ఎలా వుండేది అప్పుడు? జైలుకు ఎప్పుడైనా వెళ్లారా?**

ఆ... జైలుకు వెళ్లాం. నా మీద కాల్పులు కూడా జరిగాయి. కల్వకుర్తి మేజిస్ట్రేట్ కోర్టు ముందు లాఠీ చార్జీ కూడా జరిగింది. దానికి సంబంధించి నా మెడ మీద సిస్టు ఇప్పటికీ ఉంది. దాని తరువాత మేలో పరీక్ష తప్పకుండా

ముఖాముఖి

జరపాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంటే కల్వకుర్తిలో ఒకే ఒక్క స్టూడెంట్ తోని పరీక్ష రాయించడం జరిగింది. అతడు మేజిస్ట్రేట్ కొడుకు. కల్వకుర్తిలో మేమందరం రాళ్లు తీసుకొని పోలీసుల మీదికి విసురుతున్నప్పుడు జాఫర్ అని నా మిత్రుడు నేను ముందరి భాగంలో ఉన్నాం. చూసి చూసి రాళ్లు పడుతుంటే ఆ పిలగాడు భయపడి కేకలు పెడుతూ పెన్ను అవన్నీ విసిరేసి అస్త్ర సన్యాసం చేసి కూర్చున్నాడు లోపల. ఆఖరికి మా మీద ఫైర్ అని అనడంతో జాఫర్ మీద నా మీద కాల్పులు జరిగినవి. మమ్మల్ని దూసుకుపోయినయి తూటాలు. ఊళ్లోకి పరిగెత్తినాము. అప్పుడు తెలంగాణ పోలీసులు ఇక్కడోల్లయితే కొంత పక్షపాత దృష్టి ఉంటదని కర్నాటక పోలీసులను పిలిపించారు. కల్వకుర్తిలో ఆ కర్నాటక పోలీసులు ఒక భీభత్సాన్ని సృష్టించారు. కిలో మీటరు దూరం జనాన్ని తరిమి తరిమి కొట్టారు. సక్సెస్ అయ్యాం. ఆ ఒక్కనితోని కూడా మేము పరీక్ష రాయనియ్యలేదు. కాల్పులు జరిగాయి. నా మీద జాఫర్ మీద.

**అరెస్టయ్యారా? ఎప్పుడైనా? జైలుకు వెళ్లారా? జైల్లో ఎలాంటి అనుభవాలు...?**

అరెస్టు జరిగింది. జైలుకు వెళ్లాం. ఒక వన్ మంత్ మేజిస్ట్రేట్ మాకు ఇంప్రిజన్ మెంట్ ఇచ్చాడు. మహబూబ్ నగర్‌లో గర్ల్స్ జూనియర్ కళాశాల మాకు జైలు. 60, 70 మంది పిల్లలుండేవారు. అల్లరల్లరి. ఒక లారీ నిండా ఎక్కారు. పెద్ద గొడవ గొడవ. పోలీసోళ్లను ఖత్మల్ అని పిలవడం. అంత నిర్భయత్వం. కొంత అప్పటి నుంచి పిల్లల్లోపట ఒక అరాచకత్వం కూడా ఏర్పడిందని నేననుకుంటున్నాను. పరీక్షల్లో అంతా విపరీతమైన మాస్ కాపీయింగ్. అన్నీ కారణమై ఉండవచ్చు. పంతులు వాళ్లు కూడా భయపడాల తప్పకుండా. ఆ సందర్భంలో ఎక్కడెక్కడయితే తెలంగాణలో ఉన్న టీచర్లు, ఆంధ్ర ఉద్యోగులను రేపటివరకల్లా కనబడగూడదంటే వాళ్లు అంతా మూటలు ముల్లెలు సర్దుకొని రైళ్లల్లో పడి ఆఖరుకు పైన కూడా ఎక్కి వెళ్లిపోయారు. అట్లా కొన్ని వందలు వేల ఖాళీలైనయి. వాటిలో ఈ ఉద్యోగులు కుదురుకున్న తరువాత, చెన్నారెడ్డి వాళ్లు వెన్నుపోటు పొడిచిన తరువాత ఉద్యమం చల్లబడింది.

**మీరు రాసినటువంటి కవితలు అప్పటి ప్రధాన పత్రికల్లో అచ్చు అయ్యేటివా? కాకపోతే ఎందుకు కాలేదు?**

పత్రికలన్నీ ఆంధ్ర వాళ్లకు అనుకూలంగా ఉన్నాయి. పత్రికా రంగం సాహసించి ఆ పని చేయలేక పోయింది.



> **కళ్లముందర ఎన్నో వాస్తవాలున్నాయి. సాగునీరు విషయంలోగాని, తాగునీరు విషయంలో గాని, ఉద్యోగాల విషయంలో గాని, ఎంతో మంది పెద్ద పెద్ద చదువులు చదువుకున్న వారు కూడా నిరుద్యోగులు గా ఉన్నారు. ప్రతి చిన్న ఊళ్లో కూడా ఆంధ్ర వాళ్లున్నారు. స్కూళ్ల నుండి మొదలుపెట్టి సెక్రటేరియట్ వరకు కూడా తమ ఉద్యోగులను నియమించుకున్నారు. 1969 ఉద్యమమైతే కేవలం నిరుద్యోగ సమస్యతోని ప్రజ్వలించిన ఉద్యమం.**

అందునుంచి మొట్టమొదలు మేం కరపత్రాల రూపంలో పంచిన పత్రికలనే రంగాచారి అనే మా లెక్చరర్ సలహాతోని ఒక పుస్తకం వేస్తే బాగుంటుందని చెప్పేసి మొదలు యాభై పైసలు పెట్టాం. అంతగూడా ఎవడు కొనలేడనే ఉద్దేశంతో దీన్ని ముప్పయి అయిదు పైసలు చేశాం. అయితే దానికి సంబంధించి ఒక్కపైసా కూడా మా చేతికి రాలేదు. లారీలల్లో పోతున్న పిల్లలందరూ అన్నా ఇక్కడికి తీసుకురాండ్రి అని అన్నీ తీసుకున్నారు. ఆఖరుకు ఒకటి రెండు కాపీలు కూడా మా దగ్గర లేవు. ద్వితీయ ముద్రణకు మేం వెతుక్కోవాల్సి వచ్చింది.

**అప్పటి సాహిత్య వాతావరణం ఎలా వుండేది?**

సాహిత్య వాతావరణం తెలంగాణకు అనుకూలంగా ఉండి దాన్ని సాహిత్య పరంగా రికార్డు చేద్దాం అన్న వారు ఎవ్వరూ లేరు. అందునుంచే తెలంగాణ ఉద్యమంలో మేము రాసిన 'జై తెలంగాణ విప్లవఢంకా' మొట్టమొదటి పుస్తకం అయింది. దీన్ని సంగిశెట్టి శ్రీనివాస్, డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి (తెలంగాణ చరిత్ర సంశోధకులు వాళ్లు). పరిశోధన చేసి ఇదే మొదటి పుస్తకం అన్నారు. మేమే మొదటి కవులం ఆరోజు తెలంగాణ ఆకాంక్షపరంగా.

ముఖాముఖి

**పేరుమోసిన కవులంతా సమైక్యవాదాన్ని ప్రచారం చేశారని అన్నారు కదా! ఎందుకట్లా జరిగింది?**

నారాయణరెడ్డిగారికి సినిమా రంగంతో అనుబంధం ఉంది. సినిమా రంగమంతా ఆంధ్రావాళ్ల చేతిలో ఉంది. సన్మానాలు, వగైరా అందాలంటే, డబ్బు, దస్కం అన్నీ అందాలంటే దాంట్లో ఉండాల్సిందే. తరువాత దాశరథి ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగా ఉండేవారు. అవన్నింటినీ దృష్టిలో ఉంచుకొని అందరం కలిసుంటేనే బాగుంటుందని కవితలు రాశారు. అప్పుడు మొత్తం కవుల్లో, ఉద్యోగస్తుల్లో నిర్భయంగా కవితలు రాసింది ముకురాల రామారెడ్డిగారొక్కరే.

**మీ కవితల్ని ఇతర కవుల కవితలతో పోల్చుకునేవారా? అప్పుడు ఎట్లా ఫీలయ్యేవారు.**

పోల్చుకోవడానికి అవతలోడు రాస్తేగదా! రాసేటోడే లేడు. మాదే మొట్ట మొదటిది 'జై తెలంగాణ విప్లవఢంకా' అయితే తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సిలర్‌గా పనిచేసిన ఎన్వీ సత్య నారాయణ గారి 'విప్లవశంఖం' రెండవది. దాని తరువాత ఇంక కొంత మంది కవులది మూడవది ఏదో వచ్చింది. పోల్చుకోవడానికి అవకాశమే లేదు. అంతే.

"నా తెలంగాణ కోటి రత్నాల వీణ
అనెనునాడు మహాకవి ఆర్తితోడ
కాల మహిమేమొ చిత్రంబు! కాని
నేడు
మూగవోయెర! ఆ వీణ మూర్ఖులైన
మంత్రివర్యుల నీచ కుతంత్రములకు
లెమ్ము సోదర! వీణ సారించి పాడ
రమ్ము! తెలగాణ జనుల నేకమ్ము
జేయ"

ఆయనదే వాక్యం తీసుకొని రాశాం. ఆయనను మేమేం దూషించలేదు. అన్నడానాడు. ఈనాడు అనలేదనే అర్థం వచ్చేటట్టున్నది.

**విరసం లాంటి సంస్థలు, సృజన లాంటి పత్రికలు తొలిదశలో మద్దతు ఇవ్వలేదా? ఇవ్వకపోతే ఎందుకు ఇవ్వలేదు?**



1967లో ద్వైమాసిక పత్రిక కింద ప్రారంభింపబడింది. విప్లవ భావాలతోని విరసంతోని సంబంధం లేదు దానికి. వరవరరావుగారే వరంగల్‌లో కొంత మంది సాహితీ మిత్రులతో కలిసి వేశారు. ఆయన జడ్చర్లలో లెక్చరర్‌గా ఉన్నప్పుడు వచ్చింది ఆ పత్రిక. అప్పటి నుంచి నేను దానికి చందాదారుడ్నే. దాని తరువాత 1970 జులైలో విరసం ఆవిర్భావం. విరసం ఆవిర్భావం తరువాత అప్పుడు అది విరసం కిందికి వెళ్లిపోయింది. అంతవరకు దానికేమి సంబంధం లేదు. అంత వరకు వరవరరావుగాని వారు వీరుగాని ఒక్క చిన్న వాక్యం కూడా ఉద్యమం మీద రాయలేదు.

**మరి అట్లాంటప్పుడు మీరు తరువాత కాలంలో అయినా కూడా విరసంతో కలిసి ఎట్లా పని చేయగలిగారు?**

విరసానికి వీరాభిమానినే కాని నేను విరసం సభ్యుడిని కాదు. కాకపోతే ఉద్యమమంటే అభిమానం. ఉద్యమంలో పాల్గొన్నాను. ఉద్యమం ద్వారా ఏమేం జరగాల్నో అన్నీ జరిగినయి. కష్టాలు, నష్టాలు అన్నీ జరిగినయి. అయినా ఆ ఉద్యమం తప్ప ప్రపంచానికి వేరు మార్గం లేదని నిశ్చితంగా ఇప్పటికీ నమ్మేవాడ్ని. అందుకే నేను వరవరరావు కవిత్వం మీద పిహెచ్. డి చేస్తున్నాను.

**పత్రికలన్నీ ఆంధ్ర వాళ్లకు అనుకూలంగా ఉన్నాయి. పత్రికా రంగం సాహసించి ఆ పని చేయలేక పోయింది. అందునుంచి మొట్టమొదలు మేం కరపత్రాల రూపంలో పంచిన పత్రికలనే రంగాచారి అనే మా లెక్చరర్ సలహాతోని ఒక పుస్తకం వేస్తే బాగుంటుందని చెప్పేసి మొదలు యాభై పైసలు పెట్టాం. అంతగూడా ఎవడు కొనలేడనే ఉద్దేశంతో దీన్ని ముప్పయి అయిదు పైసలు చేశాం.**

**విరసం నుండి దూరం జరిగిన తరువాతనే మీరు పుస్తకాలు చాలా ప్రచురించినట్లు కనిపిస్తోంది. దానికి కారణం ఏమంటారు?**

కారణాలు ఏమీ లేవు. కుటుంబ భారమే. అదీగాక ఉద్యోగం చిన్నది. అయితే ఇప్పుడు నాకు ఏదైతే పురస్కారం (2017లో తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం లభించింది) వచ్చిందో అది నేను 67లో చదువుకునేటప్పుడు రాసిందానికి వచ్చిందే. తరువాత మారిన దృక్పథంతోని ఛందస్సు మీద దాని మీద విప్లవ కవితలు ఇవన్నీ రాయడం వలన దాని మీద కొంత నిర్లక్ష్యంతోని దాన్ని నేను ప్రింట్ చేయలేదు. 40 ఏళ్ల తరువాత ఒక మిత్రుడు అది తప్పకుండా ఆ పుస్తకం వెలికి రావాలి సార్ అన్నప్పుడు అప్పటికి నా దగ్గర స్క్రిప్టు కూడా లేదు. సందేహం ఏంటంటే నేనే రాసిన్నా లేదా అని సందేహం వచ్చేటట్టు అయింది. చదువుకుంటున్నప్పుడు మిత్రుడు గిరిజా మనోహర్ బాబు ధారణ చేసిన పద్యాలు మొత్తం పుస్తకం రాసి పంపించాడు. ఆయన ధారణ శక్తితోని, ఇంకో మిత్రుడు

ముఖాముఖి

చేసిన ఆర్థిక సహాయంతోని ఆ పుస్తకం ప్రింట్ అయింది.

**మీ మీద ఉద్యమ ప్రభావం ఎలా ఉంది?**

అప్పటి నుండి కూడా తెలంగాణ అస్తిత్వం కోసమే పోరాడుతున్నాం. క్షణ క్షణం ఏది రాసినా ఆఖరికి ముకురాల రామారెడ్డి పుస్తకం రాసినా, మార్చాల రామాచార్యులనేటటు వంటి అద్భుతమైన తెలంగాణ తొలితరం చిత్రకారుడి గురించి రాసినా, ఆయన వేసిన అత్యంత ప్రాచుర్యం పొంది గోల్కొండ పత్రికలో వచ్చిన చిత్రం, దేశానికంతా తెలిసిన చిత్రం మీసాల కృష్ణుడు. సురవరం ప్రతాపరెడ్డికి మార్చాల రామాచార్యులు మిత్రుడు. ఆ వేసిన చిత్రం అట్లట్ల కనుమరుగైపోయింది. ఒకనాడు ఆంధ్రజ్యోతిలో ఆ చిత్రాన్ని వేసింది అడవి బాపిరాజు వేశారని గోపికృష్ణగారు ఒక వ్యాసం రాశారు. అది మన తెలంగాణ అస్తిత్వ పోరాటంలో విపరీతమైన రౌద్రంతో ఉన్న రోజులు. మళ్లా అంతా వెదికి బోలెడంతా కష్టపడి ఆయన తెలంగాణ వాడేనని నిరూపిస్తూ ఒక వ్యాసం, పుస్తకం కూడా వెలువరించాల్సి వచ్చింది. తెలంగాణలో ఇంత గొప్ప మహాకవి ఉన్నడని ముకురాల రామారెడ్డిని, తెలంగాణలో వెనుకటికే ఒక గొప్ప చిత్రాకారుడున్నడని, ఆ కాలంలోనే ఒకరు డైరీ రాశారని నారాయణను, తెలంగాణ వీరవనితలు ప్రపంచంలోనే ఎవరికి సాటిలేని విధంగా రాచరికంతో పోరాడారని సమ్మక్క సారలక్కల గురించి పుస్తకాలు వేశాను. దీనికంతటికీ నేపథ్యంగా పని చేసింది తెలంగాణ.




**జై తెలంగాణ విప్లవఢంకా పుస్తకం ఇతర కవుల మీద ఎలా ప్రభావితం చేసింది? ఆ కాలంలో గానీ ఇప్పటికి గానీ?**

కవుల మీద ప్రభావం చూయించింది తక్కువ. ప్రజా బాహుళ్యం మీదనే ఎక్కువ. మేం సమావేశాల్లో, వేదికల మీద చదువుతున్నప్పుడు అంతులేని చప్పట్లతో మాకు ఆహ్వానం పలుకుతూ మాకు ప్రోత్సాహం ఇచ్చారు. ప్రజల నాలుకల మీదికి చేరింది. కాకపోతే అది పాటల వాతావరణం కాదు. నెక్స్ట్ దాంట్లో అన్నీ పాటలే. మేకలు కాసుకునే వాడు కూడా అద్భుతమైన పాటలు రాసిండు. మేము తెలుగు కాలేజీలో చదవడంతోని కవిత్వం అట్లా పద్య రూపంలో రాశాము. మొట్టమొదటి పద్యాలు మావే తెలంగాణ ఉద్యమంపైనా. మా రుక్నుద్దీన్ గేయాలు రాసిండు కానీ పద్యం దగ్గరికి రాలే.

**ఇప్పుడు ఒక బీసీ కులం నుంచి వచ్చిన మీరు రాష్ట్రం రాకముందు ఎట్లా ఫీలయ్యారు. రాష్ట్ర కల సాకారం అయిన తరువాత ఎట్లా ఫీలవుతున్నారు?**

రాష్ట్రం రాకముందు సామాన్యంగా నేను విడిచిపెట్టిన సమావేశాలు తక్కువనే. ప్రజలందరిలో అసంతృప్తి ఉంది. అందరు వస్తున్నారు కానీ తప్పకుండా సర్వసేనానీ అయితే ఒకరు కావాల్సిందే. కేసీఆర్ గారు లేకపోతే మాత్రం అది సాధ్యమయ్యే పని మాత్రం కాదు. ఆయనకు కోదండరాం లాంటి మేధావులు తోడైంద్రు కాబట్టి ప్రజల హృదయాల నుంచి వచ్చిన ఆవేశంతోని అందరు బజారున పడ్డరు. తెగిపోయింద్రు. ప్రతి ఒక్కరు ఏమైనాగానీ మమ్మల్ని జైల్లో వెయ్యండ్రా మొదలు అనే స్థాయికి చేరుకున్నారు. తరువాత ఈ సందర్భంలో సోనియాగాంధీని కూడా మనం స్మరించాల్సిందే. ఈమెను గురించి హరగోపాల్ గారు ఒక మాటన్నారు. ఆమె రోమన్ కేథలిక్. వారికి మతపరంగా చాలా అనుబంధాలు, గట్టి సంబంధాలు ఉంటవి. వీళ్లందరూ దిగ్విజయ్‌సింగ్ వాళ్లంతా ఆంధ్రా ఏరియాలో ఇలా ఉంది ఎట్లా ఏం చేద్దాం అని అడిగినపుడు, అది కాదండి మాట ఇచ్చాం కదా! అని మాట మీద నిలబడడం కోసం పార్టీ ధ్వంసం అవుతుందని తెలిసి కూడా (ఆ మహానుభావురాలు ఆమె మాటకు తిరుగులేదు కనుక) తెలంగాణ ఇచ్చింది. ఆమెకు ధన్యవాదాలు తెలపాల్సిందే.

**ఇప్పుడు సాహిత్య రంగంలో, సామాజిక రంగంలో జరగాల్సిందేమిటి? దానిలో కవులు, రచయితల పాత్ర ఎట్లా ఉండాలని అనుకుంటున్నారు?**

నేను రాసేటప్పటికీ దాశరథి, సినారె రాసేటప్పటికి కవిత్వంలో చాలా మార్పులు వచ్చాయి. స్త్రీవాద కవిత్వం, దళిత కవిత్వం, ముస్లిం మైనార్టీ కవిత్వమని ఈ కవిత్వాలు అనేక రకాలు పుట్టుకొచ్చాయి. దేని మీదో దాని మీద ప్రభావం చూపే కథ అయితే పోయింది. ఎవరి దారి వారు చూసుకొని వెళ్లిపోతున్నారు. ప్రజా కవిత్వం అద్భుతమైన కవిత్వం జనం నోళ్ల నుంచి వచ్చింది. దాని మీద మీలాంటి వారంతా పరిశోధనలు చేస్తున్నారు. చాలా సంతోషం. మేం పెద్దవాళ్లమైనా మీకు రుణపడి ఉన్నాం.

కథ

# జడలో జాజులు

మల్లెపూల అలంకారంతో ప్రేమ విలువ తెలిపిన భర్త...



పిన్నంశెట్టి కిషన్

పువ్వులు-పువ్వుల్లో మల్లెలు అంటే మహా మోజు. కాదు, ప్రాణం కిశోర్ కి. . చిన్నప్పుడు, భద్రయ్య బళ్లో చదివేప్పుడు పువ్వుల ప్రేమ మొగ్గతొడిగింది. సత్యరాజం సార్ బడి తోటలో పువ్వులు తెంపుతుంటే తదేకంగా గమనిస్తూ అనుకరించే వాడు. ఓ రోజు అలా చూస్తున్న కిశోర్ తో, "నువ్వు తెంపచ్చు కదరా? అలా చూస్తూ నిలబడే బదులు!" అన్నాడు సత్యరాజం సారు. అది మొదలు, పెద్ద బడికి వచ్చేవరకు పువ్వులసారే లోకం. చిన్ని చిన్ని లేలేత వేళ్ళతో, ఎక్కడ మొక్క నొచ్చుకుంటుందోనని సుతి మెత్తగా తుంచేవాడు. ముందు, మొక్కలతో మాట కలిపి అనుమతి అడిగేవాడు. తలలూపుతూ చిరుగాలులు ఊది, అంగీకారం తెలిపేవి. తెంపుతూ ఉంటే వాడి వేళ్ళు ఎక్కడ కంది పోతాయేమోనని, తమంతట తాముగా పువ్వుల్ని రాల్చుకునేవి కొన్ని మొక్కలు. "పువ్వులన్నీ అమ్మవారికి పంపిస్తా"రని సార్ చెప్పితే, తానే అమ్మ వారిని అలంకరించినంత ఆనందించేవాడు.

పెద్ద బడికి వచ్చినంక, పువ్వులతో ఊసులు లేక పెరట్లో మల్లె పాదులు నాటాడు. తీగమల్లి, జాజిమల్లి, బొండుమల్లి, మల్లీ... మల్లీ... మల్లె మొక్కలు రకరకాలవి నాటి మనసు పారేసుకున్నాడు. అవి ఎదుగుతుంటే పసిపాపల్లా ప్రాణం పెట్టుకునేవాడు. ఎవర్ని ముట్టనీయకుండా పొద్దుగూకిందంటే వాటి చెంత చేరి తానే తుంచే వాడు. అడిగిన ఆడపిల్లలందరికీ కాదనకుండా పంచేవాడు. అమ్మతో దండ అల్లించి అమ్మవారికి పటానికి రోజూ వేయించేవాడు. ఎండాకాలం ఎగిరి పోయేవరకు మల్లెపందిరి కిందే మంచం. తిండి - తిప్పలు అక్కడే. చలానికి కూడా మల్లెల పిచ్చి అని 'మ్యూజింగ్స్' చదివి, తనది పిచ్చి కాదని సంబర పడిపోయాడు. అలా మొదలైన ప్రేమ, వయసుతోపాటు పెరిగి మల్లెతీగలా పందిరి సాగింది.

మల్లెలు వయసుతో పోరు పెడుతుంటే పెళ్లి చేసుకున్నాడు. భార్యను చూసినవాళ్లంతా "పొడుగు జడని చూసి పెళ్లి చేసుకున్నావా!?" అని ఆశ్చర్యానుమానంతో అడిగేవాళ్లు. తను, జడ పొడుగునా మల్లెలు తురుముకుంటే నడిచే జాజితీగలా తోచేది తనకు. ఏడు రాత్రులు- మల్లెల పొదరిల్లు శోభనపు గది. పక్కలో మల్లెలు ఎక్కడ నలిగి పోతాయోయని పక్కకు సర్దేవాడు. జడ లోని మల్లెదండను తీసి పక్కన పెట్టేవాడు. ఆయన చేతలకి, చేష్టలకి, కొంత ఆశ్చర్యపోయినా మల్లెపువ్వంటి మనసున్న మొగుడు దొరికిండని ఆనందించేది.

సెలవులు అయిపోగానే భార్యను తీసుకొని కాపురం కోసం పట్నం వచ్చాడు కిశోర్.

* * *

ఉద్యోగం చేసే కార్యాలయం ఊరి మధ్యలో ఉంటుంది. నివాసం ఎపుడూ ఆఫీసుకి నడక దూరంలో ఉండాలనే స్థిర అభిప్రాయం కలవాడు. దానివల్ల, సిటీ బస్సుల్లో పడి నలిగే అవస్థ తప్పుతుంది! ఆలస్యంగా ఆఫీసుకి చేరడం... ఇంటికి రావడం... బాస్, బాసిణిలచే తిట్లు తినడం ఉండదు! పైగా ముఖ్యమైంది, దారి ఖర్చులు మిగలడం! ఇంటి కిరాయి ఎక్కువైనా ఇన్ని వెసులుబాట్లు ఉండడం వలన, ఆఫీసుకు దగ్గరలో ఇల్లు కావాలనుకున్నాడు. కానీ... జీతం మొత్తం ఇచ్చినా, జీవితం మొత్తం రాసిచ్చినా సరిపోనంత అద్దెలు. అందుబాటు అద్దె కోసం, మూడు కిలోమీటర్ల దూరం వెళ్ళాడు. పనిలో పనిగా మల్లెలున్న ఇల్లు మదిలో నాటుకుని ఆశగా వెతికినా... వాడిన మల్లెల్లా అడియాసే అయ్యింది. ఇండిపెండెంట్ ఇళ్లలో తప్ప, కిరాయిల కోసం కట్టే వాటిలో 'కంత' అంత నేలయినా కనిపించదు%ా% ఇక మొక్కలకు చోటెక్కడ !? రాంనగర్ మల్లయ్య కాంప్లెక్స్ లో ప్రస్తుత మకాం.

వరుసగా రెండు రోజుల సెలవుల తరువాత ఆఫీసుకు వెళ్లడం అంటేనే కొత్త కోడలు అత్తగారింటికి వెళ్లినంత బాధగా

ఉంటుంది. సుదీర్ఘమైన పెళ్లి సెలవుల తర్వాత, ఇంకా- కొత్తగా పెళ్లైన కాంతతో రోజంతా ఏకాంతంగా గడిపే అవకాశాన్ని కాలదన్నుకొని కాలు బయటపెట్టడమంటే మాటలా, మాటలకందని మనాది. నవ వధువును వదిలి వెళ్లాలంటే ఏడుపొక్కటే తక్కువ..

ఆఫీసుకు వెళ్ళిన కిషోర్ సాయంకాలం ఐదు ఎప్పుడవుతుందాని ఎదురు చూడటంలోనే గడిచి పోయింది. ఐదు అవడమే ఆలస్యం... గేటు బయట ఉన్నాడు. ముందే చూసి పెట్టుకున్న మల్లెల అమ్మి దుకాణకు నడిచి వెళ్లి, "రెండు మూరల మల్లెలు ఎంత?" అని ధర అడిగాడు. విని... మూర్ఛనలు పోయినంత పనయింది. 'అంత పెట్టి, కొనాలా! వద్దా!' అని అనుమానిస్తున్న కిషోర్ తో "ఎండాకాలం, ఎండల్లా మల్లెల ధరలు ఇలాగే మండుతా"యంది అమ్మి. కొనకపోతే కొన్నయినా... "కొన్నముఖమేనా!" అని కోపగించు కుంటుందో, చిన్నచూపు చూస్తుందో అని అనుమానిస్తూ... 'ఒక మూర ఇమ్మనాలను'కున్నడే గాని, జేబు లోని పైసలను మదిలోనే లెక్కించుకుని 'కూరగాయలకు తక్కువ పడతా'యని తలంచి, "వద్దం"టూ చిన్నబుచ్చుకున్న మనసుతో ముందుకు నడిచాడు.

రోజూ అంతే! వట్టి చేతుల సాయంకాలాలతో ఇంటికి వెళ్ళేవాడు. మల్లెలు పూయని రాత్రుల్లో మనసు ఉండబట్టలేక ఓ రోజు, "పట్నంలో మల్లెపువ్వులు దొరుకవా!?"ని తెలివిగా అడిగింది. 'మార్కెట్లో మల్లెల ధరలు ఎంత పిరమో చేసేది ప్రభుత్వ ఉద్యోగమైనా తన జీతానికి మల్లెలెంత దూరమో' వివరిస్తూ కవిత చదివాడు కిషోర్.

"పే స్కేల్
జీతం దుప్పటి
ఎంతగింజుకున్నాచాలదు -
అయితే తలో
లేకపోతే కాళ్ళో
బయటుండాల్సిందే -
అవసరాల దోమకాట్లు
భరించాల్సిందే."

ఏది అవసరమో తెలిసిన తను, మల్లెమొగ్గలా ముడుచుకు పోయింది. మొగుని జీవితంలో మల్లెలు ఎలా ముడివడి ఉండేవో గుర్తుకువచ్చి 'తానెంత కుమిలిపోతున్నాడో'నని... "లేకపోతే ఏం? మల్లెపువ్వంటి మొగుడుండగా" అని నవ్వుల్ని పూయించ తండ్లాడింది.

★ ★ ★

ఆ రోజు ఆఫీసు నుండి కిషోర్ వచ్చేసరికి, మెడలో మల్లెదండతో కనిపించింది భార్య.

ఆశ్చర్యపోతూ "ఎక్కడి!?"దని



**మల్లెలు వయసుతో పోరు పెడుతుంటే పెళ్లి చేసుకున్నాడు. భార్యను చూసినవాళ్లంతా "పొడుగు జడని చూసి పెళ్లి చేసుకున్నావా!?" అని ఆశ్చర్యానుమానంతో అడిగేవాళ్లు. తను, జడ పొడుగునా మల్లెలు తురుముకుంటే నడిచే జాజితీగలా తోచేది తనకు.**

అడిగాడు.

"గుడికి వెళ్తే అమ్మవారి ప్రసాదంగా పూజారి ఇచ్చా"డని చెప్పింది.

"అమ్మవారు ఇలా కనికరించిం"దా అంటూ "కళ్ళు మూసుకో"మన్నాడు భార్యను.

"చిన్నపిల్లలా ఇదేంటి!" అంటూనే కళ్ళు మూసుకున్న భార్య అరచేతిలో పొట్లాన్ని ఉంచాడు.

మోదుగు ఆకుల పొట్లంలోంచి 'జడలో తురుముకొమ్మని' తొంగి చూస్తున్న మల్లెమాల!

ఆశ్చర్యంతో... "డబుల్ ధమాకా" అంటూనే, నొచ్చుకుంటూ "పైస పైసకు ఇబ్బంది పడుతన్నరాయే కొనకపోతే ఏం!?" అంది.

"కానీ, ఎన్ని రోజులు ఇలా మల్లెల పరిమళాలు లేక మనసునపట్టదు. ఊపిరి ఆడదు. అని, మనసులో మదన పడుతుంటే ఆలోచన తట్టింది. కాసులకు సమాధానం కాళ్ళతో చెప్పాలనుకున్నాను... లంచాలు తీసుకుని ఆత్మను అమ్ముకోలేక, నడకను నమ్ముకున్నాను. బస్ పాస్ రెన్యువల్ చేసుకోలేదు. ఆ డబ్బులతో నీ కురుల్లో కరువుదీరా పువ్వులు పూయించాలనుకున్నాను" భార్యకు చెప్పాడు.

అడిగిన వాళ్ళకి, అడగని వాళ్ళకి, ఎన్ని పువ్వుల్ని ఆ చేతులతో ఇచ్చేవాడని! మూరెడు మల్లెల కోసం...మూడు మైళ్ళు! అవినీతికి అమ్ముడుపోక రోజూ నడిచి, వెళ్లి వస్తున్న మొగునికి తన మనసు మాలను మురిపెంగా అల్లి అర్పించుకుంది.

కవిత

# నర్స్ నీకు నమస్తే



సుంకర రమేశ్

నరుడి మొర ఆలకించి
దేవుడు పంపిన
దూత నర్స్
నెలవంక నవ్వినట్టు
చంద్రబింబం నడిచివచ్చినట్టు
నేలపై వెలిగే నక్షత్రం ఆమె
నీదే కులమని
నీదే ఊరని
నీ అంతస్తు ఏమిటని అడగదు
సలసలా కాగుతున్న
నీ దేహాన్ని జ్వరమానినితో
కొలుస్తుంది
ఇసుమంత నొప్పి తెల్వకుండా
ఇంజెక్షన్ ఇస్తుంది
రక్తమోడుతున్న నీ
శరీరంగాలకు వెన్నెలను రంగరించి
కట్టుకడుతుంది
అల్లాడే నీ ఊపిరి తీగకు
చేయూత నిస్తుంది
నీ రోగగ్రస్త దేహాన్ని
గోరు వెచ్చని నీటితో శుభ్రపరుస్తుంది
వ్రణాలు పడిన నీదేహాంగాలకు
దివ్య పరిమళాలను అద్దుతుంది
అందరి ప్రాణాల కోసం
తన ప్రాయాన్ని మంచు పల్లకిని చేస్తుంది
ఆమె నీగొప్ప స్నేహితులకన్న గొప్ప
అత్యంత ఆప్తులకన్నా అధికం
నిన్ను భుజానికెత్తుకొని ఆడించిన
మీ నాన్న కన్నా నాలుగు మెట్లు ఎక్కువ
చివరికి నిన్ను నవమాసాలు మోసిన
కన్న తల్లి కన్నా మిన్న
నీ ఆనందంలో ఆహ్లాద వీచిక తను
నీ శోకం లో విషాద గీతికా తనే
ఈ లోకానికి వచ్చే
నవజాత శిశువుకు
తొలిస్వాగతం చెప్పేది ఆమెనే
ఆఖరి పోరులో అలసిన
ప్రాణాలకు తుదివీడ్కోలు చెప్పేదీ ఆమెనే
జీవనానికి,నిస్తేజానికి మధ్య
నిలువెత్తు గీతలా ఆమె
నీరవ నిశ్శబ్ద కుడ్యాల నడుమ
కాళ్లకు చక్రాలు కట్టుకుని తిరుగుతుంది
ఆమె నిన్ను నన్ను ఏమి కోరదు
విలాస విల్లాలను
వేలికి వజ్రపు టుంగరాలను కోరదు
తెల్లని కోటు వెనక కనిపించని
కత్తిగాట్ల సలపరింపులున్నా
సహనంతో భరించే సాధ్వి
మాయరోగంతో నీవు
విల విలలాడుతున్నా
నీవారే ఆశలు వదులుకున్నా
చివరి పిలుపు దాకా నీ
పరిచర్యలు మానని మహిమాన్విత
జీవితం ,మృత్యువు
బింబ,ప్రతిబింబాల నడుమ
గస్తీకాసే ప్రియదూతిక
మృత్యుదేవత తెరిచే
రహస్య పేటిక చప్పుడు ఆమెకే వినిపించినా
లోపలి కల్లోల కెరటాలను కనపడనివ్వకుండా
నిన్ను సదా కాచుకునే ఉంటుంది
నీ సేవలిక చాలు
నాలోకానికి రా
ప్రియపుత్రికా అని
దేవదేవుడు అడిగితే
నేనులేని మనిషి కన్నీరును
మీరు తట్టుకోలేరు తండ్రి అని
కన్నీళ్ల తోనే వేడుకునే
ప్రియబాంధవి



# పెద్ద దర్వాజా



డా॥ ఉదారి నారాయణ

పిట్టరాని గూటిలో
పిల్లలు ఎంత నిరాధారమో
నాన్నలేని మా ఇల్లూ అంతే

మాగిపొద్దు నారుమడి లాంటి ఈ లోకాన్ని
తెలిమబ్బుల్లోంచి చూస్తున్నపుడు
అచానక్‌గా దూరమైంది
నాన్న చిటికెన వేలు
రేపటి పొద్దు మరింత మాగురైంది

నాన్న వెళ్ళిపోయిన్నంచే
అతడిలోని తండ్రి
నా పలవరింతలో జీవిస్తున్నాడు

సాగరంలో పట్టని సంసారభారాన్ని
దాచుకునే తడబాటులో
పెదాల తూమునుంచి
నాన్న చిరునవ్వు చిట్లిపొయ్యేది

ఎంత గొప్ప చేతులు నాన్నా నీవి!
దాకలిపై వేసే సుత్తి దెబ్బలకు
సున్నితమంతా కమిలిపోయి
నీ అరచేతులు నాగజెముడు పండ్లయ్యేవి
బతుకు బండి తీరం చేరడానికి
కొలిమి మంటల దగడుకు
చిట్టెం గట్టిన నీ ఛాతిని
పైని బానీను కింద దాచుకునే వాడివి

ఉగాది వచ్చిందంటే
కొత్త కమ్మరినితెస్తామన్న
దొరలగాండ్రింపులు
కొత్త నైవేద్యాన్ని గొంతులోనే
అటకాయించేవి
వాళ్లిచ్చే పరంపప్పు బొండజొండ్ల 'దానికి '
ఎదురు చూపుల దుప్పట్లు పరచీ పరిచీ
మొగురంకు అతుక్కుపోయేవాడివి

బతుకంతా బొగ్గుల్లోనే బూడిదై
కమిలిపోయి మాడిపోయి
అసలు రూపం మసక బారేది

పటేండ్ల గద్దింపు చూపులకు
నోట్లో బుక్క బెదిరి
కిందపడని దినం లేదు
కాళ్లకు అందని బొంత సైతం
నీ కష్టం ను చూసి కుమిలిపోయేది

దడ లేసి నా ఊపిరి ఎగదోస్తున్నపుడు
మోకాలు మంటి బురదలోంచి మోస్తూ
నన్ను డాక్టర్ ముందు దించిన
నీ కాయెక్కిన భుజాలు
నాకిప్పటికీ జీవిత పాఠాలే

పట్నంకెళ్లి కొడవళ్లు కార్లు అమ్మి తెచ్చిన
పలారం వాసన నా ముక్కు పుటాల్లో
ఇంకా దాక్కొనే వుంది

దినమంతా నీ దేహం లోంచి
ప్రవహించిన చెమటని
సాయంత్రం తత్వాలుగా పారించే వాడివి
ఒక్కొసారి ఎట్ల బతుకుతావురా అని
కోపగించినపుడు
కండ్లలో నీ మమకారమే తొంగిచూసేది
మాకోసం నువ్వు
వెన్ను పూసల్ని అరిగించుకొని
వెన్నుపూసల భవిష్యత్తు అందించావు

నాన్నా!
మా జీవిత నాటకానికి
కనిపించని గొప్ప దర్శకునివి నువ్వే
కనిపించే రియల్ హీరోవి నువ్వే.

వ్యాసం

# ప్రతాపరుద్రకోట

కాకతీయుల కోటలోని జీవన విధానం వివరించే వ్యాసం...



కపిలవాయి లింగమూర్తి

తెలంగాణలో ఒకపుడు కనకతార, జయంత, జయపాల అనే నాటకాలు ప్రసిద్ధంగా ఉండేవి. ఇవి ఏ కాలంనాటి కథలో తెలియదు కాని కాలగర్భంలో ఆనాటి రాజులు మరియు రాజ్యాలు కలిసిపోయి వారి కథలు మాత్రం మిగులుతుంటవి. పైరెండు కథలు ఒకపుడు ప్రతాపగిరసీమలోని పట్టభద్రుని కోటకు చెందినవేనని గత శతాబ్దం నాటి వరకు ఆనాటి వృద్ధులు చెప్పుకునేవారు.

ఇది నాగర్‌కర్నూల్‌జిల్లాలోని మున్ననూరుకు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ కోటగోడ పొడవు 120 మైళ్ళని శ్రీ సయ్యద్‌గౌస్ తహసీల్దార్ గారు చెప్పినారు. ఆ గోడ దాదాపు ఈ పీఠభూమి మొత్తము చుట్టుతుంది. దాని చివరలు కృష్ణానదిని కలుస్తాయి. దీనికి ప్రతాపగిరికోట, పటాభద్రకోట, పటాల భద్రత కోట, ప్రతాపరుద్రకోట అని వ్యవహారాలు. ప్రస్తుతం ఈ కోట ఉన్న కొండకు 'ప్రతాపగిరి' అనే పేరుండేదని రాయనిగండి శాసనం వల్ల తెలుస్తుంది. ఆ ప్రతాపగిరిపై ఉంది కాబట్టి దీన్ని మొదట ప్రతాపగిరికోట అన్నారు. ఈ పేరుతో ప్రస్తుతం నల్లగొండ జిల్లాలో గూడ ఒకటి ఉంది. దాన్నిపుడు సిరిసెనగండ్ల అంటున్నారు.

ఈ గిరిపై మొదట నివాసం పెట్టినవాడు ఎఱుకు దేవరాజు. అతని జన్మభూమి శ్రీశైలాటవి. ఇతడు సోమదేవరాజు కుమారుడైన మాధవవర్మ సమకాలికుడు. అతని కాలం వరకు అనుమకొండ (నేటి హనుమకొండ) అనే రాజ్యాన్ని పాలిస్తుండగా మాధవవర్మ పద్మాక్షిదేవిని గురించి తపస్సు చేసి ఆ దేవిచేత ఖడ్గంపొంది ఆ ప్రాంత ప్రజలను సమీకరించి ఒక సైన్యాన్నేర్పరచుకొని వారితో అనుమకొండపై దండెత్తి దాన్ని ఆక్రమించుకున్నాడు.

అపుడు దాన్ని పాలిస్తున్న ఎఱుక దేవరాజు మరి నా పరిస్థితి ఏమిటని అడిగినాడు. అతనికి అనుమడు, కొండడు గర్గళుడు (గర్గుడు) అనే ముగ్గురు కుమారులు ఉండేవారు. వారిలో అనుమడు, కొండడు అనే వారి పేరుతో ఏర్పడిందే అనుమకొండ. అపుడు ఎఱుకు దేవరాజు మొర విని మాధవవర్మ పెద్ద కొడుకులిద్దరిని తన సైన్యంలోకి తీసుకొని వారికి సేనాపతి పదవులిచ్చి గర్గనితో నీవు ప్రతాపగిరికి వెళ్లి ఆ ప్రాంతాన్ని రక్షించు. అది కూడ మా రాజ్యంలోనిదే. నాది గుంటూరుసీమలోని కందరపురం. మా తండ్రి సోమదేవరాజు. ఆయన శత్రువులతో యుద్ధంలో మరణించినాడు. నేను ఆయన కుమారుడను. మాకు పశు సంపద ఎక్కువ కాబట్టి మా గోవులన్నీ ప్రతాపగిరికొండపైగల అడవులలోనే ఉంటవి. అందువల్ల నీవక్కడికి వెళ్లి ఆ ప్రాంతాన్ని చూడు అన్నాడు. అపుడతడు ప్రతాపగిరి కొండకు వచ్చి దాన్ని కేంద్రంగా చేసుకొని ఆ పీఠభూమిలో మొదటి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించినాడు.

ఈ ఎఱుకు దేవరాజు విషయం మనకు కాసె సర్వప్పయొక్క సిద్దేశ్వర చరిత్ర పీఠికలో వస్తుంది. దాన్ని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు పరిష్కరించి నారు. దాని పీఠిక తెలుగులో శ్రీ గోలి ఈశ్వరయ్యగారి షష్టిపూర్తి సంచికలో ప్రచురింపబడింది.

ప్రతాపగిరి పీఠభూమికి ఆవిధంగా ఎఱుకు దేవరాజు వచ్చేనాటికి కేంద్రంలో శాతవాహనులున్నారు. ఆ వంశంలోని రెండవపులోమావి బలహీనుడు. అతని కాలం క్రీ.శ. 120-153. ఎపుడైనా కేంద్రం బలహీనంగా ఉంటే సామంతులు స్వతంత్రులు కావటం సహజం కనుక ఈ పులోమావి కాలంలో ఎఱుకు దేవరాజు ఎపుడో ఒక సమయం చూచి స్వతంత్రుడైనాడు. కాని అనంతరమెంత కాలం పాలించినాడో తెలియదు.

కేంద్రంలో శాతవాహనుల పిమ్మట ఇక్ష్వాకులు ప్రభువులైనారు. వారి కాలంనాటికి మున్ననూరు ప్రాంతంలో విష్ణుకుండినులనే ఒక పాటినాయక వంశం ఒకటుండేది. వారు ఇక్ష్వాకులకు విధేయులై ఉండేవారు. అందువల్ల

ఇక్ష్వాకులు ప్రభువులు కాగానే అమరావతి నుండి ఎఱుకు దేవరాజును ఉడిమళ్ల రాజ్యానికి పంపి దీనికి విష్ణుకుండినులను సామంతులుగా చేసినారు. అంత వరకక్కడ అమరాబాదు పెద్ద ఊరుగా లేదు. కాని విష్ణుకుండినులు మొదట మున్ననూరు ప్రాంతంలోనే ఉన్న ఆ పీఠభూమికంతా అమరాబాదు కేంద్ర స్థానంలో ఉందని దానిపై కన్నుపడి ఆ గ్రామాన్ని అభివృద్ధి చేసి తాము ఇంద్రశబ్ద పాద్యులు కనుక ఆ గ్రామానికి 'అమరావతి' అని పేరు పెట్టినారు.

అంతవరకు అక్కడ లోకేశ్వరం అనే ఒక జైనవసతి ఉండేది. కాని విష్ణుకుండినులు శ్రీశైలేశుని భక్తులు కనుక వీరి ముందు ఇంక వారు నిలువలేక పోయినారు.

అమరావతి అనే పేరు మొదటిసారిగా ఈ అమరాబాదుకే పెట్టబడింది. కృష్ణాతీరంలోని అమరావతికి మొదట ధాన్యకటకం, ధరణికోట అని పేర్లు. దాన్ని వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు తీసుకున్న తర్వాత అమరావతి అని పేరుపెట్టినాడు.

శ్రీ బి.యన్. శాస్త్రిగారి చరిత్ర ప్రకారం విష్ణుకుండిన వంశమూల పురుషుడు మహారాజేంద్రవర్మ. అతడు శాలంకాయన, పల్లవ, ఆనందగోత్రులు పరస్పరం కలహించుకుంటున్న సమయం చూసి అమరాబాదులో స్వతంత్రరాజ్యాన్ని స్థాపించినాడన్నాడు.

ఈ విష్ణుకుండినుల కంటె మొదట ఇక్ష్వాకులు రాజ్యానికి రాగానే ప్రతాపగిరి సీమను గూడ ఆక్రమించుకొని అక్కడి నుండి ఎఱుకు దేవరాజును ఉడిమిళ్ల రాజ్యానికి పంపిన తర్వాత తమ అధికారాన్ని పొందిన ఒక అధికారి పాలకునిగా నియమించారు. అతని పేరోమిటో తెలియదు. ప్రభుత్వాధికారాన్ని పొందినాడు కనుక ప్రజలతన్ని పట్టభద్రునిగా గుర్తించినారు. మొదటిసారిగా ఈ పట్టభద్రుడే ప్రతాపగిరిపై ఎఱుకు దేవరాజాక్రమించుకున్న చదరపు స్థలం చూసి అది కోటకు అనువుగా ఉందని అక్కడ ఈనాటి ప్రతాపరుద్రకోటకు ముగ్గు పోసినాడు. అక్కడ లభించే ఇటుకలను బట్టి పురాతత్వ శాస్త్రజ్ఞులవి ఇక్ష్వాకుల నాటివనే నిర్ణయించినారు.

విష్ణుకుండినుల జన్మస్థానాన్ని గురించి వాదవివాదాలున్నవి కాని శ్రీ బి.యన్. శాస్త్రిగారు వానినన్నిటిని త్రోసిరాజని వారి జన్మభూమి మున్ననూరు ప్రాంతమని



**ప్రతాపరుద్రకోట బాగా ఉన్ననాడు కోటలోపల ఒక గ్రామమే ఉన్నది. ఆ కోటపై రాచమల్లు వారనే కాపరులు రాత్రింబవళ్లు కాపలా ఉండేవారు. అందుకు వారికి శ్రీశైలాటవిలో కొంత పొలం ఒక బావి ఇనాముగా నున్నవి. దాన్ని రాచమళ్ల బావి అంటున్నారు. ఆక్కడ రాచమల్లు బావి ఇప్పటికి ఉంది. అది చక్కగా రాయి కట్టబడి ఉంది. ఆనాడు దాని ప్రాకారద్వారం ఈనాడు తలుపుల కురువ అంటున్నారు.**

నిర్ధారించినాడు. వారు తమను శ్రీ పర్వతస్వామి పాదానుధ్యాతులమని చెప్పు కున్నారు. శ్రీ పర్వతమనగా శ్రీశైలము. అంతేగాక నేటి నాగార్జున సాగరం దగ్గర విజయపురికి గూడ ఆ పేరుంది. అదే ఇక్ష్వాకుల రాజధాని గూడా అది అక్కడ ఒక పర్వతం పైననే ఉంది. దానికి కుందేళ్లబోడు అని ప్రజావ్యవహారం కాని అక్కడ నాగార్జునాచార్యుడనే గొప్ప బౌద్ధ ప్రవక్త నివసించి దానికి శ్రీపర్వతమని పేరు పెట్టినారు. కాబట్టి ఇది ఏది ఏమైనా విష్ణుకుండినుల జన్మస్థానం మాత్రమే మున్ననూరు ప్రాంతమే అవుతుంది. అయితే వారి ఇంటి పేరుకు కారణమైన విష్ణుకుండి ఎక్కడ ఉందో ఇంకా తేలలేదు.

ప్రతాపగిరి సీమ ప్రదేశంలో ఈనాటి తలుపుల కురువకు ముందు బ్రహ్మ గుండం ఒకే దిగుడు బావి ఉంది. అది బ్రహ్మకుండి, మున్ననూరులో మొదట 'కాలాపానీ' నల్లని నీరు ప్రసిద్ధి. అది మొదట ఒక హ్రదంగా ఉండేది. ఈనాడు బావిరూపాన్ని ధరించింది కాబట్టి శ్రీపర్వత పురాణం పండితారాధ్యచరిత్రలో పేర్కొనబడిన కాలహ్రదం ఇదేనని నేను నమ్ముతున్నాను. విష్ణువు నల్లనివాడు. ఈ 'కాలాపానీ' అనగా నల్లని నీళ్లగుండమే. విష్ణుకుండి కావటానికి అవకాశం ఉంది.

వ్యాసం

ఈనాడు కృష్ణలో ఇవతలి దరిలో యాత్రికులకు దానిని దాటడానికి జాతర రేవు, నీలగంగరేవు అని రెండు రేవులు ప్రసిద్ధంగా ఉండేవి. గోదావరి'కి తెలివాహ అని పేరున్నట్లు శ్రీ పి. పరబ్రహ్మశాస్త్రి గారు పేర్కొన్నారు. కనుక అది తెల్లని గంగ కాగా ఈ కృష్ణానది 'నీలగంగ' అయింది.

ఈ రేవు వెంట కొంత మేర నీరు నల్లగానే కనిపిస్తుందట. ఆనాటి పశు కాపరులు ఆక్కడక్కడ మడుగులను గురించి చిన్న చిన్న ప్రవాహాలను గురించి చెప్పుతుండేవారు. ఇదంతా నల్లమల ప్రాంతం. కనుక ఆ యొక్క భూమి గుణాన్ని బట్టి ఇక్కడినీటికి గూడ కొంత మేర ఆ గుణం సోకింది అనవలె.

ఇక తరువాతి కాలంలో ఈ కోటను కేంద్రంగా చేసుకొని అమరాబాదు పీఠభూమికి చుట్టు ఈనాటి ప్రతాప రుద్రకోట ఒక పెద్ద ప్రాకారంగా కట్టబడింది. పాలమూరు జిల్లాలో కోయిలకొండ, గణపురం, పానుగల్లు అనేవి గిరిదుర్గాలు. అక్కడ కొండల పైననే కోటలు కట్టబడినవి కాని అవి ప్రతాపరుద్ర కోటవలె కొండ చుట్టు ప్రాకారం కట్టబడిన రాజ్యాలు కావు.. కాగా ఈ ప్రతాపరుద్రకోట ముఖద్వారం పానుగంటికోట ముఖద్వారం రెండు ఒకే విధంగా ఉన్నవి. రెండింటిపై సంస్కృత ఓంకారముంది. ఇదొక యాదృచ్ఛిక సంఘటన. అనాడీ ప్రాకారం లోపల అమరావతి ఉడిమిళ్ల అనే రెండు రాజ్యాలుండేవి. ఆ రెండింటి నడుము ఈనాటి పదర సమీపంలోని పెద్దేటి రేగడిలో ఒక పెద్దనది పారేది. ఆ నది ఆనవాళ్లు అంటే అలల తాకిడికి అలలు అలలుగా అరిగిన బండచెక్కలు మనకు ఆ రేగడిలో లభిస్తవి. కాని ఆ నది పేరేమిటో తెలియదు.

ఇప్పటికి వర్షాకాలంలో అక్కడ 'పులిమొత్త' అనే ఒక కాలువ సాగుతుందట. ఆ రేగడికి చివరన ఒక పెద్ద లోయ ఉంది. దాన్నిపుడు 'భైరవనెల' అంటున్నారు. ఆ నెల ఆనాటి పెద్దేరు దూకియే నేలను కోసి ఏర్పడింది. ఈ లోయకు రెండు వైపులా రెండు గట్లు కొండపై అంచులుగా నిలిచినవి. నది ఆ గుట్టల నడుమ నుండి ఆనాడు ఎంత పెద్దగా పారేదో కాని ఇప్పటికి ఒక కాలువ రూపంలో దాని అవశేషం ఉంది. వర్షాకాలంలో అది కొంత విస్తరిస్తుందట గూడ. పదర నుండి భైరవనెలలోనికి దిగితే దేవరకొండ సరిహద్దు వస్తుంది. అందుకే కాబోలు భైరవనెలలో భైరవప్రతిష్ఠ ఉండేది. ఈ కారణంగానే మొదటి జిల్లాబందీలో అమరాబాదు నల్లగొండకు చేర్చబడి ఉండగా తరువాతి కాలంలో సాలార్ జంగు నల్లగొండజిల్లా పెద్దదై రెవిన్యూ పరిపాలన కష్టమైనందున దాన్ని చీల్చి అమరబాదు పట్టీని నాగర్ కర్నూలు జిల్లాకు కలిపినాడు.

ప్రతాపరుద్రకోట బాగా ఉన్ననాడు కోటలోపల ఒక గ్రామమే ఉన్నది. ఆ కోటపై రాచమల్లు వారనే కాపరులు రాత్రింబవళ్లు కాపలా ఉండేవారు. అందుకు వారికి శ్రీశైలాటవిలో కొంత పొలం ఒక బావి ఇనాముగా నున్నవి. దాన్ని రాచమళ్ల బావి అంటున్నారు. ఆక్కడ రాచమల్లు బావి ఇప్పటికి ఉంది. అది చక్కగా రాయి కట్టబడి ఉంది. ఆనాడు దాని ప్రాకారద్వారం ఈనాడు తలుపుల కురువ అంటున్నారు. రాత్రివేళ మొదటి

> **ప్రతాపగిరి పీఠభూమికి ఆవిధంగా ఎఱుకు దేవరాజు వచ్చేనాటికి కేంద్రంలో శాతవాహనులున్నారు. ఆ వంశంలోని రెండవపులోమావి బలహీనుడు. అతని కాలం క్రీ.శ. 120-153. ఎప్పుడైనా కేంద్రం బలహీనంగా ఉంటే సామంతులు స్వతంత్రులు కావటం సహజం కనుక ఈ పులోమావి కాలంలో ఎఱుకు దేవరాజు ఎపుడో ఒక సమయం చూచి స్వతంత్రుడై నాడు. కాని అనంతరమెంత కాలం పాలించినాడో తెలియదు.**

జాము కాగానే దాని తలుపులు మూసేవారట. అక్కడ ఒక భేరి ఉండి తలుపులు వేసే మొదట ఆ భేరిని ఒకటి రెండు దెబ్బలు వేసి మ్రోగించే వారట. అపుడాదారిని అమరాబాదు, పదర, వంకేశ్వరం మొదలైన గ్రామాలకు వెళ్ళ వలసిన బాటసారులు ఆ భేరీ మ్రోత వినగానే గబగబా పరుగెత్తుకొని వెళ్లి ద్వారం దాటి పడుకొని తెల్లవారు జామున లేచి వెళ్లవలసిన గ్రామాలకు వెళ్లేవారట. ఆనాటి కాపలాదారుల వంశాలిపుడు అమరాబాదు సమీపంలోని తెలుగు పల్లెలో ఉన్నవి.

ప్రతాపరుద్రకోట బస్తీగా ఉన్న కాలంలో దానిలోనికి వెళ్లటానికి ప్రా జ్ఞుఖంగా మాచారం వైపు నుండి బండిదారి ఉంది. అది నాపరాయి పరిచినట్లు కొండరాయి పరిచి గట్టిగా తాటించబడింది. ఆనాడు దొబ్బుడు బండ్లు వడ్డెర బండ్లపై కోటలోనికి కావలసిన సామాను వెళ్లుతుండగా మనుష్యులెడ్ల బండ్లపై వెళ్లేవారట.

కోట ముఖద్వారం ముందు ఆనాడు కాపలా దారులున్న గదుల అవశేషాలిప్పటకి ఉన్నవి. లోపలికి వెళ్లగానే కుడివైపున ఆంజనేయుని గుడి దానికి కొంత దూరంలో ఆనాటి మోటబావి ఉంది. అది చక్కగా రాయి కట్టబడింది. ఎడమవైపున వేణుగోపాలస్వామి ఆలయం దాని వెనుక చిన్నపాటి కుంట ఒకటి ఉన్నవి. అపుడిక్కడ రక్షణ శాఖా మంత్రులు మరియు వారి బలగం మాత్రమే ఉండేదట. వారు నివసించిన ఇండ్లు వానిలో ఆనాటి రోళ్ళు గూడ ఉన్నవి.

కోట ముఖద్వారం తూర్పు ముఖం కాగా బహిర్ద్వారం దక్షిణాభిముఖంగా ఉండి దానికి ఎత్తయిన తలుపులుండేవి. వాని గుసులు, తలుపులు తెరుస్తు మూస్తు ఉండటంలో అవి విరిగి ఏర్పడిన గుర్తులు గల బండలు గూడ ఇపుడక్కడ ఉన్నవి.

కాకతీయుల అనంతరం ముహమ్మదీయుల దాడులు దేశంపై





ఎక్కువ కాగా దేశంలో గ్రామాలు కొంత ఏ కాస్త పెద్దవైనా అక్కడి రాజులు, దొరలు లేదా జాగిర్దార్లు, మఖ్తేదార్లు తమ రక్షణ కోసం కోటలు కట్టుకొనటం ప్రారంభించినారు. ఆ కోటలో దొరలు వారి సేవక పరివారం మజ్జిన, భోజన, శయనశాలలు, విడుదులు, ఆటస్థలాలు, అశ్వశాల, గజశాలలు వీని కన్నిటికి సరిపడ ఆవాసాలకు, ముగ్గుపోసుకున్న పిమ్మటనే ఇక దాని చుట్టు ప్రాకారంగా కోట ముగ్గు పోసుకొని అది కొంత పని జరిగి గోడలు లేచిన పిమ్మట లోపల ఇండ్లు ప్రారంభ మయ్యేవి. ఈ కోటలున్న గ్రామాలు కోట, పేట అని రెండు భాగాలుగా ఉండి కోట గ్రామానికి ఏదో ఒక కొనకు 'కొంత దూరంలో ఉండేది. అట్లా కాక దాన్నే కేంద్రంగా చేసి కున్నపుడూరు గ్రామాలు పేటలు లేదా వీధులు దాని చుట్టు ప్రస్తరింపబడేవి.

ఆనాడు కోటల్లో పనిచేసేవారు రెండురకాలు. కొందరు రాత్రింబవళ్లు పని చేస్తూనే ఉంటారు. వారికి కోటలోనే ఇండ్లుండేవి. మరి కొందరు పాక్షికంగా ఒక పూట మాత్రమే చేసి తను ఇంటికి వెళ్లేవారి ఇండ్లు కోట వెలుపల ఉండేవి. కోటలోపల ఉండే పని వారి వీధిని 'అందరూని ఖిల్లా' అని, పనిచేసి వెళ్లి పోయేవారుండే భాగాన్ని 'బహరూనీ ఖిల్లా' అని ఆనాడు వ్యవహరించేవారు. అయితే ఈ ప్రతాప గిరి కోట అంతా అందరూని ఖిల్లానే గాని బహరూని ఖిల్లా గాదు. ప్రస్తుతం మనం ప్రతాపరుద్రకోట అని పిలిచే గోడ కోటగాదు. అది ప్రతాపగిరి యొక్క ప్రాకారం మాత్రమే. అదంతా పీఠభూమి ప్రదేశం కనుక తమ రాజ్యరక్షణ కోసం ఆనాడు ప్రభువులు కట్టుకున్నారు.

ఈ ప్రాకార ప్రధాన ద్వారం తలపుల కురువ అనే పేర నేడు రోడ్డు ప్రక్కన ఒక శిలాద్వారం నిలిచి ఉంది. ఈ ప్రాకారానికి కోట వెనుక ఒక చిన్న దిడ్డి ఉంది. దాని నుండి బయటకు వెళ్లినపుడొక సన్నని కాలిబాట తీనెవలె ప్రాకారం వెంట కొంతదూరం సాగి క్రిందకు దిగి తలపుల కురువ దాటి మన్ననూరి బాటకు కలుస్తుంది. అక్కడికి వెళ్లిన పిమ్మట నైజాము సర్కారు కట్టించిన 'డాగ్ బంగ్లా కుడివైపు నుండి ఒక కాలి బాట ఉమామహేశ్వరం వెళు తుంది. ఆ దారిని వెళ్లితే నేరుగా పాపనాశనం దగ్గర మెట్లు దిగుతాము. అట్లా దిగి పాపనాశనంలో స్నానం చేసి అట్లాగే ఆ దరి వెంట ముందుకు సాగితే ఉమామహేశ్వరుని గుడిని దాటి దాని ప్రక్కగా ఉన్న భ్రమరాగ్రం ఎడమవైపు నుండి క్రిందికి దిగే మెట్లున్నవి.

కాకతీయుల కాలంనాడు ప్రతాపగిరి కోటలో ఉన్న సైనికులు ఈ దారిగుండానే క్రిందికి దిగి ఉమామహేశ్వరుని దర్శనం చేసుకొని కొండనుదిగి భోగమహేశ్వరం చూచుకొని అక్కడి నుండి ఈనాటి రంగాపురం దాటి కుంచోని చెలుక మూల నుండి కొండ యెక్కి మళ్లీ మొదటి దారికి కలిసి కోటలో పడేవారుట.

నేను మొలకమామిడిలో ఉన్నప్పుడు ఏటా ఏకాదశి శివరాత్రులకు పాపనాశనం దారి మీదుగానే ఉమా మహేశ్వరం చేరేవారు. అపుడొక పర్యాయం పాపనాశనం దారివెంట నడిచి భ్రమరాగ్రం అవతలి నుండి క్రిందికి దిగినాము. అప్పటికే అక్కడి మెట్లన్నీ బాగా కూలిపోయి ఉన్నవి. మేము ఒకరి కొకరు బిగ్గరగా పట్టుకొని ఎలాగో దిగినాము. అప్పటికి భ్రమరాగ్రం క్రింద కాకతీయుల నాటి బండారు రామయ్య చేయించిన తేరు అడుగు చౌకట్టు విరిగిపడి ఉన్నది. పూర్వం శ్రీశైల దేవస్థానం స్థానాధిపతి ఓంకార రాశి పండితుడు ఇక్కడే ఉండేవాడట. ఇపుడు సరిగా గుడిపైన దరికి మట్టిగోడతో ఒక గది, దాని ముందు చిన్న గుండం అక్కడనే గది ముఖ ద్వారానికి కుడివైపున దరికి నృత్య నరసింహమూర్తి శిల్పం ఒకటి రేఖాచిత్రంగా ఉంది. ఆ ద్వారానికి నరసింహద్వారం అని పేరట. శ్రీశైల స్థానాధిపతి ఆ గదిలోనే ఉండే వాడనేవారు. ఇపుడక్కడ అతనిదొక 'మునిగల్లు' ఉంది. మనకు ఈనాడు ఫోటోలెట్లాగో ఆనాటి వారికి వీరగల్లులట్లా ఉండేవి. ఎవరు ఏ రంగంలో కాస్త ప్రసిద్ధమైనా వారి పేరుతో వీరగల్లులను నిలుపుతుండేవారు. అయితే ప్రతాపరుద్రకోటలో మాత్రం నాకు వీరగల్లులు నాగశిల్పాలు ఒక్కటిగూడ కనిపించలేదు. ఈ కోటను గురించి ఇంకా లోతైన పరిశోధన చేస్తే మరెన్నో చారిత్రకవిషయాలు వెలుగులోనికి వస్తాయి.

నివాళి వ్యాసం

# అక్షర నక్షత్రాల నింగిలో నియోగి

జూన్ 14న 2021న పరమపదించిన "నియోగి" స్మృతిలో.....



డా॥ అమ్మిన శ్రీనివాసరాజు

నిత్య సాహితీ అధ్యయన కర్త, నిరంతర పరిశోధనామూర్తి, అక్షరాల ఆదర్శనీయ అక్షర కృషీవలుడు, "నియోగి"గా తెలుగు సాహితీ లోకానికి తెలిసిన ముళ్ళపూడి వెంకటరమణ పత్రికా రచయితగా, కవిగా, సంపాద కునిగా, విశేషమైన కృషి చేశారు.

తన సాహితీ ప్రస్థానంలో అంచె లంచెలుగా ఎదిగి ఎదిగిన కొద్ది ఒదిగి ఉండే సుబుద్ధి గల సాహితీ శ్రీమంతుడు, ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ముళ్లపాడు సీతాదేవి కామేశ్వర రావు దంపతులకు 20 ఆగష్టు 1964 లో జన్మించారు సతుపల్లి లోనే విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న అతను తనకు ఇష్టమైన పత్రికా రంగాన్ని ఎంచుకుని అందులోనే తన ప్రతిభా పాటవాలను కనపరిచారు, సామాజిక స్పృహతో చైతన్యవంతమైన తన భావాలను కవితా ప్రక్రియ ద్వారా పాఠకలోకానికి పంచిన నియోగిలో అంతర్గతంగా అభ్యుదయ భావాలు నిండి ఉన్న, తనకంటూ ఒక ప్రత్యేకమైన భావజాలం ఏర్పాటు చేసుకున్నాడు.

కవిత్వం వ్రాసినా వ్యాసం రాసినా ఆయన శైలి అనన్యసామాన్యం, ఎక్కడ పరుష వాక్యం కానీ, ఆత్మస్తుతి కానీ, అతని రచనల్లో కనిపించదు, వాక్య నిర్మాణంలో అతని భాషా సోయగం మరెవరికీ చిక్కదు, అతనికి అతనే సాటి అనిపించేటట్లుగా ఉంటుంది వారి రచనా శైలి. చక్కని సమన్వయ సాహితీ పరునిగా లోకంపోకడ బాగా తెలిసిన మేధావితనం ఆయన రచనల్లో అడుగడుగునా కనిపిస్తుంది, తనలాంటి భావాలే ఇతరులరచనల్లో కూడా ఉండాలి అనే



మూఢత్వం లేని వాడు, తన భావజాలానికి వ్యతిరేక తత్వం గల వారిని సైతం సమదృష్టితో చూసి గౌరవించిన సహృదయుడు, అజాతశత్రువు నియోగి.

సాహిత్య దృష్టిలో ఎంత మేధావో సమాజం దృష్టిలో అంత అమాయకుడు, తనను తన సాహిత్యాన్ని ఆదరించే వారికే తన అక్షర సేవలు అందించాడు తప్ప

అధిక వేతనాలకు ఆశపడి వివాదాలకు నిలయమైన వాడు కాదు, నిత్యం తన అధ్యయనం లేఖనం ద్వారానే పత్రికా ఉద్యోగ జీవితాన్ని కొనసాగించారు, వర్ధమాన కవులకు రచయితలకు చేయూతనిచ్చిన స్నేహ జీవితను.

ప్రారంభంలో తనదైన బాణిలో సామాజిక భావనతో అన్యాయాలు అక్రమాలపై సుకుమారపు ధర్మాగ్రహం ప్రదర్శిస్తూ అనేక కవితలు రాశారు వాటన్నిటినీ ఆర్తి (2003) నెగళ్లు (2007) వల్లడి (2008) వంటి కవితా సంపుటాలు ప్రచురించి కవన లోకానికి అందించారు.

సామాన్యుల నుండి పండితుల వరకు ఆదరణ పూర్వక అభిమానం అందు కున్నాయి ఆయన కవితా కన్యకలు.

2010 నుంచి హైదరాబాద్ వేదికగా సాగిన నియోగి అక్షర సేద్యం పలు ఆరోగ్యకరమైన సంచలనాలు సొంతం చేసుకుంది, ఆంధ్రప్రభ సాహితీ విభాగం సంపాదకునిగా, సంస్కృతి విభాగం సహాయకునిగా, ఉండి అటు సాహిత్యం ఇటు తెలుగు సంస్కృతికి సంబంధించిన పలు విభిన్న రచనలు వెలువడటానికి ప్రత్యక్ష పరోక్ష

నివాళి వ్యాసం

పాత్రధారుడై... తెలుగు సాహితి సంస్కృతి రుచులను అంతర్జాతీయంగా పరిచయం చేశారు. తానురాస్తూ, రాయిస్తూ, రసవత్తరమైన సాహితీ సృజనకు కేంద్రమైనాడు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు తర్వాత సాగిన సాగుతున్న సాహితీ చైతన్య ఉద్యమానికి నియోగి చేసిన కృషి అజరామరమైనిలుస్తుంది, సాహితీవేత్తలతో వారి భావాలను బట్టి రచనలు చేయించడమే కాక, తనదైన బాణీలో ప్రశ్నావళి సంధించి తద్వారా ఆయా సాహితీవేత్త నుంచి విలువైన విభిన్నమైన సాహితీ సమాచారం రాబట్టి అక్షరీకరించారు. ఈ విధమైన ప్రశ్నావళితో కూడిన సంభాషణ ముఖాముఖి సాహితీ పత్రిక విభాగంలో ప్రవేశపెట్టిన ఘనత కూడా ఆయన సొంతం. ఈ అపురూప సాహితీ సంభాషణలు అన్నిటినీ పుస్తకాల రూపంలో తీసుకురావడం ఆయన సాధించిన మరో సాహితీ విజయంగా చెప్పవచ్చు.

ఉద్యమ స్వరానికి 100 ప్రశ్నలు (2017), అక్షర ముద్రలు (2018), వంద ప్రశ్నలు వేలలాభాలు(2018), నూరు ప్రశ్నలహెూరు ద్వారా జవాబులు జోరు (2017), వంటి పేర్లతో ఆయా సంభాషణల సంపదలను భావి సాహితీవేత్తలకోసం భద్రపరిచారు.

తెలంగాణ సాహిత్య వికాసం కోసం చేసిన కృషిలో భాగంగా కొలిమి (2011), ప్రేరణ (2015), తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర (2017), వంటి గ్రంథాలకు సంపాదకీయ బాధ్యతలు చేపట్టి వాటిని సమున్నతంగా తీర్చిదిద్దారు.

ఆయన చేసిన సాహితీ కృషి అంతా ఒక ఎత్తు అయితే, తను పరిశోధనాత్మకంగా ఎంతో కష్టపడి రాసిన "అక్షర నక్షత్రాలు" వ్యాససంపుటి ఒకటి ఒకెత్తు, తెలుగు సాహితీ చరిత్రలో ఈ ఆధునిక కాలంలో ఇలాంటి పుస్తకం ఇటీవలి కాలంలో రాలేదు. 20వ శతాబ్దంలో కందుకూరి వీరేశలింగం "ఆంధ్రకవుల చరిత్ర" , మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి "ఆంధ్ర రచయితలు" ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ "ఆంధ్ర కవయిత్రులు" గ్రంథాలను వ్రాస్తే.. 21వ శతాబ్దంలో నియోగి , అక్షరాల 111 మంది ఆధునిక సాహితీ వేత్తల వివరాలతో అక్షర నక్షత్రాలు (2019) ప్రచురించారు. ఇది ఈకాలపు తెలుగు అధ్యాపకులకు, పరిశోధకులకు, సాహితీ అభిమానులకు, ఒక దారి దీపంలా నిలుస్తుంది.

345 పేజీల ఈ ఉద్గ్రంథంలో వివిధ ప్రాంతాలు వాదాలకు చెందిన సాహితీ మూర్తుల వివరాలు సచిత్రంగా జనన మరణాలతో క్లుప్తతతో కూడిన వివరణతో తనదైన బాణీలో రాశారు. ఇందులో కేవలం సాహితీవేత్తల సమాచారమే కాక వారి యొక్క అరుదైన వివరాలు, విశేషాలు, నమోదు చేసారు.ఈ సాహితీ సమాచార వేదికగా ప్రముఖ రచయితలనే కాక నేటి తరం పూర్తిగా మర్చిపోయిన మరికొందరు విస్మృత కవులను, ఆధునిక సాహితీ లోకానికి పరిచయం చేశారు.ఈ అక్షర నక్షత్రాలు భారతీ తీర్థ ప్రచురణగా వెలువడి, హైదరాబాద్‌లోనే కాక అమెరికాలోనూ ఆవిష్కరించబడి, ఎందరో ప్రముఖుల ప్రశంసలు పొందింది. నిర్విరామంగా ఆయన చేసిన అక్షర కృషికి నిలువుటద్దంగా నిలిచే ఈ అద్భుత గ్రంథం తెలుగు సాహిత్యంలోనే అరుదైన స్థానంలోనిలిచి నియోగికి ఆస్థానాన్ని పదిలం చేస్తుంది.

**రెండింటికీ భిన్నంగా రాసిన మరో కవితా సంపుటి 'చూస్తుండగానే...'. ఆధునిక జీవితం లోని సంఘర్షణ, మానవ సంబంధాలు, రేపటి మనిషి, రాజు తీర్పు లాంటి అధిక్షేప కవిత్వాలు ఇందులో వున్నాయి. అనగా అనగా... అన్న కవిత ఎందరినో ఆకర్షించింది. సత్యమూర్తి ప్రత్యేకంగా ఆ కవిత మీద ఉత్తరం రాశాడు.**

**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు తర్వాత సాగిన సాగుతున్న సాహితీ చైతన్య ఉద్యమానికి నియోగి చేసిన కృషి అజరామరమైనిలుస్తుంది, సాహితీవేత్తలతో వారి భావాలను బట్టి రచనలు చేయించడమే కాక, తనదైన బాణీలో ప్రశ్నావళి సంధించి తద్వారా ఆయా సాహితీవేత్త నుంచి విలువైన విభిన్నమైన సాహితీ సమాచారం రాబట్టి అక్షరీకరించారు.**

అక్షర నక్షత్రాలు మొదటి భాగంతో సరిపెట్టుకోకుండా.. మరో 111 మందితో రెండవ భాగాన్ని సిద్ధం చేశారు, దీనిలో ఎక్కువగా విస్మృత కవులు రచయితలకు ప్రాధాన్యత ఇచ్చారు, కానీ ఈ ద్వితీయ భాగం పుస్తకంగా రూపుదిద్దు కాకుండానే, ఏడాదిపాటు అనారోగ్యంతో సహజీవనం చేసి జూన్ 14 సోమవారం ఉదయం శాశ్వతంగా కన్నుమూసిన ఈ సాహితీ సవ్యసాచి లేని లోటు పూడ్చలేనిది. ఈ అక్షర సేనానే కృషికిగాను "తెలుగు విశ్వవిద్యాలయం 2018 సంవత్సరపు ఉత్తమ సాహితీ విమర్శ పురస్కారం అందించింది. "సత్తుపల్లి సృజన సాహితి" జీవన సాఫల్య పురస్కారం కూడా అందుకున్నారు. ఎంతకీ తమ సాహిత్య గొప్పతనాన్ని పదిమందికి చెప్పి అభినందించబడాలని అర్రులు చాస్తున్న నవతరం సాహితీలోకంలో, ఇతరుల సాహిత్యంలోని ప్రతిభను ఆదరించి, అభినందించి పది మందికి పరిచయం చేయాలనుకునే నియోగి లాంటి సంస్కారం, నేటితరం సాహితీవేత్తలు అందరికీ గుర్తుంచు కోవలసిన విషయం. సిరిసంపదలు, పుత్రసంతానపు వారసత్వం లేని, నిరాడంబరుడైన నియోగికి తెలుగు నేల నలుదిశల తరగని అక్షర సిరిసంపదలు, మరవని సాహితీ సంతాన వారసులు, ఎప్పటికీ ఉంటాయి, ఉంటారు.

కవిత

# ప్రేమ

డా॥ సరోజ వింజామర



ఎన్నిసార్లు చదివినా మరేముందో తెలుసుకోవాలనే కొంటెతనం.
ఎప్పటికప్పుడు కొత్త రెక్కలు విప్పుకునే శతదళ కుసుమం.

చినుగుతున్నా అతికించుకుని సందూకున దాచే కొత్త పరువాల ఉత్తరం.
పొట్టిగైనా పట్టి దాచుకునే పట్టు పరికిణీ లావణ్యం.
పసుపు బట్టలతో పందిరంతా కనువిందు చేసే వధూవరుల పచ్చదనం.

శిశిరంలో రాల్చుకున్న అందాన్ని తిరిగి రెట్టింపుగా పొందే వసంతం.
విరిసిన పూలన్నీ మనకోసమే అనిపించే గమ్మత్తు తన్మయత్వం.
అంతరంగపు నిత్య బ్రహ్మోత్సవం

చెవులూరించే వాసనతో చూడగానే తినాలనిపించే ఎర్రెర్రని కొత్తావకాయ
మాగినకొద్దీ మధుర్యాన్ని నింపుకునే మామిడి ఫలం.

కళ్ళు విప్పార్చి చూసే సాహసాల రంగుల రాట్నం
అంచులు దొరకని అంతే లేని మిన్ను
పదే పదే ఈదులాడించే తామర కొలను.
తీవ్రమైన రవి తాపాన్ని కూడా మేఘాలతో చల్లబరిచే ఆకాశం
మంచు దుప్పటి కప్పినా బంగారమై మెరిసే హిమవన్నగం
సిరా ఇంకిపోని కలం.
సుగంధ సోయగాల గులాబీ వనం
వసివాడని మల్లెల పరిమళం.
మౌన తరుణాలలో తీయని మురళీనాదం.

నాలుగు జాముకే పోయి రాత్రైనా వదలలేని రైతు తారాడే మాగాణం.
వలపు పంటను తడిమారా చూసుకునే అతని తాదాత్మ్యం

ఎన్ని అడిగినా ఇంకా అడిగినపుడు సరే,
తథాస్తుమనే దేవుని మందహాసం

ప్రేమ పాతదనానికి చిక్కని తాజా అనుభూతి.
మధురోహల మన్మథ విపంచి

# "ఆత్మీయ రత్నాలు" పుస్తక ఆవిష్కరణ ...



ప్రముఖ రచయిత్రి, ప్రపుల్లా ట్రస్ట్ ఛైర్మన్ డా॥ లక్కరాజు నిర్మల రచించిన "ఆత్మీయ రత్నాలు" అనే పుస్తకాన్ని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, టిటియూసి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ మోతే శోభన్‌రెడ్డితో కలిసి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జూన్ 18న నగరంలో ఆవిష్కరించారు. రచయిత్రి లక్కరాజు నిర్మలతో కలిసి జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన నివాసంలో పుస్తకావిష్కరణ అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ డాక్టర్ లక్కరాజు నిర్మల రచించిన పుస్తకం నేటి తరాలకే కాకుండా భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడు తాయని చెప్పారు. నిర్మల రచనలతో పాటు ఆమె చేస్తున్న సామాజిక సేవలను కొనియాడారు. కవులు, రచయితలు పుస్తకాలు రాసి ఎన్నో తెలియని విషయాలని తెలియజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింహారావు, కాంచనపల్లి గోరా, గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ అయాచితం శ్రీధర్‌బాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## "అసాధ్యుడు" పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



యావత్తు భారతదేశం గర్వించదగ్గ రాజకీయనాయకుడు, మహామేధావి, బహుభాషావేత్త, రాజనీతిజ్ఞుడు, సంస్కరణశీలి, తొలి తెలుగు ప్రధాని అయిన పివి నరసింహారావు గురించి మొగ్గల ప్రక్రియలో శ్రీకాంత్ రచించిన అసాధ్యుడు (పివి మొగ్గలు) కవితాసంపుటిని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖా మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆవిష్కరించారు. జూన్ 17న హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లోని తన ఛాంబర్‌లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ముఖచిత్రాన్ని మార్చిన దార్శనికుడు పివి నరసింహారావు అని కొనియాడారు. పివి శతజయంతి సందర్భాన్ని పురస్కరించుకుని యువకవి భీంపల్లి శ్రీకాంత్ పివిని స్మరిస్తూ రాసిన మొగ్గలు ఆలోచింపే విధంగా ఉన్నాయని ఈ సందర్భంగా ఆయనను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ శివార్చక విజయకుమార్, నాగర్ కర్నూలు జిల్లా జెడ్పి వైస్ చైర్మన్ బాలాజీ ఠాగూర్ సింగ్, మధు తదితరులు పాల్గొన్నారు.

## కాలం వెంట కవిత్వంతో ప్రయాణం

కరీంనగర్ కవులు కాలంతో ప్రయాణం చేస్తూ కవిత్వంతో నడుస్తున్నారని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంజయ్య ఎన్నీల ముచ్చట్లు-98 లో అన్నారు. కవిత్వం రాస్తున్న నేపథ్యంలో దానివెంట కొంతవచనం కూడా వస్తుందని దాన్ని కవిత్వం చేయడం అధ్యయనంలో మెరుగుపడుచుకోవడం చేయాలన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు, పెనుగొండ బసవేశ్వర్ తల్లి పాట ఎంతో ఆకర్షణగా నిలిచాయి. బహుభాషావేత్త నలిమెల భాస్కర్, కవులు అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, అంజన్ కుమార్ మెర్గు, బుర్రా తిరుపతి, చింతల దేవేందర్ పాల్గొన్నారు.

## 'సినారె కవిత్వం- నిర్మాణ పద్ధతులు'

తెలుగు శాఖ, పీజీ సెంటర్, ఏవీ కళాశాల నిర్వహించిన విస్తృత ఉపన్యాసం జూమ్ వేదికగా సాగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కవి, కథా రచయిత, విమర్శకులు, తంగేడు సాహిత్య పక్షపత్రిక సహ సంపాదకులు డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన రాజు పాల్గొన్నారు. 'సినారె కవిత్వం- నిర్మాణ పద్ధతులు' అంశంపై ప్రసంగించారు. సినారె పద్యం, గేయం, వచనం లో కవిత్వం రాశారు. గేయంలో కథాకావ్యాలు రచించడం సినారె ప్రయోగంగా అభివర్ణించారు. కర్పూర వసంత రాయలు గేయ కథాకావ్యంలోని విషయాలను సోదాహరణంగా పేర్కొన్నారు. వచన కవిత్వం గేయ గతులు నడిపించిన తీరును వివరించారు. సినారె సినీ గీతాలలోని మాత్రా ఛందస్సు వైవిధ్యం చెప్పారు. ఆయన రాసిన జానపద గీతాలలోని తెలంగాణ భాషను తెలిపారు. ఈ కార్యక్రమంలో పీజీ సెంటర్ సంచాలకులు డాక్టర్ ఎస్. గోపికృష్ణ ఆత్మీయ అతిథిగా, డాక్టర్ కె. లక్ష్మీవిజయ సభాధ్యక్షులుగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి వై. సత్యనారాయణ స్వాగతం పలికారు. బి.జ్యోతి వందన సమర్పణ చేశారు. ఈ సమావేశంలో ఇతర శాఖల అధ్యాపకులు, తెలుగు శాఖ విద్యార్థులు, సాహితీప్రియులు పాల్గొన్నారు.

-తెలుగు శాఖ, పీజీ సెంటర్, ఏవి కళాశాల

స్వీకారం



## విశ్వనాథ జయంతి

వెల్చాల కొండలరావు
శ్రీమతి వి. శైలజా రాణి
సిస్టర్ నివేదిత పబ్లికేషన్స్
హైదరాబాద్
ఫోన్ : 040-23396358
వెల : రూ. 250/-



## సరిత్సాగరం

సరితానరేష్
నల్గొండ
సెల్ : 99663 93456
వెల : రూ.89/-



## చంద్రశాల

అంబటిపూడి వెంకటరత్నం
హైదరాబాద్
సెల్ : 99498 49583
వెల : రూ. 100/-



## నవభారత నిర్మాత పివి... దేశానికే ఠీవి!

డా॥ కర్నాటి లింగయ్య

నందన వనం (సాహితీ సమితి)
సెల్ : 8332947239
వెల : రూ. 99/-



## రెండొకట్ల పదకొండు

సుభాషిణీ తోట
హైదరాబాద్
సెల్ : 9502818774
వెల : రూ. 120/-



## సితాకోక రెక్కలు

దామరకుంట శంకరయ్య

సాహితీ సోపతి
కరీంనగర్
సెల్ : 9440876788
వెల : రూ. 30/-



## లేకావలోకనం

జ్వలిత

జెడి ప్రచురణలు
ఖమ్మం
సెల్ : 9989198943
వెల : రూ. 250/-



## నేను ముంబైకర్ ని..!

నంగెవేని రవీంద్ర
ముంబై
సెల్ : 099871 45310
వెల : రూ.100/-



## జమానా

బి.ఎన్.బి

దర్పా ప్రచురణలు
నిజామాబాద్
సెల్ : 7702307678



## నీ తలపుల్లోనే

సత్యనీలిమ

పాలమూరు సాహితి
మహబూబ్‌నగర్
సెల్ : 9502156813



విద్యానిధి, సాహిత్య పెన్నిధి, నిరంతర సంస్కరణ వాది,
**పూర్వ ప్రధాని పి.వి. నరసింహరావు**
(28 జూలై) జయంతి సందర్భంగా
కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన గవర్నర్ తమిళిసై,
ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు